మంగళవారం
13•2•2018
హైదరాబాద్
•వెల.5 రూ.

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

•సంపుటి 7 •సంచిక 247 •పేజీలు : 16 + (24/16)

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD





హర హర మహాదేవ!

• నేడు మహాశివరాత్రి

విద్యుద్దీప కాంతుల్లో సిరిసిల్ల జిల్లా వేములవాడలోని రాజన్న ఆలయం.
(ఇన్‌సెట్) శ్రీపార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో పూలతో అలంకరించిన స్వామివారి ఉత్సవ విగ్రహం

సుఖసంతోషాలతో జీవించాలి

గవర్నర్ నరసింహన్, సీఎం కేసీఆర్ మహాశివరాత్రి శుభాకాంక్షలు

శివాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి.. అధికారులకు సీఎం సూచన

ఈశ్వరుని కటాక్షంతోనే కాళేశ్వరం పనులు: మంత్రి హరీశ్‌రావు

2

త్వరలో మరో టీఆర్టీ

ఖాళీగా ఉన్న మూడు వేల టీచర్ పోస్టుల భర్తీకి రానున్న నోటిఫికేషన్

పాఠశాల విద్యాశాఖ సన్నాహాలు.. పాఠశాలల హేతుబద్ధీకరణపైనా దృష్టి

అనంతరం పెరుగనున్న మరికొన్ని పోస్టులు.. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించనున్న శాఖ డైరెక్టర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలోని పాఠశాల విద్యాశాఖలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల భర్తీకోసం త్వరలో మరో టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్టీ) నోటిఫికేషన్ విడుదలచేయాలని ఆ శాఖ ఉన్నతాధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం విద్యాశాఖలో ఖాళీగా ఉన్న 7,892 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ నుంచి నోటిఫికేషన్ వెలువడింది. ఈ నెల మూడో వారంలో రాత పరీక్షలను నిర్వహించి, ఆ వెంటనే ఫలితాలను విడుదల చేయనున్నారు. ఈ ప్రక్రియ మొత్తం రెండు నెలల్లో ముగిసే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెప్తున్నారు. దాని తర్వాత వెంటనే మరో టీఆర్టీ నోటిఫికేషన్‌కు జారీ చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. తదుపరి నోటిఫికేషన్‌లో భర్తీ చేయటానికి అవకాశం ఉన్న మూడు వేల పోస్టులను గుర్తించామని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. వీటిని టీఎస్‌పీఎస్సీ ద్వారా భర్తీచేయాల్సి ఉంటుందని తెలిపారు. సర్కారీ పాఠశాలలను బలోపేతంచేసి, ఉత్తీర్ణత శాతం పెంచడం, విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఉంది. ఈ క్రమంలోనే ఖాళీగా ఉన్న అన్నిరకాల ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేసేందుకు విద్యాశాఖ ప్రణాళికలను రూపొందిస్తున్నది. ఈ ఏడాది సెప్టెంబర్‌వరకు పదవీ విరమణ, ట్రాన్స్‌ఫర్, బదిలీలతో పాటు పాఠశాలలు, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ వల్ల మరికొన్ని ఖాళీలు అదనంగా ఏర్పడే అవకాశాలున్నాయని తెలుస్తున్నది.

వేసవిలోనే రేషనలైజేషన్

వచ్చే వేసవి సెలవులలో ఉపాధ్యాయుల, పాఠశాలల రేషనలైజేషన్ ప్రక్రియ నిర్వహించేందుకు ఆ శాఖ ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. విద్యార్థులకు తగిన సంఖ్యలో ఉపాధ్యాయులు ఉన్నారా? అనే విషయాన్ని ఈ ప్రక్రియలో గుర్తిస్తారు. విద్యార్థులకంటే ఉపాధ్యాయుల సంఖ్య ఎక్కువ ఉంటే.. అదనంగా ఉండే టీచర్లను పొరుగున ఉండే స్కూళ్లకు బదిలీ చేయనున్నారు. తద్వారా స్కూళ్ల హేతుబద్ధకరణతోపాటు ఉపాధ్యాయుల రేషనలైజేషన్ ప్రక్రియను ఒకే దశలో పూర్తిచేయాలని భావిస్తున్నారు. రేషనలైజేషన్ ప్రక్రియ, ప్రమోషన్లు, బదిలీలు వంటి పలు రకాల సమస్యలపై చర్చించడానికి ఈ నెల 15న ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ జీ కిషన్ పేర్కొన్నారు.

టీఆర్టీ అభ్యర్థులకు మరోసారి ఎడిట్ ఆప్షన్

తాజా టీఆర్టీ నోటిఫికేషన్ ప్రకారం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ వివరాల నమోదులో దొర్లిన పొరపాట్లను సరిదిద్దుకునేందుకు చివరిక్షణంలో కూడా టీఎస్‌పీఎస్సీ అవకాశం ఇచ్చింది. ఇప్పటికే రెండు దఫాలుగా ఎడిట్ అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. ఈ నెల 15న మరోమారు ఎడిట్ చేసుకోవచ్చునని తెలిపింది. రెండు అవకాశాలు ఇచ్చినప్పటికీ.. అభ్యర్థులు పొరపాట్లు చేసినందునే ఈ అవకాశం ఇస్తున్నట్లు పేర్కొంది. వివరాలు పూర్తిగా సమీక్షించుకున్న తర్వాతే సబ్‌మిట్ ఆప్షన్ నొక్కాలని, ఈ అవకాశం ముగిసిపోతే ఎట్టి పరిస్థితుల్లో మరో అవకాశం ఇవ్వబోమని స్పష్టంచేసింది. పరీక్ష గడువు సమీపిస్తుండటం, హాల్‌టికెట్లు రూపొందించాల్సిన నేపథ్యంలో వెంటనే తగు జాగ్రత్తలతో సవరణలు చేసుకోవాలని సూచించింది.



ఆబిడ్స్ అడ్డాగా

హవాలా రాకెట్

- ఐరన్ కంపెనీల జీరో దందా
- పన్నులెగ్గొట్టి సరుకు సరఫరా
- హవాలా మార్గంలో నగదు బదిలీ
- ఆరుగురిని అరెస్టు చేసిన టాస్క్‌ఫోర్స్
- రూ.కోటీ నలభై లక్షలు స్వాధీనం
- కీలక సూత్రధారి గుజరాత్‌కు చెందిన జయేశ్‌పటేల్
- వాట్సాప్ గ్రూపులో దందా
- ఏటా రూ.200 కోట్ల టర్నోవర్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

సరుకు వస్తుంది.. నగదు చేరాల్సిన వాళ్లకు చేరిపోతుంది! కానీ ఏదీ అధికారికంగా కాదు! పన్నులూ ఉండవు! అంతా బ్లాక్ మార్కెట్. జీరోదందా! పైగా.. చెలామణిలోకి నల్లడబ్బు! హవాలా మార్గంలో కొన్నేళ్లుగా సాగుతున్న ఈ దందా గుట్టును నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. ప్రభుత్వానికి పన్నులు ఎగ్గొడుతూ హవాలా మార్గంలో బ్లాక్ మనీని చెలామణి చేస్తున్న ముఠాను పట్టుకున్నారు. ఈ కేసులో కీలక సూత్రధారి, గుజరాత్ నుంచి వచ్చి ఇక్కడ

మిగతా 2వ పేజీలో

పాక్ మూల్యం చెల్లించక తప్పదు

సుంజ్వాన్ ఉగ్రదాడిపై రక్షణ మంత్రి నిర్మల హెచ్చరిక 5

విమాన ఇంజిన్లు మేడిన్ తెలంగాణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఇక్కడి నుంచే ప్రపంచానికి ఎగుమతి

ఆదిభట్లలో టాటా, జీఈ జాయింట్ వెంచర్

- ఏరో-ఇంజిన్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు భూమిపూజ
- మూడు వేల కోట్లకుపైగా పెట్టుబడులు
- ఏరోస్పేస్ రంగానికి మరింత ఊతం
- ఐటీ, పరిశ్రమల మంత్రి కే తారక రామారావు

ప్రపంచ స్థాయి ప్రఖ్యాత పరిశ్రమలకు వేదిక అవుతున్న తెలంగాణ.. అతి త్వరలో మరో ఘనతను సాధించనుంది. మేడిన్ తెలంగాణ ముద్రతో విమాన ఇంజిన్లు ఇక్కడి నుంచి వివిధ ప్రపంచ దేశాలకు ఎగుమతి కానున్నాయి. ఇందుకు ఉద్దేశించిన ఏరో-ఇంజిన్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను దేశీయ పారిశ్రామిక దిగ్గజం టాటా గ్రూప్, అంతర్జాతీయ దిగ్గజం జనరల్ ఎలక్ట్రిక్ (జీఈ) సంయుక్తంగా ఏర్పాటు చేయనున్నాయి. ఆదిభట్లలో ఏర్పాటు చేయబోయే ఏరో- ఇంజిన్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రం భూమి పూజ కార్యక్రమం సోమవారం హెచ్‌ఐసీసీలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కే తారకరామారావు చేతుల మీదుగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రం ఏర్పాటు తెలంగాణ ఏరోస్పేస్ రంగానికి మరింత ఊతం ఇస్తుందని అన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు తెలంగాణను ఎంపిక చేసుకోవటం పట్ల టాటా, జీఈ (జనరల్ ఎలక్ట్రిక్) కంపెనీలకు కృతజ్ఞతలు తెలిపారు. రెండు దిగ్గజ సంస్థలు జాయింట్ వెంచర్ ఏర్పాటుచేయడం గొప్ప విషయమన్నారు. ఇక్కడ నెలకొన్న ఎకో సిస్టం, నైపుణ్యం కలిగిన విద్యార్థులు ప్రపంచ స్థాయి సంస్థలను ఆకర్షించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని మంత్రి చెప్పారు. రెండు స్ట్రాంగ్ ఎయిరోస్పేస్ పార్కులు, ఐదు ఎయిర్ స్ట్రిప్స్‌కు అదనంగా మరో తయారీ కేంద్రం హైదరాబాద్‌లో ఉండటం ఇక్కడి విమానయాన రంగం అభివృద్ధికి దోహదం చేస్తుందని అన్నారు. ఒప్పందం చేసుకున్న స్వల్ప వ్యవధిలోనే

మిగతా 2వ పేజీలో



నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో వడగండ్ల వాన

బాసర మండలంలో వానకు వ్యక్తి మృతి 14





• స్వచ్ఛ సర్వేక్షణ్‌లో వెలుగుల బాట

వడోదర రికార్డును ఊడ్చేసిన హైదరాబాద్

హైదరాబాద్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్-2018 కార్యక్రమం సందర్భంగా సోమవారం వీఎస్టీ చౌరస్తా నుంచి బాగ్‌లింగంపల్లిలోని అంబేద్కర్ కాలేజీ వరకు 15,320 మంది ఒకేసారి చీపుర్లతో రోడ్లను ఊడుస్తూ సరికొత్త రికార్డును నెలకొల్పారు.
(ఇన్‌సెట్) ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్కూల్ పిల్లలతో కరచాలనం చేస్తున్న మంత్రి కేటీఆర్

2



మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు



కేంద్ర మంత్రి రాంకృపాల్‌యాదవ్

కాళేశ్వరం, భగీరథ.. అద్భుతాలు

- సామాజిక తెలంగాణ లక్ష్యంగా కేసీఆర్ పాలన
- మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు ప్రశంస
- కేంద్ర పథకాల అమలు తీరు బాగుంది
- రాష్ట్రం పనితీరుపై కేంద్ర సహాయ మంత్రి రాంకృపాల్‌యాదవ్ సంతృప్తి
- రూరల్ టెక్నాలజీ పార్క్ కృషికి అభినందనలు

హైదరాబాద్, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ/రాజేంద్రనగర్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ ప్రాజెక్టులు, అమలుచేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలపై ప్రముఖుల ప్రశంసల జల్లు కురుస్తూనే ఉన్నది. సోమవారం వేర్వేరు కార్యక్రమాల్లో పాల్గొన్న మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి రాంకృపాల్‌యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందనలతో ముంచెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం, మిషన్ భగీరథ.. అద్భుతాలని, రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరు బాగున్నదని అన్నారు. సోమవారం సిరిసిల్లలో రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కార కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మహారాష్ట్ర

మిగతా 11వ పేజీలో

ఎస్సీల అభివృద్ధికి 14,375 కోట్లు

- ప్రత్యేక అభివృద్ధి నిధి చట్టం దేశానికే ఆదర్శం
- 50 రోజుల్లో పూర్తిస్థాయి నిధుల ఖర్చుకు ప్రణాళికలు
- పారదర్శకంగా అభివృద్ధి నిధి పద్దు ఖర్చులు
- ఎస్సీ అభివృద్ధిశాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి వెల్లడి



హైదాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ రాష్ట్రం ఏర్పడేవరకు దళితుల ప్రగతి నినాదాలకే పరిమితమైందని, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పాలనలో వారి ఆర్థిక ప్రగతికి బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యం కల్పించారని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధిశాఖమంత్రి జీ జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సచివాలయంలో మంత్రి అధ్యక్షతన ఎస్సీ కులాల ప్రత్యేక అభివృద్ధినిధి చట్టం అమలుపై ఎస్సీ అభివృద్ధి, ఇతర అనుబంధశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ దళితుల అభివృద్ధికోసం తెలంగాణ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనివిధంగా మొదటిసారి ఎస్సీ అభివృద్ధి నిధి చట్టాన్ని అమల్లోకి తీసుకుచ్చిందని, ఈ చట్టం దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. చట్టం అమల్లోకి వచ్చిన మొదటి ఏడాదే పెద్దఎత్తున నిధులు కేటాయించినట్టు

మిగతా 2వ పేజీలో

సుఖసంతోషాలతో జీవించాలి

గవర్నర్ నరసింహన్, సీఎం కేసీఆర్ మహాశివరాత్రి శుభాకాంక్షలు





హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం ప్రజలందరిలో సోదరభావాన్ని, ప్రేమానురాగాలను పంచాలని, ఆధ్యాత్మికభావాన్ని పెంచాలని గవర్నర్ ఆకాంక్షించారు. మహాశివరాత్రి పవిత్ర దినమని, ప్రజలు ఈ పండుగను నియమ, నిష్ఠలతో నిర్వహించుకోవాలని తన సందేశంలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించేలా భగవంతుడు దీవించాలని సీఎం కేసీఆర్ ప్రార్థించారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తుల రద్దీ ఎక్కువయ్యే అవకాశం ఉన్నందున శివాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లుచేయాలని అధికారులు, పాలకమండళ్లు, నిర్వాహకులకు ముఖ్యమంత్రి సూచించారు.

ఈశ్వరుని కటాక్షంతోనే కాళేశ్వరం పనులు: హరీశ్‌రావు

ఈశ్వరుని కటాక్షంతోనే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పనులు వేగంగా సాగుతున్నాయని నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు మహాశివరాత్రి శుభాకాంక్షల సందేశంలో పేర్కొన్నారు. పరమేశ్వరుని కటాక్షంతో వచ్చే మహాశివరాత్రికల్లా కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయి రాష్ట్రం సస్యశ్యామలం కావాలని, రైతుల కుటుంబాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు.



కాళేశ్వరంలో జాతర ప్రారంభం

దక్షిణ కాశీ శైవక్షేత్రం.. త్రిలింగ క్షేత్రాల్లో ఒకటైన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని శ్రీ ముక్తీశ్వర స్వామి దేవస్థానంలో మహా శివరాత్రి జాతర ప్రారంభమైంది. సోమవారం మంథని ఎమ్మెల్యే పుట్ట మధు ఉత్సవాలను ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు మూడు రాష్ట్రాల నుంచి అశేష సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. వారి సౌకర్యార్థం ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– కాళేశ్వరం



అమరావతిలోనే తాత్కాలిక హైకోర్టు

అమరావతి, నమస్తే తెలంగాణ: అమరావతిలో హైకోర్టు భవనాలు నిర్మించే ప్రాంతంలో లండన్‌కు చెందిన నార్మన్ ఫోస్టర్ రూపొందించిన ప్లాన్ ప్రకారం తొలుత సిటీ సివిల్ కోర్టు నిర్మించాలని నిర్ణయించినట్టు ఏపీ మున్సిపల్‌శాఖ మంత్రి పీ నారాయణ వెల్లడించారు. ఏపీ సచివాలయంలో సోమవారం రాత్రి సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షత జరిగిన ఏపీసీఆర్‌డీఏ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. రూ.108 కోట్లతో 8 నెలల్లో నిర్మాణం పూర్తిచేస్తామని, ఇందులోనే తాత్కాలికంగా హైకోర్టు ఏర్పాటు చేస్తామని చెప్పారు.



సోమవారం హెచ్ఐసీసీలో ఏరో-ఇంజిన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు భూమిపూజ కార్యక్రమంలో మంత్రులు కేటీఆర్, మహేందర్‌రెడ్డి. చిత్రంలో టాటా, జీఈ గ్రూపుల ప్రతినిధులు కూడా ఉన్నారు.

విమాన ఇంజిన్లు మేడిన్ తెలంగాణ

మొదటిపేజీ తరువాయి...

కేంద్రం ఏర్పాటుకు భూమి పూజ చేసుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి తెలంగాణ నుంచి తొలి విమాన ఇంజిన్ తయారవుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. అంతకుముందు జీఈ-సౌత్‌ఏసియా అధ్యక్షుడు విశాల్‌వాంచూ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టడంలో మంత్రి కేటీఆర్ పాత్ర ప్రశంసనీయమన్నారు. కేటీఆర్ చొరవవల్లే తక్కువ సమయంలో కేంద్రం ఏర్పాటుకు భూమి పూజ చేసుకున్నామని చెప్పారు. భారత ఏవియేషన్ రంగానికి మంచి భవిష్యత్ ఉందని, 2025 నాటికి మూడో స్థానానికి చేరుతుందని చెప్పారు. టాటాసన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ అధ్యక్షుడు బన్‌మలి ఆగ్రావాలా మాట్లాడుతూ భారత్‌లో ఏవియేషన్ రంగం అభివృద్ధికి విస్తృత అవకాశాలున్నాయని అన్నారు. తాజా పెట్టుబడుల ద్వారా అత్యంత నైపుణ్యం కలిగిన ఉద్యోగాలను సృష్టించడంతోపాటు అత్యున్నత సరఫరా చైన్ వృద్ధి కానుందని చెప్పారు. తద్వారా అంతర్జాతీయం గా పోటీతత్వం కలిగిన ఉత్పాదక పర్యావరణ వ్యవస్థ దేశంలో అభివృద్ధి అవుతుందన్నారు. కార్యక్రమంలో రవాణాశాఖమంత్రి మహేందర్‌రెడ్డి, టాటా, జీఈ గ్రూపుల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫలించిన మంత్రి కేటీఆర్ కృషి

తెలంగాణలో పెట్టుబడుల వెల్లువ కొనసాగుతున్న వేళ.. ఏరోస్పేస్ విభాగంలో అంతర్జాతీయంగా పేరున్న జీఈ సంస్థ నగరంలో తమ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నది. ఇందులో మంత్రి కేటీఆర్ కీలకపాత్ర పోషించారు. ఏడాదిపాటు శ్రమించారు. అమెరికా, ఢిల్లీలో జీఈ సంస్థ చైర్మన్ జాన్ ఎల్ ఫ్లానరీతో కలిసి చర్చించారు. తెలంగాణలో పెట్టుబడులకున్న అనుకూలవాతావరణం గురించి చెప్పి మెప్పించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అత్యుత్తమ విధానాల గురించి, ముఖ్యంగా టీఎస్ ఐపాస్, పెట్టుబడుల వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. టాటా సంస్థ దిగ్గజం రతన్‌టాటాకు ఈ కేంద్రం ఏర్పాటు ఆవశ్యకతను గురించి కేటీఆర్ వివరించారు. దాంతో ఇరు సంస్థలు హైదరాబాద్‌లో కేంద్రం ఏర్పాటుకు గత డిసెంబర్‌లో ఒప్పందం కుదుర్చుకున్నాయి.

లీప్ ఇంజిన్లకు మంచి డిమాండ్

ఏరోస్పేస్ హబ్‌గా దూసుకుపోతున్న హైదరాబాద్‌కు ఏరో-ఇంజిన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటువల్ల మరింత పేరు రానుంది. ఈ కేంద్రంలో సీఎఫ్‌ఎం ఇంటర్నేషనల్‌కు చెందిన లీప్ ఇంజిన్ విడిభాగాలను తయారుచేస్తారు. సీఎఫ్‌ఎంను జీఈ, శాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేశారు. విమానాల తయారీలో లీప్ ఇంజిన్లకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. నూతనటెక్నాలజీ, ఇంధన సామర్థ్యం ఇతర అంశాల దృష్ట్యా ఇవి నంబర్ వన్ స్థానంలో ఉంటున్నాయి. ఎయిర్‌బస్, బోయింగ్ అండ్ కొమాక్ విమానాల్లో ఈ ఇంజిన్లనే వినియోగిస్తారు. ప్రస్తుతం మనదేశ వాయుసేన ఉపయోగించే యుద్ధ విమానాల్లో దాదాపుగా జీఈ సంస్థ ఇంజిన్లే ఉంటాయి. కమర్షియల్ ఏవియేషన్ చరిత్రలో అత్యంత వేగంగా అమ్ముడుపోయే ఇంజిన్లుగా వీటికి పేరుంది. తెలంగాణలో ఉత్పత్తిచేసే ఈ ఇంజిన్ల విడిభాగాలు సీఎంఎఫ్ ఇంటర్నేషనల్‌కు ఎగుమతి అవుతాయి.

వడోదర రికార్డును తుడిచిపెట్టిన హైదరాబాద్!

- ఒకేసారి రోడ్లుఊడ్చిన 15,320 మంది
- స్వచ్ఛసర్వేక్షణ్‌లో అగ్రభాగాన నిలుపాలి: మంత్రి కేటీఆర్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లో ఈ నెల 15 నుంచి చేపట్టనున్న స్వచ్ఛ సర్వేక్షణ్ 2018 కార్యక్రమం సందర్భంగా సోమవారం నిర్వహించిన ప్రచారోద్యమం సరికొత్త రికార్డు సృష్టించింది. విద్యార్థులు, ఉద్యోగులతోపాటు విభిన్నవర్గాలకు చెందిన 15,320 మంది ఒకేసారి మూడునిమిషాల పాటు చీపుర్లతో రోడ్లను ఊడ్చి.. కొత్త రికార్డు నెలకొల్పారు. గతంలో 5,058 మందితో గుజరాత్‌లోని వడోదరలో నెలకొల్పిన గిన్నీస్ రికార్డును అధిగమించారు. దీనితోపాటు యూఎస్‌కు చెందిన హైరేంజ్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ కూడా దీనిని ప్రపంచ రికార్డుగా ప్రకటించింది. రాంనగర్ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వీఎస్టీచౌరస్తా నుంచి బాగ్‌లింగంపల్లిలోని అంబేద్కర్ కాలేజీ వరకు నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ప్రభుత్వ సలహాదారు జీ వివేక్, మాజీ మంత్రి వినోద్ తదతరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నగరాన్ని అగ్రభాగాన నిలుపాలని విజ్ఞప్తిచేశారు. తడి, పొడి చెత్తపై ఇండ్లలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యార్థులపైనే ఉన్నదని మంత్రి కేటీఆర్ చెప్పారు.



స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రచారంలో భాగంగా హైదరాబాద్‌లోని రాంనగర్‌లో విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ వర్గాలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, మాజీఎంపీ వివేక్, మాజీమంత్రి వినోద్, కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు జనార్దన్‌రెడ్డి, చిరంజీవులు తదితరులు ఉన్నారు.

గ్రామీణ రోడ్లకు 4.65 కోట్లు

వెటర్నరీ వర్సిటీకి రూ.15 కోట్లు విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామీణ రోడ్ల నిర్వహణకు ప్రభుత్వం రూ.4.65 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆయా గ్రామాల్లో రోడ్ల మరమ్మతులు, నిర్వహణ కోసం 2017-18 ఆర్థిక సంవత్సరానికి ఈ నిధులను కేటాయించారు. అదేవిధంగా 2017-18 ఆర్థిక సంవత్సరంలో పీవీ నర్సింహారావు వెటర్నరీ యూనివర్సిటీ నిర్వహణ, జీతభత్యాల కోసం రూ.15 కోట్లను విడుదలచేసింది.

ముహూర్తం



సూర్యోదయం: 6.47 గంటలకు



సూర్యాస్తమయం: 6.13 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, కృష్ణపక్షం త్రయోదశి రాత్రి 10.37 వరకు, నక్షత్రం: పూర్వాషాఢ తె. 2.05 వరకు తదుపరి ఉత్తరాషాఢ, అమృతఘడియలు: రాత్రి 9.47 నుంచి 11.23 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 3.22 నుంచి సాయంత్రం 4.47 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 9.05 నుంచి 9.50వరకు, తిరిగి మధ్యాహ్నం 2.25 నుంచి 3.10 వరకు, వర్జ్యం: ఉదయం 11.02 నుంచి 12.38 వరకు.

ఎస్సీల అభివృద్ధికి 14,375 కోట్లు



సోమవారం సచివాలయంలో ఎస్సీల ప్రత్యేక అభివృద్ధినిధి చట్టం అమలుపై సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎస్సీ గురుకుల విద్యాలయాల కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, వ్యవసాయశాఖ కమిషనర్ జగన్‌మోహన్ కూడా ఉన్నారు

మొదటిపేజీ తరువాయి...

తెలిపారు. 16.32 శాతం జనాభా నిష్పత్తి ప్రకారం ప్రభుత్వం 2017-18 ఆర్థిక సంవత్సరానికి రూ.14,375 కోట్లు కేటాయించిందని, అందులో ఇప్పటివరకు రూ.6,689 కోట్లు ఖర్చుచేసినట్టు మంత్రి వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేనాటికి పూర్తిస్థాయిలో నిధులు ఖర్చుచేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు చెప్పారు. మొత్తం 197 సంక్షేమ పథకాలతోపాటు 219 ఉపసంక్షేమ పథకాలతో దళితుల అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికలు సత్ఫలితాలిస్తున్నాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎస్సీ స్టడీసర్కిల్ హైదరాబాద్‌లో మాత్రమే ఉందని, తెలంగాణ వచ్చాక అన్ని జిల్లాకేంద్రాల్లో ఏర్పాటు చేసుకున్నామన్నారు. దళితుల అభివృద్ధి కోసం ఖర్చుపెట్టే ప్రతిపైసా పారదర్శకంగా ఉండేలా చూడటంతోపాటు లబ్ధిదారుల వివరాలను ప్రజాప్రతినిధులకు అందించామని చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రత్యేకనిధి చట్టం దేశంలో ప్రత్యేక చర్చకు తెరలేపిందని, బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగంగానే ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ చట్టాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రత్యేక అభివృద్ధినిధి చట్టం ద్వారా లబ్ధిపొందినవారి వివరాలు ఎప్పటికప్పుడు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు. సమావేశంలో ఆర్థికశాఖ ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు, ఎస్సీ అభివృద్ధిశాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రసాద్, పాఠశాల విద్య డైరెక్టర్ కిషన్, ఎస్సీ గురుకుల విద్యాలయాల సొసైటీ కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలే కాంగ్రెస్‌ను ఎన్‌కౌంటర్ చేస్తారు

ప్రజలే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఎన్‌కౌంటర్ చేస్తారని, ఆ పార్టీ నాయకులను మోరీలో వేస్తారని మంత్రి జీ జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను ఎన్‌కౌంటర్ చేయాలంటూ కాంగ్రెస్ నాయకులు పేర్కొనడాన్ని విలేకరులు ప్రస్తావించగా ఎన్నికల్లో అధికారపార్టీని ఎదుర్కొలేకే దిగజారుడు విమర్శలు చేస్తున్నారని, ప్రజలే వారికి బుద్ధిచెపుతారని అన్నారు. నకిరేకల్, సూర్యాపేటలో ఒక్క రాజకీయకేసు కూడా లేదని స్పష్టంచేశారు. జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గాల్లో హత్యలు ఎందుకు జరుగడం లేదని, ఒక్క నల్లగొండలోనే ఎందుకు జరుగుతున్నాయో ప్రజలు గమనిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. మొన్న హత్య జరిగిన స్థలంలోనే 20 ఏండ్ల క్రితం మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహను కాంగ్రెస్‌నాయకులు హత్య చేయించారని ఆరోపించారు. అన్నా, తమ్ముడు అన్నవాళ్లే తన భర్తను చంపారంటూ శ్రీనివాస్ భార్య ఏడ్చిందని, ఆమె మొదట ఇచ్చిన ఫిర్యాదును చూసినా ఇదే విషయం తెలుస్తుందని చెప్పారు. శ్రీనివాస్‌కు అపాయం ఉన్నట్టు ఎవరికైనా ఫిర్యాదుఇచ్చారా? అని మంత్రి ప్రశ్నించారు.కాంగ్రెస్ నాయకులు లేవడంతోనే అబద్ధాలు మాట్లాడుతున్నారని అన్నారు. జిల్లా చరిత్రలో కాంగ్రెస్‌పార్టీ వల్లే రాజకీయహత్యలు జరిగాయని, టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత మూడేండ్లుగా ప్రజలు ప్రశాంతంగా ఉంటున్నారని చెప్పారు.

ఆబిడ్స్ అడ్డాగా హవాలా రాకెట్

మొదటిపేజీ తరువాయి...

స్థిరపడిన బంగారం, వజ్రాల వ్యాపారి జయేశ్‌పటేల్, అతని వద్ద పనిచేస్తున్న వనరాజ్‌సింగ్, పటేల్ ప్రదీప్‌కుమార్, రాయలసీమ స్టీల్ రీ రోలింగ్ ఏజెంట్ గణేశ్, స్కాన్ ఎనర్జీ ఏజెంట్ విఘ్నేశ్వర్, స్కాన్‌ఎనర్జీ చీఫ్ ఫైనాన్షియల్ అధికారి అరుణ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకొని, వారినుంచి రూ.1,40,80,000 నల్లధనాన్ని స్వాధీనం చేసుకున్నారు. రాయలసీమ రోలింగ్ కంపెనీ, స్కాన్ ఎనర్జీ కంపెనీలు జీరోదందాలు నిర్వహిస్తూ, ఆ దందాకు సంబంధించిన నగదును హవాలా ద్వారా చేరవేస్తున్నారని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీవీ శ్రీనివాసరావు తెలిపారు. స్కాన్ ఎనర్జీ అండ్ పవర్ లిమిటెడ్, రాయలసీమ స్టీల్ రోలింగ్ కంపెనీలు ఇనుమును ఉత్పత్తిచేస్తాయి. ఈ రెండు సంస్థలు ముడి సరుకును వివిధ రూపాలలో కొని, తయారైన ఇనుముకు జీఎస్టీ, తదితర పన్నులు ఎగ్గొడుతూ సరఫరా చేస్తున్నాయి. స్కాన్ ఎనర్జీ, బిల్లులు లేకుండా ఇనుమును ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌కు పంపించగా, అక్కడి వ్యాపారి నుంచి వచ్చిన ఆదేశాలతో బ్లాక్ మనీని పటేల్ కంపెనీ హవాలా మార్గంలో స్కాన్ కంపెనీకి అందించిందని ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. రాయలసీమ స్టీల్ రోలింగ్ సంస్థ సైతం ఇలాగే జీరో దందా నిర్వహించి హవాలా మార్గంలో నిధులను సమకూర్చుకుంటున్నదని సీపీ తెలిపారు. కేసు వివరాలను సోమవారం ఆదాయ పన్ను శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజేశ్వర్‌రెడ్డితో కలిసి సీపీ వీవీ శ్రీనివాసరావు విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

హవాలా కోసం ఆఫీసు, యంత్రాంగం

గుజరాత్‌కు చెందిన జయేశ్‌కుమార్‌పటేల్ అలియాస్ అతుల్ 2009లో హైదరాబాద్‌కు వచ్చి ఆబిడ్స్ ప్రాంతంలో స్థిరపడి బంగారం, వజ్రాల వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాడు. ఈ వ్యాపారం చేస్తున్న క్రమంలోనే దేశవ్యాప్తంగా ఉన్న హవాలా వ్యాపారులతో పరిచయాలు ఏర్పడ్డాయి. హవాలా ద్వారా డబ్బులు ఎక్కువ సంపాదించవచ్చని 2013లో ఈ దందాలోకి వచ్చాడు. అబిడ్స్ చిరాగ్ అలీలేన్‌లో ఉన్న మహాలక్ష్మిజెమ్స్ అండ్ జువెలర్ మాల్ దుకాణంపైనే మూడో అంతస్థులో హవాలా మనీ ట్రాన్స్‌ఫర్ కార్యాలయాన్ని ప్రారంభించి, ప్రతి ఏడాది రూ.200 కోట్ల టర్నోవర్ చేస్తున్నాడు. పెద్ద నోట్ల రద్దు తర్వాత కూడా అతని దందాకు ఎక్కడా ఆటంకాలు ఎదురుకాలేదు. హవాలా వ్యాపారంలోని ఏజెంట్లు, వ్యాపారులతో వాట్సాప్ గ్రూప్‌ను తయారుచేశాడు. హవాలా డబ్బు కావాలనుకునే వారు వంద, యాభై రూపాయల నోట్‌ను జయేశ్‌పటేల్ నంబర్‌కు వాట్సాప్‌లో పంపిస్తే.. దాని ఆధారంగా డబ్బును పంపిణీ చేస్తుంటాడు.

పక్కా సమాచారంలో దొరికిన లింకులు

హవాలా దందాపై నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు బృందానికి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఏపీ 09 సీఎం 1406 హోండా యాక్టివాపై వెళ్తున్న బోనబోయిన విఘ్నేశ్వర్‌ను ఆపి తనిఖీచేయగా అతని బ్యాగ్‌లో రూ.65 లక్షల నగదు లభించింది. హోండా యాక్టివా ఏపీ 10 ఏడబ్ల్యూ 636పై వెళ్తున్న గణేశ్ సత్యనారాయణ సాబూను ఆపి తనిఖీ చేయగా రూ.10 లక్షలు లభ్యమయ్యాయి. వీరిద్దరు ఇచ్చిన సమాచారంతో జయేశ్‌కుమార్ పటేల్‌కు చెందిన హవాలా కార్యాలయంలో పోలీసు అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో రూ.18.45 లక్షలు దొరికాయి. పటేల్‌ను విచారించడంతో స్కాన్ ఎనర్జీ సంస్థకు డబ్బును పంపిణీ చేస్తున్నట్టు ధ్రువీకరించాడు. దీంతో స్కాన్ ఎనర్జీ కార్యాలయంలో సోదాలు నిర్వహించి ఆ సంస్థ చీఫ్ ఫైనాన్సియల్ అఫీసర్ వద్ద నుంచి రూ.45.35 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. జయేశ్‌పై ఆదాయంపన్ను శాఖ 2014లోనే కేసు నమోదు చేసింది. ఇంత నగదు ఎలా సేకరించారనేదానిపై దర్యాప్తు చేస్తామని ఐటీశాఖ డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు.



హవాలా కేసులో నిందితులను, స్వాధీనం చేసుకున్న డబ్బును మీడియాకు చూపిస్తున్న హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాసరావు, ఐటీశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజేశ్వర్‌రెడ్డి

లోకం పోకడ



మా డిమాండ్లు తీర్చకుంటే సీఎల్పీ లీడర్, పీసీసీ ప్రెసిడెంట్ చేత కఠోర ఉపవాస దీక్షలు చేయిస్తాం!

కంది రైతులను ఆదుకోవాలి

కేంద్రమంత్రి పాశ్వాన్‌ను కోరిన ఎంపీ వినోద్‌కుమార్



ఢిల్లీలో కేంద్రమంత్రి పాశ్వాన్‌తో భేటీ అయిన ఎంపీ వినోద్

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: రాష్ట్రంలో కందులసాగు గణనీయంగా పెరిగిందని, పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఎంపీ వినోద్‌కుమార్ కేంద్రాన్ని కోరారు. సోమవారం ఢిల్లీలోని కృషిభవన్‌లో కేంద్ర పౌరసరఫరాశాఖ మంత్రి రాంవిలాస్ పాశ్వాన్‌ను కలిసిన ఎంపీ వినోద్‌కుమార్ కంది రైతుల ఇబ్బందులను వివరించారు. అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ ధరల స్థిరీకరణ నిధి (పీఎస్‌ఎఫ్) ద్వారా కందులను కొనుగోలు చేయాలని కేంద్రమంత్రి పాశ్వాన్‌ను కోరామని తెలిపారు. కందులను కొనుగోలు చేసేలా కేంద్ర వ్యవసాయశాఖ మంత్రికి లేఖ రాస్తానని పాశ్వాన్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సీజన్‌లో 2.84 లక్షల టన్నుల కందుల దిగుబడి వచ్చిందని చెప్పారు. ఎంపీ వెంట తెలంగాణభవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అశోక్ కుమార్ ఉన్నారు.

త్వరలో వయోజన విద్యపై నూతన విధానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోవందశాతం అక్షరాస్యత సాధించడానికి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయంలో ఆశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య ఆధ్వర్యంలో వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్లతో సోమవారం సమీక్ష సమావేశం జరిగింది.గ్రామీణప్రాంత వయోజనుల్లో అక్షరాస్యత స్థాయి ఏవిధంగా ఉంది? అక్షరాస్యత కోసం ఇప్పటివరకు చేసేందేమిటి? భవిష్యత్తులో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి? వంటి అంశాలపై క్షేత్రస్థాయి అధికారులతో చర్చించి, అభిప్రాయాలను స్వీకరించారు. కార్యక్రమంలో విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్, శాఖ అదనపు డైరెక్టర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో తెలంగాణ ఆదర్శం

ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి రజత్‌కుమార్

ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ: పర్యావరణ సమతుల్యతను కాపాడి, ప్రకృతి సంపదను పెంపొందించడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకచర్యలు తీసుకుంటున్నదని రాష్ట్ర పర్యావరణ, అటవీ,శాస్త్ర,సాంకేతికశాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ రజత్‌కుమార్ అన్నారు. మిషన్ కాకతీయ, తెలంగాణ హరితహారం వంటి కార్యక్రమాలు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతూ ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. వాతావరణ మార్పులు-పరిశోధనలపై హైదరాబాద్‌లోని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్, ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఈపీటీఆర్ఐ)లో రెండురోజుల జాతీయసదస్సు సోమవారం ప్రారంభమైంది. ఈపీటీఆర్ఐ, అమెరికాకు చెందిన నార్త్ కరోలినా విశ్వవిద్యాలయం, పుణేలోని ఐఐటీ వాతావరణసంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సదస్సును డాక్టర్ రజత్‌కుమార్ ప్రారంభించారు. సదస్సులో ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ బీ కల్యాణచక్రవర్తి మాట్లాడుతూ వాతావరణమార్పులపై ఆయారాష్ట్రాలు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని కేంద్రం తాజాగా ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో హైదరాబాద్ సదస్సుకు మరింత ప్రాధాన్యం చేకూరిందని చెప్పారు. అమెరికా శాస్త్రవేత్త డాక్టర్ డేవిడ్ ఈస్టర్లింగ్ మాట్లాడుతూ భారతదేశంలో వాతావరణమార్పులపై తమ సంస్థ ఈపీటీఆర్ఐ వంటి సంస్థలతో కలిసి జరుపుతున్న పరిశోధనలు ప్రపంచదేశాలన్నింటికీ ఉపయోగపడుతాయని తెలిపారు. నాబార్డ్ డీజీఎం, సీఎస్ ఆర్ మూర్తి, క్లైమెట్ అండ్ శాటిలైట్ ఎన్‌సీ స్టేట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కెన్ కుంకెల్, యూఎస్‌ఏ పొలిటికల్ అండ్ ఎకనామిక్ అసోసియేట్ కాన్సులేట్ జనరల్ జాఫ్రి చిన్, ఐఐటీఎమ్ శాస్త్రవేత్త డాక్టర్ అశ్విని కులకర్ణి తదితరులు సదస్సులో మాట్లాడారు.

శంభో శివ శంభో




మహా శివరాత్రి పర్వదిన వేడుకలకు వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని వేయిస్తంభాల గుడి ముస్తాబైంది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు బారికేడ్లతోపాటు అన్నిరకాల ఏర్పాట్లుచేశారు. రుద్రేశ్వరుడి దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉండటానికి చలువ పందిళ్లు వేశారు. జాగరం ఉండే భక్తులకు కోసం మంగళవారం రాత్రి ఆలయ ఆవరణలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.

రాలేకపోయా మన్నించండి

హార్వర్డ్ ఇండియా సదస్సుకు గైర్హాజరుపై మంత్రి కేటీఆర్ స్పందన



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హార్వర్డ్‌లో నిర్వహిం చిన ప్రఖ్యాత హార్వర్డ్ ఇం డియా సదస్సుకు హాజరు కాలేకపోయినందుకు రాష్ట్ర ఐటీ, ఎన్నారై వ్యవహారాలశాఖల మంత్రి కే తారకరామారావు నిర్వాహకులను క్షమాపణలు కోరారు. ఫిబ్రవరి 10, 11 తేదీల్లో హార్వర్డ్‌లో నిర్వహించే ప్రఖ్యాత ఇండియా కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని మంత్రి కేటీఆర్‌కు ఆహ్వానం అందింది. అయితే స్థానికంగా ఉన్న పలు కార్యక్రమాల వల్ల ఆయన వెళ్లలేక పోయారు. ఈ విషయాన్ని హుందాగా వెల్లడించారు. ఇప్పటికే రెండుసార్లు గైర్హాజరయ్యానని, రాబోయే సదస్సుకు హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని మంత్రి కేటీఆర్ ఓ ట్వీట్‌లో తెలిపారు.

దేవీప్రియకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రదానం



కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు స్వీకరిస్తున్న కవి, జర్నలిస్టు దేవీప్రియ

న్యూఢిల్లీ: ప్రముఖ తెలుగుకవి, జర్నలిస్టు దేవీప్రియ ప్రతిష్ఠాత్మకమైన కేంద్ర సాహిత్యఅకాడమీ అవార్డు అందుకున్నారు. 'గాలిరంగు' పేరుతో ఆయన రాసిన కవితా సంపుటి ఈ జాతీయ అవార్డుకు ఎంపికైన సంగతి తెలిసిందే. అవార్డుల ప్రదానోత్సవం సోమవారం న్యూఢిల్లీలో ఘనంగా జరిగింది. దేవీప్రియతోపాటు ఈ పురస్కారానికి ఎంపికైన వివిధ భాషలకు చెందిన 23 మంది ప్రముఖ రచయితలు, కవులకు అవార్డుల ప్రదానం జరిగింది. అవార్డు కింద వారికి తామ్రఫలకం, శాలువా, లక్ష రూపాయల చెక్కు ఇచ్చి సత్కరించారు. అకాడమీ నూతన అధ్యక్షుడు చంద్రశేఖర్ కంబర్, పెద్ద సంఖ్యలో వచ్చిన సాహితీవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవీప్రియ మాట్లాడుతూ తన రచనకు అవార్డు ఇచ్చిన కేంద్ర సాహిత్య అకాడమీకి కృతజ్ఞతలు తెలిపారు.

పీఎంకేఎస్‌వై పురోగతిపై 15న సమావేశం

మంత్రి హరీశ్‌రావును ఆహ్వానించిన కేంద్రం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన (పీఎంకేఎస్‌వై) పథకం కింద చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల పనుల పురోగతి, త్వరితగతిన పూర్తిచేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించేందుకు కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ ఈ నెల 15న సమావేశాన్ని ఏర్పాటుచేసింది. ఢిల్లీలోని శ్రమశక్తిభవన్‌లో కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో రాష్ట్రాల నీటిపారుదలశాఖ మంత్రులు, ఆయా రాష్ట్రాల నీటిపారుదల, ఆర్థికశాఖల ముఖ్య కార్యదర్శులు, కేంద్ర జలసంఘం చైర్మన్, నాబార్డు చైర్మన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. ఈ సమావేశానికి హాజరుకావాల్సిందిగా రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వానం అందింది.

15, 16 తేదీల్లో ఉన్నత విద్యామండళ్ల సమావేశం

హాజరుకానున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15,16 తేదీల్లో ఢిల్లీలో అన్ని రాష్ట్రాల ఉన్నత విద్యామండళ్ల కౌన్సెలర్లతో సమావేశం జరుగనున్నది. ఉన్నత విద్యామండళ్ల బాధ్యతలు, విధులపై ఇక్కడ చర్చించనున్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి నుంచి చైర్మన్ పాపిరెడ్డి, ఇద్దరు వైస్‌చైర్మన్లు పాల్గొననున్నారు.

సాంకేతిక విద్యాశాఖకు రూ.617 కోట్లు

ప్రభుత్వానికి బడ్జెట్ ప్రతిపాదనలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని సాంకేతిక విద్యాశాఖకు రూ.617 కోట్లు కేటాయించాలని కోరుతూ ఆ శాఖ ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి బడ్జెట్ ప్రతిపాదనలు పంపించారు. ఇందులో జేఎన్టీయూహెచ్‌కు రూ.87 కోట్లు, జేఎన్‌యూఎఫ్‌ఏకు రూ.23 కోట్లు, ఆర్జీయూకేటీకి రూ.89కోట్లు, జేఎన్టీయూహెచ్ సుల్తాన్‌పూర్‌కు రూ.87 కోట్లు, జేఎన్టీయూహెచ్ జగిత్యాలకు రూ.51 కోట్లు, జేఎన్టీయూహెచ్ మంథనికి రూ.76 కోట్ల చొప్పున బడ్జెట్ ప్రతిపాదనలు చేశారు. మిగతా మొత్తాలు సాంకేతిక విద్యాశాఖ ఉద్యోగుల జీతాలు, ఇతర అవసరాలకు కేటాయించనున్నారు.

22, 23 తేదీల్లో బ్రిజేశ్ ట్రిబ్యునల్ విచారణ

సుబ్బారావు రాలేకపోతే సత్యనారాయణతో క్రాస్ ఎగ్జామినేషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పునఃపంపిణీని తేల్చేందుకు బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ చేపట్టిన విచారణ ఈ నెల 22, 23 తేదీల్లో కొనసాగుతుందని ట్రిబ్యునల్ చైర్మన్ బ్రిజేశ్‌కుమార్ స్పష్టంచేశారు. ఈ మేరకు సోమవారం రెండు రాష్ట్రాలకు అధికారికంగా సమాచారమిచ్చారు. తన భార్య అనారోగ్యం కారణంగా గత నెల 31, ఈ నెల 1, 2 తేదీల్లో జరుగాల్సిన విచారణకు తాను హాజరుకాలేనని ఏపీ తరపు సాక్షి సుబ్బారావు ముందుగానే తెలియపర్చడంతో విచారణను వాయిదావేశారు. తదుపరి విచారణకు సుబ్బారావు హాజరుకాలేని పక్షంలో ఏపీ తరపు మరో సాక్షి (వ్యవసాయరంగం) డాక్టర్ పీవీ సత్యనారాయణ క్రాస్‌ఎగ్జామినేషన్ కొనసాగుతుందని ట్రిబ్యునల్ చైర్మన్ బ్రిజేశ్‌కుమార్ రాష్ట్రాలకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

20 మంది డిప్యూటీ కలెక్టర్లకు పదోన్నతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం 20 మంది డిప్యూటీ కలెక్టర్లకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించింది. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి అడ్‌హక్ పదోన్నతులు కల్పిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. పదోన్నతులు పొందినవారిలో పీ రాజావిక్రమ్ రెడ్డి, కంతాల వెంకటేశ్వర్లు, ఎం కృష్ణ, ఎంవీ రవీంద్రనాథ్, ఎన్ నటరాజ్, ఎస్ మోహన్‌రావు, ఒద్ది జోసఫ్ మధు, నూతి మధుసూదన్, కందూరి చెన్నారెడ్డి, వీ చంద్రశేఖర్‌రెడ్డి, అబ్దుల్ హమీద్, వీ హన్మంతరెడ్డి, అర్రమడ వెంకట్ రెడ్డి, వనమాల చంద్రశేఖర్, బీ వెంకటేశ్వర్లు, ఎన్ శ్రీనివాసరావు, టీ పూర్ణచంద్ర, కొండగడప విద్యాసాగర్, జీ భాస్కర్‌రావు, వడ్ల లక్ష్మీనారాయణ ఉన్నారు.

గురుకులాల పరీక్షల షెడ్యూల్ సవరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ గురుకులాల్లో వివిధ పరీక్షల షెడ్యూల్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సవరించింది. ఈ నెల 19న జరుగనున్న జూనియర్ లెక్చరర్స్, 20 నాటి డిగ్రీ లెక్చరర్స్, లైబ్రేరియన్స్, 21 నాటి ప్రిన్సిపాల్, 22న జరుగాల్సిన జూనియర్, డిగ్రీ కాలేజీలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్ పోస్టుల పరీక్షలకు సంబంధించిన తేదీలను సవరించారు. పరీక్షల తేదీలను తదుపరి ప్రకటించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది.

ఏఈఈ అభ్యర్థులకు నేటి నుంచి వైద్యపరీక్షలు

పలు శాఖల్లోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోస్టుల భర్తీలో భాగంగా అభ్యర్థులకు మంగళవారం నుంచి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. 14 వరకు మూగ, చెవిటి అభ్యర్థులకు కోఠిలోని ఈఎన్టీ దవాఖానలో, 15న శారీరక వికలాంగ అభ్యర్థులకు ఉస్మానియా దవాఖానలో, 16న దృశ్య సంబంధ వికలాంగులకు సరోజిని కంటి దవాఖానలో పరీక్షలు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ వివరించింది.

ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 దరఖాస్తుల గడువు పెంపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వైద్యారోగ్యశాఖలోని ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టులకు దరఖాస్తు గడువును ఈ నెల 25వ తేదీ వరకు టీఎస్‌పీఎస్సీ పొడిగించింది. దీంతోపాటుగా మరో 12 కోర్సుల అభ్యర్థులను అర్హులుగా ప్రకటించింది. నూతనంగా కల్పించిన అర్హతల కోసం అభ్యర్థులు.. తమ వెబ్‌సైట్‌ను సందర్శించాలని టీఎస్‌పీఎస్సీ సూచించింది.

అక్రమ కట్టడాలు అరికట్టాలి

కొత్త జిల్లాకేంద్రాల్లో రోడ్ల విస్తరణకు ప్రాధాన్యం

మరింత వేగంగా ఎల్‌ఆర్‌ఎస్ • టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి మంత్రి కేటీఆర్ ఆదేశాలు



సోమవారం ఖైరతాబాద్‌లో టౌన్ ప్లానింగ్ సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కే తారకరామారావు. చిత్రంలో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ కమిషనర్లు జనార్దన్‌రెడ్డి, చిరంజీవులు తదితరులు కూడా ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజలు ప్రభుత్వం నుంచి సరికొత్త పాలన ఆశించారని, ఆ దిశగా అనేక పాలనా సంస్కరణలతో అప్రతిహతంగా ముందుకెళ్తున్నామని పురపాలకశాఖ మంత్రి కల్వకుంట్ల తారకమారావు చెప్పారు. సోమవారం ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ కార్యాలయంలో రాష్ట్రంలోని టౌన్ ప్లానింగ్ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో సాధారణ పౌరునికి అత్యంత పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా అనుమతులన్నీ వచ్చేలా డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (డీపీఎంఎస్) విధానాన్ని అమల్లోకి తెచ్చామని తెలిపారు. ఈ విధానంలో నెల రోజుల గడువును కుదించి, 21 రోజుల్లోనే అన్ని అనుమతులు వచ్చేలా చేశామని, దరఖాస్తు చేసిన వారంలోపే దరఖాస్తులో లోపించిన పత్రాలకు సంబంధించిన సమాచారాన్ని దరఖాస్తుదారునికి తెలియజేయాలన్న నిబంధనను తీసుకొచ్చామని వివరించారు. అనుమతుల ప్రక్రియలో అనవసర ఆలస్యాన్ని తగ్గించేందుకే ఈ విధానానికి శ్రీకారం చుట్టామన్నారు. అదే సమయంలో 21 రోజుల గడువులోపు అనుమతులివ్వకుండా ఆలస్యం చేసే అధికారులపై టీఎస్ఐపాస్ తరహాలో జరిమానాలు వేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. క్రమబద్ధమైన పురపాలనలో టౌన్, కంట్రీ ప్లానింగ్ అధికారుల పాత్ర కీలకమైనదన్న మంత్రి, అధికారులకు ప్రభుత్వ ప్రాథమ్యాలను వివరించారు. నూతనంగా ఏర్పాటైన జిల్లా కేంద్రాల్లో రోడ్ల విస్తరణ, అక్రమ కట్టడాలను అరికట్టడం వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అన్ని పురపాలికల్లో లేఅవుట్లలోని ఖాళీ ప్రాంతాల (ఓపెన్ ప్లాట్లు)ను కాపాడటంలో మున్సిపల్ కమిషనర్లతో కలిసి పనిచేయాలని చెప్పారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను కోరారు. టౌన్ ప్లానింగ్ అధికారులు టెక్నాలజీ సహకారంతో విధులు నిర్వర్తించేందుకు అవసరమైన సూచనలివ్వాలని మంత్రి కేటీఆర్ కోరారు.

మంచి పేరు తేవాలి..

డీపీఎంఎస్ విధానంపై టౌన్ ప్లానింగ్ అధికారులు పూర్తి అవగాహన పెంచుకోవాలని, సంపూర్ణ పరిజ్ఞానంతో పనిచేయాలని మంత్రి కేటీఆర్ కోరారు. ప్రజల్లో అధికార వ్యవస్థకు మరింత పేరు తెచ్చేలా ప్రతిఒక్క అధికారి పనిచేయాలన్నారు. ప్రభుత్వం తెచ్చిన ఆన్‌లైన్ విధానంపై అధికారుల ఫీడ్‌బ్యాక్‌ను మంత్రి తీసుకున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. టౌన్ ప్లానింగ్ అధికారులతో ప్రతి మూడు నెలలకోసారి సమావేశమవుతామని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ కమిషనర్లు జనార్దన్‌రెడ్డి, చిరంజీవులు, డీఎంఏ టీకే శ్రీదేవి, డీటీసీపీ సంచాలకుడు విద్యాధర్ తదితరులు పాల్గొన్నారు.



సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న జైళ్లశాఖ డీజీ వీకే సింగ్. చిత్రంలో ఐజీ ఆకుల నరసింహ కూడా ఉన్నారు.

త్వరలో 14 సబ్‌జైళ్ల మూసివేత!

ఫలిస్తున్న జైలు సంస్కరణలు.. తగ్గుతున్న నేరస్థుల సంఖ్య

రాష్ట్ర జైళ్లశాఖ డీజీ వీకే సింగ్ వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో శాంతిభద్రతలకు ఎలాంటి ఢోకా లేకుండా చూడాలి. నేరాలు జరుగకుండా చేయాలి. నేరం చేయాలనుకునే వారు భయపడాలి. ఆ విధంగా వారికి శిక్షలు ఉండాలి. తప్పు చేసి జైలుకు వచ్చిన వారు ఇక ముందు మళ్లీ నేరం చేయకుండా చూడాలి. ఆ మేరకు నేరస్థుల్లో మార్పు తేవాలి.. అన్న ప్రభుత్వ సంకల్పం నెరవేరుతున్నది. ఈ మేరకు రాష్ట్ర జైళ్లశాఖ చేపట్టిన జైలు సంస్కరణలు ఫలితమిస్తున్నాయి. జైళ్లశాఖ వివిధ కార్యక్రమాల ద్వారా ఖైదీలకు కల్పిస్తున్న ఉపాధి అవకాశాలతో 'రిపీటెడ్'గా నేరాలు చేసే వారిలో పరివర్తన వస్తున్నది. అటువంటి వారు నేరాల బాట విడిచిపెడుతున్నారని జైళ్లశాఖ డీజీ వీకే సింగ్ తెలిపారు. దీంతోజైళ్లకు వచ్చే నేరస్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతున్నదని, అవసరం లేక 14 జైళ్లను మూసివేసే పరిస్థితి వచ్చిందని ఆయన చెప్పారు. హైదరాబాద్‌లోని జైళ్లశాఖ ప్రధాన కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న అన్ని జైళ్లలో కలిపి 6,848 మంది ఖైదీలు ఉండే సామర్థ్యం ఉండగా, ఇప్పుడు వాటిలో 5,348 మంది ఖైదీలు మాత్రమే ఉన్నారని డీజీ వీకే సింగ్ పేర్కొన్నారు. ఈ సంఖ్యను కూడా వచ్చే ఐదేండ్లలో సగానికి తగ్గిస్తామన్నారు. రాష్ట్రంలోని 14 సబ్ జైళ్లు కొద్ది నెలలుగా ఖాళీగా ఉంటున్నాయన్నారు. అందుకని మధిర, బోధన్, ఆర్మూర్, పర్కాల, నర్సంపేట, కొడంగల్, అచ్చంపేట, కొల్లాపూర్, నారాయణపేట, ఎల్లారెడ్డి, వెంకటాపురం, మంథని, సిర్పూర్, చెన్నూర్ సబ్ జైళ్లను మూసివేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. ప్రభుత్వం నుంచి ఆదేశం రాగానే త్వరలో ఈ జైళ్లను మూసేస్తామన్నారు. ఈ విధంగా ఖాళీ అయ్యే జైలు ప్రాంగణాలు, భవనాలను తమ శాఖ పరిధిలోనే ఇతరత్రా ప్రజావసరాలకు వినియోగిస్తామని ఆయన వివరించారు. రిపీటెడ్‌గా నేరాలు చేసి జైలుకు వచ్చే వారి ప్రవర్తనలో మార్పుకు అనేక కార్యక్రమాలు చేపట్టామని, వారికి విద్య, ఉపాధి పనుల్లో శిక్షణ, విడుదలైన తర్వాత ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఐజీ ఆకుల నరసింహ, డీఐజీ సైదయ్య తదితరులు పాల్గొన్నారు.



Free Training Free Training Free Training Free Training Free Training
Be an Entrepreneur & Create Jobs
ENTREPRENEURSHIP & SKILL DEVELOPMENT PROGRAMMES
For UNEMPLOYED YOUTH
Courses Offered Under ATI Scheme-Ministry of MSME 2017-18
125 Hrs: Graphic Design- Faculty: Mr. A. Nageswara Rao -7793961283
Linux Administration, MCP&CCNA-: Mr. J.Anjineyulu-9059582566
SQL Server DBA -: Mr. N. Kota Reddy- 9441003704
Visual Effects- Please contact Registration Desk at a-block ni-msme
250 Hrs: Advance Java : Please contact Registration Desk at a-block ni-msme
Dot- Net Technology & Net Programming: Mr. N. Kota Reddy-9441003704
300 Hrs: Multimedia & Animation, Web Designing - Mr. A. Nageswara Rao-7793961283
3D-Animation: Please contact Registration Desk at a-block ni-msme
Eligibility : Age should be above 18 years and below 35 years
Qualification : 12th pass mandatory / Equivalent for all courses
Identity proofs : Aadhar card + (Any State/Central govt. issued ID's) I.E: (Voter-ID, Driving license, Passport, Pan card, Ration card & Bank Pass book)
For Registration: Please bring the documents i.e. Xth & XIIth or Equivalent, Pass memo's, Aadhar card ID, and Any State or central government issued ID Xerox Copies, 3 Passport size photographs only. (Registration are on, First-cum-First Serve basis only)
Contact: National Institute for Micro, Small and Medium Enterprises (ni-msme)
An Organaisation of Ministry of MSME, Govt. of India & An ISO 9001-2008 Organaisation
At Block-A, ni-msme campus, Yousufguda, Hyderabad, Telangana. Pin: 500045
Phone: 040-23633249/251/300, Website: www.nimsme.org





సరిహద్దు చొరబాట్లు, భద్రతాబలగాలపై టెర్రరిస్టుల దాడులు ఎక్కువ య్యాయి. జవాన్లు చనిపోతున్నారు. ఇప్పటికైనా పాకిస్థాన్‌తో చర్చలకు సిద్ధ మవ్వాలి. అన్నిసమస్యలకు చర్చలే పరిష్కారం. దురదృష్టమేమంటే చర్చల ప్రసక్తి తెస్తేనే కొంతమంది జాతి వ్యతిరేకులుగా ముద్రవేస్తున్నారు. కశ్మీర్‌లో హింసకు తెరపడాలంటే పాక్‌తో చర్చలే పరిష్కారం.

మెహబూబా ముఫ్తీ, జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి

కొన్నిరోజులుగా మధ్యప్రదేశ్ సెహోర్ ప్రాంతంలో అకాల వర్షాలు పంటలకు తీవ్ర నష్టం కలిగించాయి. వాతావరణ శాఖ అందిస్తున్న సమాచారం రైతులకు ఏం మేలు చేయలేకపోతున్నది. అకాల వర్షాలు రాకుండా ఉండాలంటే ప్రజలంతా హనుమాన్ చాలీసా మంత్రం పఠించాలి. రైతులకు నావిజ్ఞప్తి ఏమంటే రోజూ ఓ గంట హనుమాన్ మంత్రం చదువండి. అకాల వర్షాల నుంచి రక్షణ పొందండి.

రమేష్ సక్సేనా, మధ్యప్రదేశ్ బీజేపీ మాజీ ఎమ్మెల్యే




చరిత్రలో నేడు




1601

జాన్ లాన్‌కాస్టర్ అధ్వర్యంలో లండన్ నుంచి బయలుదేరిన బ్రిటిష్ ఈస్ట్ ఇండియా నౌకలు.

1633



'సూర్యుని చుట్టూ భూమి తిరుగుతున్నది' అన్నందుకు నేరస్తునిగా రోమ్ పాలకుల ముందు విచారణకు హాజరైన గెలీలియో.



1861

అమెరికా అధ్యక్షునిగా అబ్రహం లింకన్ ఎన్నిక.

నీతి ఆయోగ్ మొదటిసారి విడుదల చేసిన 'ఆరోగ్యసూచి'లో విద్య, వైద్యం, ప్రాథమిక ఆరోగ్యం, పౌష్టికాహారంపై ఎక్కువ కేంద్రీకరించిన కేరళ అగ్రస్థానంలో నిలిచింది. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, బీహార్, ఒడిషా రాష్ట్రాలు ఆరోగ్యంలో అట్టడుగున అధ్వాన్నస్థితిలో ఉన్నాయి. ఒడిషాలో ప్రతి వెయ్యి మంది శిశు జననాల్లో 35 మరణాలుంటున్నాయి. మిగతా రాష్ట్రాల్లో కూడా ఇదే పరిస్థితి ఉన్నది. విషాదమేమంటే దేశంలో రాజకీయపార్టీలకు ప్రజారోగ్యం పట్టని విషయమైపోయింది. ఎన్నికలప్పుడు ఓట్లకోసం ఏవో చెప్పినా ఆచరణకు నోచుకోవటం లేదు. ఇప్పటికైనా రాజకీయపార్టీలు ప్రజారోగ్యానికి పెద్ద పీట వేయాలి. ఆరోగ్య భారతానికి బాటలు వేయాలి.

ది హిందూ

ఉత్తరప్రదేశ్‌లో నాలుగురోజులుగా పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో పరీక్షల కోసం పేర్లు నమోదు చేసుకున్న విద్యార్థుల్లో 10.4 లక్షల మంది నకిలీ విద్యార్థులను గుర్తించారు. యూపీ ప్రభుత్వం పరీక్షా విధాన ప్రక్షాళనకు చేపట్టిన చర్యల్లో ఇలా లక్షలమంది అడ్డదారిన దొరుకుతుండటం విస్మయం కలిగిస్తున్నది. ఈ నేపథ్యంలో యూపీ విద్యాశాఖా మంత్రి విద్యాప్రమాణాల కోసం కఠిన నిర్ణయాలకైనా వెనుకాడబోమని చెప్పటం హర్షణీయం. ఇప్పటికైనా విద్యామాఫియా ఆట కట్టించటం ఆహ్వానించదగిన పరిణామం.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

పశ్చిమాసియాలో సమతూకం

ఆరు నెలల కిందట ఇజ్రాయెల్ వెళ్ళి చరిత్ర సృష్టించిన ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పుడు మూడు దేశాల పశ్చిమాసియా పర్యటనలో భాగంగా పాలస్తీనాను కూడా సందర్శించి సమతూకం పాటించినట్టు చాటుకోగలిగారు. ఇజ్రాయెల్- పాలస్తీనా వివాదం ఎట్లా ఉన్నా, పశ్చిమాసియాకు మొదటి నుంచి భారత విదేశాంగ విధానంలో ప్రాధాన్యం ఉంటున్నది. పాలస్తీనా సందర్శన మొక్కుబడిగా సాగించింది కాగా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఒమన్ దేశాల పర్యటన వాణిజ్య దృష్టితో సాగింది. ఇటీవలి కాలంలో భారత విదేశాంగ విధానం అమెరికా వైపు మొగ్గుతున్నది. బీజేపీ అధికారంలో ఉంటే ఈ మొగ్గు మరింతగా ఉంటుంది. ఈ పర్యటనలో భాగంగా మోదీ ఈ విధానపరమైన మార్పును స్పష్టం చేశారు. మోదీ ఎప్పటి మాదిరిగా ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా పాలస్తీనాకు మద్దతుగా మాట్లాడలేదు. మోదీ ప్రసంగంలోని దౌత్య పరిభాషలో స్పష్టమైన మార్పు చోటు చేసుకున్నది. వెస్ట్ బ్యాంక్, గజా స్ట్రిప్ అనే రెండు ముక్కలను పాలస్తీనా దేశంగా ప్రకటించాలనే ప్రయత్నాలకు భిన్నంగా 'సమైక్య, మనగలిగే' పాలస్తీనా దేశం ఉండాలనేది భారత్ విధానం. కానీ మోదీ తన ప్రసంగంలో ఈ పదాలు వాడకపోడం భారత్ విధానంలో వచ్చిన మార్పుకు సూచనగా పరిశీలకులు భావిస్తున్నారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఏడు అతి చిన్న రాచరిక రాజ్యాల సమాఖ్య. ఇందులో ప్రధానమైన అబూధబీ, దుబాయిలను సందర్శించిన మోదీ ఆ తరువాత గల్ఫ్ ప్రాంతంలో కీలకమైన ఒమన్‌కు కూడా సందర్శించి ఆ దేశంతో ఎనిమిది ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మద్దతుతో సౌదీ అరేబియా ఖతర్‌ను ఏకాకిని చేసి దెబ్బకొట్టాలని ప్రయత్నిస్తున్నది. ఈ అన్నిదేశాలతో భారత్ సత్సంబంధాల కోసం ప్రయత్నిస్తున్నది. భారత్‌కు అరబ్ దేశాలతో ఎగుమతులు 50 బిలియన్ డాలర్లు కాగా, దిగుమతులు 71 బిలియన్ మేర ఉన్నాయి. అరబ్ దేశాలలో 90 లక్షల మంది ప్రవాసులు ఉన్నారు. వీరి నుంచి భారత్‌కు 38 బిలియన్ డాలర్ల మేర విదేశీ మారకం లభిస్తున్నది. అందువల్ల పశ్చిమాసియాతో సంబంధాలలో వీలైనంత సమతూకాన్ని పాటించక తప్పదు.

ప్రధాని మోదీ పాలస్తీనా పర్యటన ద్వారా ఇజ్రాయెల్ వ్యతిరేక చర్యకు పాల్పడినట్టు పైకి కనిపించవచ్చు. కానీ వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉన్నది. పశ్చిమాసియా రాజకీయాలలో అమెరికా అనుకూల దేశాలు అనుసరిస్తున్న విచిత్ర విధానమిది. ప్రచ్ఛన్న యుద్ధ కాలం నుంచి పశ్చిమాసియా అమెరికా అనుకూల, వ్యతిరేక దేశాలుగా విడిపోయి ఉంటున్నది. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో ఇరాక్, లిబియా వంటి దేశాలు అరబ్ జాతీయవాద భావజాలంతో, స్థిరమైన ఆర్థిక వ్యవస్థలతో, సోవియెట్ మద్దతుతో అమెరికా వ్యతిరేక పాత్రను పోషించాయి. భారత్ వర్ధమాన దేశంగా రెండు శిబిరాలతో సత్సంబంధాలను నెలకొల్పుకొని, అలీన విధానాన్ని పాటించింది. అయితే ఐక్యరాజ్యసమితిలో, బయటా సోవియెట్ శిబిరంతో సన్నిహితంగా ఉండేది. సోవియట్ యూనియన్ కుప్పకూలిన నేపథ్యంలో, అమెరికా ఈ దేశాలను ఛిద్రం చేసింది. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్ వంటి దేశాలలోని రాచరిక వ్యవస్థలు అమెరికా శిబిరంలో ఉన్నాయి. ఇవి ప్రత్యక్షంగా, పరోక్షంగా అమెరికా- ఇజ్రాయెల్ కూటమికి మద్దతు ఇస్తున్నాయి. కానీ అరబ్బు ప్రజల మనోభావాలు అమెరికా- ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఉండటం వల్ల పైకి పాలస్తీనా అనుకూల ప్రకటనలు జారీ చేస్తుంటాయి. భారత్ ఈ అరబ్బు రాచరికాలతో సాన్నిహిత్యాన్ని పెంచుకునే క్రమంలోనే, మోదీ పశ్చిమాసియా పర్యటన సాగింది. ఇప్పుడు పాలస్తీనా ప్రాంతాలుగా ఉన్న వెస్ట్‌బ్యాంక్, గజా స్ట్రిప్‌లలో పరిస్థితి కూడా గమనార్హమైనది. వెస్ట్‌బ్యాంక్‌లో అధికారంలో ఉన్న ఫతా వర్గం పైకి ఇజ్రాయెల్‌ను వ్యతిరేకిస్తున్నట్టు కనిపిస్తుంది. కానీ అమెరికాకు అనుకూలంగానే వ్యవహరిస్తుంది. గజా స్ట్రిప్‌లో పట్టు కలిగిన హమాస్ వర్గం మాత్రం ఇజ్రాయెల్‌కు వ్యతిరేకమైనది. అందువల్ల హమాస్ వర్గాన్ని కట్టడి చేస్తూ, వెస్ట్‌బ్యాంక్‌లోని ఫతాతో ఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా- ఇజ్రాయెల్ కూటమి భావిస్తున్నది. మోదీ వెస్ట్‌బ్యాంక్ సందర్శించడం అంటే, ఇజ్రాయెల్‌కు అనుకూలంగా ఉన్న ఫతా నాయకుడు అబ్బాస్‌కు మద్దతు ఇవ్వడమే.

ఏదో ఒక శిబిరంతో సన్నిహితంగా ఉన్నప్పటికీ, మరో శిబిరాన్ని దూరం చేసుకోవడం భారత్ విదేశాంగ విధానంలో ఎప్పుడూ లేదు. ఇప్పుడు కూడా అమెరికా అనుకూల అరబ్ దేశాలతో సాన్నిహిత్యం పెంచుకుంటున్నప్పటికీ, ఇరాన్‌తో సంబంధాలకు ప్రాధాన్యం ఇస్తున్నది. అతి త్వరలో ఇరాన్ అధ్యక్షుడు హస్సన్ రౌహనికి భారత్ ఆహ్వానం పలుకనుంది. క్షేత్ర స్థాయి వాస్తవికత ప్రకారం- పశ్చిమాసియా భౌగోళిక రాజకీయాలలో భారత్ కీలక పాత్రేమీ పోషించడం లేదు. అయితే వ్యూహాత్మక ప్రాధాన్యం లేనప్పటికీ, వాణిజ్యాది రంగాలలో పశ్చిమాసియాలోని ఏ ఒక్క శిబిరాన్ని ఉపేక్షించలేం. చమురు దిగుమతి, కార్మికులకు ఉపాధి- ఈ రెండు అంశాలు భారత విధానాన్ని ప్రభావితం చేస్తుంటాయి. ప్రభుత్వాలతో అధికారిక సంబంధాలు, ప్రజల మనోభావాలు రెండు భిన్న అంశాలు. ఇజ్రాయెల్‌తో సంబంధాలను, పాలస్తీనా విధానానికి ముడిపెట్టదలుచుకోలేదు. అమెరికాకు అనుకూలంగా సౌదీ అరేబియా, వ్యతిరేకంగా ఇరాన్ పశ్చిమాసియా రాజకీయాలను శాసిస్తున్నాయి. ఈ మధ్య ఖతర్ కూడా ఒక ప్రభావిత కేంద్రంగా మారింది. దీంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మద్దతుతో సౌదీ అరేబియా ఖతర్‌ను ఏకాకిని చేసి దెబ్బకొట్టాలని ప్రయత్నిస్తున్నది. ఈ అన్ని దేశాలతో భారత్ సత్సంబంధాల కోసం ప్రయత్నిస్తున్నది. భారత్‌కు అరబ్ దేశాలతో ఎగుమతులు 50 బిలియన్ డాలర్లు కాగా, దిగుమతులు 71 బిలియన్ మేర ఉన్నాయి. అరబ్ దేశాలలో 90 లక్షల మంది ప్రవాసులు ఉన్నారు. వీరి నుంచి భారత్‌కు 38 బిలియన్ డాలర్ల మేర విదేశీ మారకం లభిస్తున్నది. అందువల్ల పశ్చిమాసియాతో సంబంధాలలో వీలైనంత సమతూకాన్ని పాటించక తప్పదు.

సందర్భం

శివమూగు మోదుగు!


వనాలన్ని వాడి
హరితపత్రాల్ని వీడి
మోడుగా నిలిచే
'శిశిరం'లో సైతం
మోదుగు శిరసెత్తి
మోదంగా నిలుస్తుంది!
కాలకాంతున్ని కూడా ప్రతిఘటించి
విప్లవభావాలతో
ఎర్రఎర్రని పూల కొడవళ్లతో
విపరీతంగా పూస్తుంది!
పవనుని తాకిడికి
పంచాక్షరి పఠిస్తూ
పరమశివుని పూజకు ఉపకరిస్తుంది!

మోదుగు ఆకులు కూడా
విశ్వనాథునికి విశేష
వింజామరలవుతాయి!
విశ్వానికి విరివిగా
విస్తర్లుగా చేతికొస్తాయి!
నిర్వికారంగా-నిరాడంబరంగా నిలిచే
పనికిరాని విభూతిని దాల్చే
పాముల్ని ఆభరణాలుగా ధరించే
వల్లమాలిన వల్లకాటిలో వసించే
నిస్వార్థ నీలకంఠునికే
మోక్షమొసగే పరమేశ్వరునికి
మోదుగు ప్రీతికరమవుతున్నది!
మోడు వారే శిశిరంలోనూ రాలక
మొనగాడిలా నిలుస్తున్నది!
'తెరాస' రంగుపూలతో
తేజంగా అలరిస్తున్నది!
శివరాత్రి జెండాగా
శివమూగుతున్నది!

–డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ,92465 41699

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

జాతీయం



కరణ్ థాపర్

ఆధునికతవైపు అడుగులు సాధ్యమా?

బీజేపీ నేతల మాటలు చాలా సందర్భాల్లో వింతగా, వివాదస్పదంగా ఉండటం గత కొంతకాలంగా ఎక్కువ అవున్నది. వ్యక్తిగతంగా ఎవరికైనా ఏ విధమైన విశ్వాసాలు, అభిప్రాయాలు అయినా ఉండవచ్చు. వాటిని ప్రకటించుకోవచ్చు. కానీ బాధ్యతాయుతమైన పదవుల్లో ఉంటూ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ వ్యాఖ్యలు చేసేటప్పుడు తప్పకుండా బాధ్యతాయుతంగా ఉండాల్సిన అవసరం ఉంటుంది. ముఖ్యంగా ప్రజాప్రతినిధులుగా ఉన్న వారు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ, యూనివర్సిటీల వేదికలపై నుంచి విశ్వాసాలు పునాదిగాగల పుక్కిటి పురాణాల గొప్పతనాన్ని చెప్పటం బాధ్యతారాహిత్యం మాత్రమే కాదు, మూర్ఖత్వం.

కొంతకాలం కిందట రాజస్థాన్ రాష్ట్ర విద్యాశాఖామంత్రి వాసుదేవ్ దేవ్నాని- ఈనాడు చెప్పుకుంటున్న గురుత్వాకర్షణ శక్తి సిద్ధాంతాన్ని న్యూటన్ కన్నా ముందే వెయ్యేండ్ల కిందటే బ్రహ్మగుప్తుడు కనుగొన్నట్లు చెప్పుకొచ్చారు. ఇది ఏదో ప్రైవేటు కార్యక్రమంలోనో, మరోచోటనో కాదు. రాజస్థాన్ యూనివర్సిటీ 72వ వార్షికోత్సవ ఉత్సవాల్లో పాల్గొంటూ ఈ విధమైన వ్యాఖ్యలు చేశారు. మన పురాణ ఇతిహాసాలను, భారతీయ చరిత్రను లోతుగా అధ్యయనం చేస్తే ఈ విషయం ఎవరైనా కనుగొనవచ్చునట! ఆయన చెబుతున్న దాని ప్రకారం ఈ భూమిపై ఆవులు మాత్రమే ఆక్సీజన్‌ను ప్రాణికోటికి అందించే ఏకైక వనరులు. ఆవులకు దగ్గరగా ఉంటే సాధారణ రోగాలు, దగ్గు, జలుబు లాంటివి రావు. అలాగే ఆవు పేడ రేడియోధార్మిక శక్తి నుంచి మనలను రక్షిస్తుంది. దేవ్నానీ చెబుతున్నది ఎంత అసంబద్ధమైనదో, అశాస్త్రీయమైనదో తెలుస్తూనే ఉన్నది. ఆవులు మాత్రమే ఈ భూమిపై ప్రాణవాయువైన ఆక్సీజన్‌ను అందిస్తాయని చెప్పటం ఎంతటి మూర్ఖత్వమో చెప్పాల్సిన పనిలేదు. ఆవు పేడ నుంచి ఆక్సీజన్ కాదు, మీథేన్ మాత్రమే విడుదల అవుతుంది. ఇక బ్రహ్మగుప్తుడు కనిపెట్టాడంటున్న గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని, ఆయన రాసిన 'బ్రహ్మస్ఫుత సిద్ధాంత' గ్రంథంలో ఉన్న ఒక వాక్యాన్ని తీసుకుని, దాని ఆధారంగా దేవ్నాని ఈ విధంగా చెబుతున్నారు. నిజానికి బ్రహ్మగుప్తుడు రాసిన గ్రంథంలో.. 'భూమిపై నీరు పల్లంవైపు ఎలా సహజంగా ప్రవహిస్తుందో, అలాగే భూమి పైకి విసిరిన రాయి తిరిగి భూమినే చేరుతుంద'ని చెప్పాడు. దీన్ని మన బీజేపీ నేత వాసుదేవ్ దేవ్నాని న్యూటన్ కనుగొన్న గురుత్వాకర్షణ సిద్ధాంతం కన్నా ముందే కనుగొన బడినదిగా చెప్పుకొస్తున్నారు.

ఇలా ఈనాటి శాస్త్రీయ విషయాలు, ఆవిష్కరణలన్నీ మా పురాణ, ఇతిహాసాల్లోనే ఉన్నాయని చెప్పిన వారిలో దేవ్నాని ఒక్కరే కాదు.ఆర్ఎస్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించే విద్యాభారతి ముఖ్య నిర్వాహకుడిగా ఉన్న దీననాథ్ బత్రా కూడా ఇలాంటి వెన్నో చెబుతుంటారు. ఆయన ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నడిచే పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పుస్తకాలు రచిస్తుంటారు. ఆయన ఎనిమిది పుస్తకాలను రాశారు. ఆ పుస్తకాల్లో ఆయన నేడు గొప్ప ఆవిష్కరణగా చెబుతున్న సంకరకరణం(హైబ్ర డైజేషన్) నాటి మహాభారత కాలంలోనే ఉన్నదని రాశారు. మహాభారతంలోని కుంతి, కౌరవుల జననం కూడా 'స్టెమ్ సెల్' సిద్ధాంతం అనుగుణంగానే జరిగిందని తెలిపారు. ఆయన ప్రకారం- మహాభారత కాలంలోనే నేడు గొప్ప ఆవిష్కరణగా చెప్పుకుంటున్న టెలివిజన్ కనుగొన్నారు. అలాగే మోటార్ కార్ కూడా వేద కాలంలోనే కనుగొన్నారు.

ఇదీ నరేంద్ర మోదీ పాలనలో ఆధునిక భారతంలో గుజరాత్ రాష్ట్రంలో విద్యార్థులకు చెబుతున్న శాస్త్రీయ బోధన. దీన్నే గుజరాత్ రాష్ట్ర విద్యాశాఖ విలువలతో కూడిన గుణాత్మకమైన విద్య అని చెబుతున్నది. అది ఇంకా ఏం చెబుతున్నదంటే- ఎవరైనా దంపతులకు పిల్లలు కలుగకుంటే వారు ఆవులను చేరదీసి సంరక్షిస్తే వారికి సంతానం కలుగుతుంది. ఇలాంటి ఎన్నో విషయాలను విద్యార్థులకు పాఠ్యాంశాలుగా బోధిస్తున్నారు. ఇదే కోవలో గాంధీనగర్‌లోని విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ హర్షద్ షా విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయత, విలువలతో కూడిన విద్య ఇలాంటి పాఠ్యాంశాల ద్వారా అందుతుందని చెబుతున్నారు. ఇంకా నేడు గుజరాత్ రాష్ట్రంలోని పాఠ్యాంశాలతో విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందుతాయని గుజరాత్ పాఠ్యపుస్తకాల డైరెక్టర్ భరత్ పండిట్ అంటున్నారు. దీనానాథ్ బత్రా అయితే పురాణాలే మన విద్యార్థులకు శాస్త్రీ య విజ్ఞానాన్ని, ఆవిష్కరణల ను తెలుపుతాయని అంటున్నా రు. పురాణ గాథల్లో ఉన్న దేనికీ శాస్త్రీయ పునాదులు ఉండవు. నిరూపణలు దొరకవు. అవి కేవ లం ఊహా కల్పనలు మాత్రమేనని వేరే చెప్పాల్సిన పనిలేదు. రెండో విషయమేమంటే.. పురాణ ఇతిహాసాల్లో ఉన్నాయని చెబుతున్న దానికి ఏ నిరూపణ హేతుబద్ధత ఉండదు. ఇక 2014లో నరేంద్రమోదీ చెప్పిందేమంటే.. మన వేదకాలంలోనే, పురాణ ఇతిహాసాల కాలంలోనే జన్యు శాస్త్రం, ప్లాస్టిక్ సర్జరీ ఉన్నదని చెప్పుకొచ్చారు!

డిజిటల్ ఇండియా,బుల్లెట్ ట్రేన్, మేక్ ఇన్ ఇండియా లాంటి వన్నీ ఇలాంటి పురాణగాథల విశ్వాసాలపై ఆధారపడి నిజం చేస్తారా? హేతుబద్ధమైన, శాస్త్రీయమైన విద్యావిధానం లేకుండా శాస్త్రసాంకేతిక రంగాల అభివృద్ధి ఎలా సాధ్యమో ఏలికలే చెప్పాలి. మేధస్సుకు బూజు పట్టించి ఆధునికతవైపుకు అడుగులు ఎలా వేస్తారు?

ఆధునిక విశ్వవిద్యాలయ పాలకులుగా, విధానకర్తలుగా, పాలకులుగా ఉండి శాస్త్రీయ విషయాలను పురాణాల్లో వెతుకడానికి ప్రయత్నించటం విషాదం. బీజేపీ దేశాన్ని ఆధునిక భారతంగా 21వ శతాబ్దంలోకి తీసుకెళ్తామని చెబుతున్నది. స్మార్ట్ సిటీలను నిర్మిస్తామని అంటున్నది. రాబోయే రోజుల్లో మిషన్ మార్స్ పేరుతో అంతరిక్ష విజయాలకు బాటలు వేస్తున్నది. డిజిటల్ ఇండియా,బుల్లెట్ ట్రేన్, మేక్ ఇన్ ఇండియా లాంటి వన్నీ ఇలాంటి పురాణగాథల విశ్వాసాలపై ఆధారపడి నిజం చేస్తారా? హేతుబద్ధమైన, శాస్త్రీయమైన విద్యావిధానం లేకుండా శాస్త్రసాంకేతిక రంగాల అభివృద్ధి ఎలా సాధ్యమో ఏలికలే చెప్పాలి. మేధస్సుకు బూజు పట్టించి ఆధునికతవైపుకు అడుగులు ఎలా వేస్తారు?

వ్యాసకర్త: ప్రముఖ జర్నలిస్టు
(Rediff.com నుంచి)

వర్సిటీల ప్రతిష్ఠను పెంచే విధానాలు

విద్య



ప్రొఫెసర్ కనకదుర్గ దంటు

ప్రపంచంలో మన విశ్వవిద్యాలయాలు మంచి ర్యాంకు సంపాదించాలంటే కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి, వాటిని సాధించాలి. ఈ అంశాలు మన రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ఎంత వరకు తృప్తికరంగా ఉన్నాయో, వాటిలో చేపట్టాల్సిన సంస్కరణలు ఏమిటో విశ్లేషించుకోవాలి. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఒక్కటి కూడా ప్రపంచంలో 100 ర్యాంకుల్లో లేదు.

ర్యాంకుల గణనలో రెండు అంశాలుంటాయి. అవి 'ఆర్థిక అంశాలు, సామాజిక అంశాలు'. ఆర్థిక అంశాల్లో ముఖ్యమైనవి ఇన్నోవేషన్ (ఆర్థికాభివృద్ధికి కొత్త దారు లు), రీసెర్చ్ (ఆర్థిక పరిపుష్టికి, పెరుగుదలకు కావాల్సిన పరిశోధన), పబ్లికేషన్స్ (చేసిన పరిశోధనలు, కొత్తగా కనుక్కొన్న విషయాలు ప్రపంచప్రఖ్యాత పేపర్లలో, జర్నల్స్‌లో ప్రచురించడం).

దీన్ని బట్టి అర్థమైన ముఖ్యమైన విషయం ఏమిటంటే–ఉన్నత విద్యను అందించే విశ్వవిద్యాలయాలు ఆర్థిక పురోభివృద్ధికి నిరంతరం పనిచేయాలి. ఒక దేశం, ప్రాంతంలో మనుషులను అన్నిరకాలుగా సంపన్నులను చేసే విషయాల మీద పరిశోధన, ప్రచురణ చేస్తూ అవి సామాన్య జనాలకు కూడా ఉపయోగపడి వారిని అభివృద్ధిలోకి తీసుకురావాలి. అంటే ఒక సమాజం ఆర్థికప్రగతికి ఆ దేశంలోని విశ్వవిద్యాలయాల్లో జరిగిన పరిశోధనే ఆధారం. అంటే విశ్వవిద్యాలయంలో ఉన్న సమయంలో, తర్వాత ఎక్కడైనా ఉద్యోగాల్లో చేరినా, ఆ విద్యార్థులు నిరంతర పరిశోధకులుగా కొనసాగి వారి దేశ ఆర్థికస్థాయిని పెంచాలి.

రాష్ట్రంలో ఉన్న విశ్వవిద్యాలయాల్లో ఎంతవరకు ఈ అంశాలకు ప్రాధాన్యం ఉన్నదో విశ్లేషించాల్సి ఉన్నది. ఈ ప్రాంతంలో ఉన్నత విద్య చంద్రబాబు సీఎం అయిననాటి నుంచి తిరోగమనంలో పడింది.ఆయన విశ్వవిద్యాలయాలకు ఇచ్చే గ్రాంటు తగ్గించారు. కంప్యూటర్ విద్య మాత్రమే విద్యగా ప్రచారం చేశారు. అప్పుడే రాజీవ్‌గాంధీ ప్రవేశపెట్టిన శాస్త్ర, సాంకేతిక సంస్కరణలు కూడా ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రాచుర్యం పొందాయి. ఇక ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మాత్రమే మానవ సమాజానికి అభివృద్ధిపథం అని పొరపాటు పడిన చంద్రబాబు వర్సిటీల్లోని ఉన్నత విద్యను, పరిశోధనలను నిర్లక్ష్యం చేశారు. ఇబ్బడిముబ్బడిగా ఇంజినీరింగ్ కాలేజీలకు అనుమతులు ఇచ్చి, మిగతా రంగాలన్నీ కుంటుపడటానికి కారణమయ్యారు. నిజానికి విశ్వవిద్యాలయాల్లో, శాస్త్రీయ రంగాల్లో కోర్ సైన్సెస్‌లో జరిగిన పరిశోధనలే ఏ ఇంజినీరింగ్, టెక్నాలజీ అభివృద్ధికైనా ఉపయోగపడేవి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, జియాలజీ లాంటి రంగాల్లో విశ్వవిద్యాలయల్లో చాలా పరిశోధనలు జరిగితేనే శాస్త్ర, సాంకేతిక సంస్థల్లో పరిశోధన అడ్వాన్స్‌డ్ విషయాల్లో సాగుతుంది. ఈ మూల శాస్త్రాలు ప్రగతి సాధించకపోతే కష్టం. మరి ఈ రంగాల్లో విశ్వవిద్యాలయాల్లో జరుగుతున్న పరిశోధనలు ఏమిటి? వాటి ఫలితాలు ఎక్కడ దొరుకుతున్నాయి? ఉపయోగపడుతున్నాయి? అలాగే సామాజికశాస్త్రాలైన ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, ఎడ్యుకేషన్, పబ్లిక్ ఎడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ వంటి శాస్త్రాల ద్వారా సమాజాన్ని అర్థంచేసుకోవాలి. లేకపోతే సామాజిక విలువలు దెబ్బతింటాయి. అది అన్నిరంగాలకూ విస్తరిస్తుంది.

తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ వహించి వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని, వ్యవసాయరంగాన్ని ఒక దగ్గరికి చేర్చి వ్యవసాయరంగంలో సాధిస్తున్న ప్రగతి చూస్తే విశ్వవిద్యాలయాలకు, సమాజ ఆర్థికరంగానికి ఉన్న అవినాభావ సంబంధం అర్థమౌతుంది. అలాగే ఆర్ట్స్, హ్యూమానిటీస్ రంగాలు ప్రజల మారుతున్న అభిరుచులకు అద్దంపడుతూ, వారిని, జీవితాన్ని ఒక విలువలు కలిగిన మార్గంలోకి మళ్లించగలవు. ఈ రంగాల్లో అతి ముఖ్యమైనది సంస్కృతిలో భాగమైన భాషారంగం. ఈ శాస్త్రాలన్నీ అభ్యసించడానికి కావాల్సింది భాష. ప్రసిద్ధ అమెరికన్ భాషా శాస్త్రజ్ఞుడు ఇలా అంటాడు. 'ఒక వ్యక్తి భాషానైపుణ్యాలు అతని ఇతర నైపుణ్యాలను నిర్ణయిస్తాయి' అని. విశ్వవిద్యాలయ విద్య పూర్తి చేసి పరిశోధన చేయాలన్నా, ఏదైనా ఉద్యోగం చేయాలన్నా, స్వయం ఉపాధి మార్గాలు చూసుకోవాలన్నా భాషా నైపుణ్యాలు చాలా ముఖ్యం.

మరి ఎన్ని విశ్వవిద్యాలయాలు ఈ విషయాన్ని గుర్తిస్తున్నాయి? అసలు విద్యార్థులకు చదువుకుంటున్న సంవత్సరాల్లో జీవితం కోల్పోకూడదంటే పాఠశాలల్లో, కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల అవసరాల్నీ తీర్చేట్టు, వారిని సంపూర్ణ మానవులుగా ఎదిగేటట్టు చేసే ప్రక్రియలు అన్నీ ఉండాలి.

1) పాఠశాలల్లో చదువుతోపాటే ఆటలు, లలిత కళలు నేర్పాలి. ఆరవ తరగతి నుంచి తప్పనిసరిగా ఒక ఆట, ఒక కళ చదువుతోపాటు నేర్పాలి. కళలు మనిషిలోని నేర ప్రవృత్తిని నివారిస్తాయి. సున్నిత భావాలను పెంపొందిస్తాయి. 2) కళాశాలల్లో ఆటల క్లబ్బులను, లలిత కళలు నేర్పే సెంటర్లను తప్పనిసరిగా నెలకొల్పాలి. చదువు మేధను పెంచితే, ఆటలు ఆరోగ్యాన్ని, దారుఢ్యాన్ని, కళలు మానసిక సంతులతను పెంచి కాపాడుతాయి. 3) విశ్వవిద్యాలయాల్లో వారు చదివే కోర్సులు జీవితానికి, ఎలా దోహదపడుతాయో చెప్పే అంశంతో పాటు ఇంకొక ముఖ్యమైన సెంటర్ ఉండాలి. అందులో నాలుగు ముఖ్యమైన భాగాలుండాలి. ఒకటి అకడమిక్ హెల్ప్ భాగం. ఇందులో విశ్వవిద్యాలయ విద్యార్థులకు, పరిశోధన చేసే వారికి యూనివర్సిటీలోని వివిధ విభాగాల ఆచార్యులు చదువులోని సందేహాలు తీర్చి మార్గదర్శకం చేయాలి. ఇంగ్లీష్ భాషా నైపుణ్యాలు ముఖ్యంగా బోధించాలి. వర్సిటీలోని అధ్యాపకులే వారానికి రెండు గంటలు తమ సమయాన్ని ఇక్కడ వెచ్చించాలి. రెండవ విభాగం కౌన్సిలింగ్ సెంటర్. విద్యార్థులకు ఉన్న కుటుంబ, వ్యక్తిగత సమస్యల గురించి సలహాలు ఇవ్వాలి. వారు చదువుమీద, భవిష్యత్తు మీద కేంద్రీకరించేటట్టు చేయాలి. మూడవది లలిత కళల విభాగం. ఉత్సాహం ఉన్న విద్యార్థులు తీరిక వేళల్లో నేర్చుకోవడానికి నృత్యం, సంగీతం, చిత్రలేఖనం, చేతి నిపుణత క్రియలు వగైరా ఉండాలి. నాల్గవది గేమ్స్ అండ్ స్పోర్ట్స్ సెంటర్. ఇది విద్యార్థులకు మంచి రిక్రియేషన్ ఇస్తుంది. మన రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో పై విభాగాలు ఎన్నింటిలో ఉన్నాయి? అలాగే పాశ్చాత్య దేశాలు, యూరోపియన్ దేశాల ఏ విశ్వవిద్యాలయ వెబ్‌సైట్లు చూసినా విభాగాలు, ఫ్యాకల్టీ, విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ఈవెంట్స్ అన్నీ తెలుస్తాయి. అగ్రికల్చర్ యూనివర్సిటీ సైట్ అన్నికంటే బాగుంది. మరి అన్నీ ఆ స్థాయిలో ఎందుకు లేవు? విశ్వవిద్యాలయ అధ్యాపకులకు పీహెచ్‌డీ తప్పనిసరిగా ఉండాలి.

ఉపాధ్యాయుల ఉద్యోగాలకు గానీ, రీసెర్చ్ స్కాలర్లకు ఇచ్చే పరీక్షలు గానీ వారి అవగాహన, భావనాపటిమ, తులనాత్మకశక్తి, విమర్శనాశక్తి, విశ్లేషణాశక్తిని పరిక్షించేవిగా ఉండాలి. అప్పుడే వారు విద్యార్థులకు పాఠాలుచెప్పగల శక్తిగానీ, పీహెచ్‌డీ పరిశోధనా గ్రంథం రాయగలిగిన పటిమగానీ కలిగి ఉంటారు. కేవలం జ్ఞాపకశక్తికి పరీక్ష పెడితే అటు భాషా నైపుణ్యాలు గానీ, ఇటు భావనాశక్తి గానీ లేనివారు ఉత్తీర్ణులవుతారు. వారు ఉద్యోగాల్లో, పరిశోధనల్లో ఎలా రాణించగలరు? అప్పుడు సహజంగా విద్యారంగ స్థాయి దిగజారుతుంది. ఇప్పుడు అదే జరుగుతున్నది. ఉన్నత విద్యా రంగంలో ఉద్యోగాలకు, పరిశోధనకు వాడే పరీక్షా విధానం మారితే తప్ప విద్యారంగం స్థాయి పెరుగదు. ఆబ్జెక్టివ్ ప్రశ్నలు కాక, సొంతంగా ఒక వ్యాసం రాయగలిగే సామర్థ్యం పరీక్షించాలి. ఏ కోర్సుకైనా, ఉద్యోగానికైనా, అవగాహన, ఆలోచన ముఖ్యం. అసలు ఉన్న విద్యాస్థాయిలో విద్యార్థులందరికీ భాషా నైపుణ్యాల మీద పట్టు ఉండాలంటే ఆ ప్రక్రియ పాఠశాల స్థాయి నుంచే జరుగాలి.

రెండవ అంశమైన 'సామాజిక అంశాలు'లో నాలుగు రకాలుగా విద్యావిధానాన్ని పరిశీలిస్తారు. 1.వసతులు (15శాతం) మొదటి అంశం. ఒక విశ్వవిద్యాలయంలో మౌలిక వసతులు, చదువుకునే వాతావరణాన్ని బట్టి విద్యార్థులు ఎలా తయారు అవుతారన్నది ఆధారపడి ఉంటుంది. 2) బోధన (30 శాతం)ఒక విద్యాలయంలో (ఏస్థాయిలో అయినా) అతి ముఖ్యమైనది బోధకుల క్వాలిటీ, తరగతిలో వారు తమ విద్యార్థులకు చేసే మార్గదర్శనం చాలా ముఖ్యమైనవి. పశ్చిమ దేశాల్లో సీనియర్‌ప్రొఫెసర్ అయినా సరే ఒక సెమిస్టర్‌లో కొత్త పరిశోధన చేయకపోయినా, ఒక్క సెమిస్టర్ పేపర్ ఇవ్వకపోయినా వారికి తర్వాత టీచింగ్‌కు అవకాశం ఇవ్వరు. మన విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ సెలక్షన్ అప్పుడు చూపించిన పబ్లికేషన్లనే ప్రొఫెసర్ ప్రమోషన్‌కు చూపించడం పరిపాటి. ఈ పద్ధతి మారాలి. ఉన్నత విద్యారంగంలోని అధ్యాపకులు నిరంతరంగా పరిశోధన చేయాలి. తాను ఎదుగుతూ విద్యార్థులకు మార్గదర్శకుడిగా నిలువాలి. 3)ఎంప్లాయిబిలిటీ (40శాతం)అంశం అన్నిటికంటే ముఖ్యమైనది. ఒక విశ్వవిద్యాలయంలో చదువుకున్న విద్యార్థులు త్వరితగతిన మారుతున్న అవసరాలకు అనుగుణంగా తమ విజ్ఞానాన్ని ఉపయోగించగలుగాలి. పరిశ్రమల్లో, సంస్థల్లో పనిచేయగలిగిన నైపుణ్యాలు సంతరించుకున్న విద్యార్థులు మాత్రమే ఉద్యోగాలు పొందగలరు. జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో ఎందరు విద్యార్థులకు ప్లేస్‌మెంట్ దొరుకుతుందో, దాన్నిబట్టి విశ్వవిద్యాలయాల ప్రతిష్ఠ పెరుగుతుంది. 4. సామాజిక బాధ్యత (15 శాతం). దీనిలో ఒక విశ్వవిద్యాలయం స్థానికంగా ఉన్న పరిశ్రమలు, ఇతర సంస్థలే గాక, స్థానిక సమాజంలోని మనుషులతో ఎంతవరకు బాధ్యతగా ఉంటుంది అన్న అంశం ముఖ్యం. స్థానికులలో వెనుకబడిన వారు, బీద వారికి ఏ రకంగా సహాయం చేస్తుంది,అనుకోని ప్రకృతి వైపరీత్యాలలో ఎంత అండగా నిలబడుతుందీ అన్న అంశాలు చాలా ముఖ్యం. ప్రాంతీయంగా ఉన్న అసమానతలు తొలిగించడంలో విశ్వవిద్యాలయం ప్రముఖపాత్ర వహించాలి. ముఖ్యంగా సమాజంలో పెరుగుతున్న అసహనం, నేర ప్రవృత్తి, లింగవివక్ష, లైంగికదాడులు, కుటుంబ కలహాలు వంటివి నివారించడానికి కూడా విశ్వవిద్యాలయాలు వారి విద్యార్థులను తయారుచేయాలి. దీనివల్ల వారి వారి ప్రాంతాలలో జరిగే అసాంఘిక కార్యక్రమాలను అడ్డుకోగలుగుతారు. ఈసోయితో ఎక్కడికి వెళ్లినా వారి చుట్టుపక్కల వారిని ఆదుకోగలుగుతారు. ఈ రకంగా ఎంత చిన్న విశ్వవిద్యాలయమైనా తన స్థాయిలోనే ఆర్థిక ప్రగతికి, సామాజిక సంతులతకు ప్రయత్నించాలి. అప్పుడు ఆ విశ్వవిద్యాలయానికి మంచి ర్యాంకు వస్తుంది. ఈ దిశగా మన విశ్వవిద్యాలయాలు ఆలోచించాలి. అడుగులు వేయాలి.

సమాజంలో పెరుగుతున్న అసహనం, నేర ప్రవృత్తి, లింగవివక్ష, లైంగికదాడులు, కుటుంబ కలహాలు వంటివి నివారించడానికి కూడా విశ్వవిద్యాలయాలు వారి విద్యార్థులను తయారుచేయాలి. దీనివల్ల వారి వారి ప్రాంతాలలో జరిగే అసాంఘిక కార్యక్రమాలను అడ్డుకోగలుగుతారు. ఈ సోయితో ఎక్కడికి వెళ్లినా వారి చుట్టుపక్కల వారిని ఆదుకోగలుగుతారు. ఈ రకంగా ఎంత చిన్న విశ్వవిద్యాలయమైనా తన స్థాయిలోనే ఆర్థిక ప్రగతికి, సామాజిక సంతులతకు ప్రయత్నించాలి. అప్పుడు ఆ విశ్వవిద్యాలయానికి మంచి ర్యాంకు వస్తుంది.

(వ్యాసకర్త: రిటైర్డ్ ప్రొఫెసర్, ఓయూ)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

అసెంబ్లీలో జయ ఫొటోపై వివాదం

ఆవిష్కరణకు దూరంగా డీఎంకే, కాంగ్రెస్, దినకరన్
ఇది ముమ్మాటికీ అసెంబ్లీని అవమానించడమేనన్న స్టాలిన్
ఫొటోను తొలిగించాలని కోర్టులో డీఎంకే పిటిషన్



చెన్నై: తమిళనాడు అసెంబ్లీలో జయలలిత ఫొటో ఏర్పాటు వివాదానికి తెరలేపింది. ఫొటో ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రతిపక్ష డీఎంకే, కాంగ్రెస్ దూరంగా ఉన్నాయి. జయ ఫొటో ఏర్పాటు ముమ్మాటికీ అసెంబ్లీని అవమానించడమేనని స్టాలిన్ వ్యాఖ్యానించారు. మరోవైపు జయ ఫొటోను తొలిగించాలని చెన్నై హైకోర్టులో డీఎంకే దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం విచారిస్తామని ధర్మాసనం తెలిపింది. అంతకుముందు అసెంబ్లీ హాలులో ఏర్పాటుచేసిన జయలలిత ఫొటోను స్పీకర్ ధన్‌పాల్ సోమవారం ఆవిష్కరించారు. ఏడు అడుగుల ఎత్తున్న జయలలిత చిత్రపటాన్ని అసెంబ్లీ హాలులో ఆవిష్కరించారు. కార్యక్రమంలో తమిళనాడు సీఎం పళని స్వామి, డిప్యూటీ సీఎం పన్నీర్‌సెల్వం సహా మంత్రులు, అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిపక్ష డీఎంకే సహా కాంగ్రెస్, ఐయూఎంఎల్ సభ్యులు బహిష్కరించారు. ఇటీవల ఆర్కే నగర్ ఎమ్మెల్యేగా గెలిచిన శశికళ మేనల్లుడు టీటీవీ దినకరన్ కూడా జయలలిత ఫొటో ఆవిష్కరణ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. కాగా అసెంబ్లీ హాలులో జయ ఫొటోను పెట్టడంపై ప్రతిపక్ష డీఎంకే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నది. అవినీతి కేసులో దోషిగా తేలిన వ్యక్తి ఫొటోను అసెంబ్లీ హాలులో నెలకొల్పడం సమంజసం కాదని ఆ పార్టీ పేర్కొంది. 'జయలలిత బ్రతికుంటే శశికళతో కలిసి జైలు ఊచలు లెక్కబెట్టేవారే. తమిళుల గౌరవాన్ని చాటిన గొప్ప వ్యక్తుల మధ్య నేరస్థురాలైన జయలలిత ఫొటో ఉంచడమేంటి?' అని డీఎంకే వర్కింగ్ ప్రెసిడెంట్ స్టాలిన్ ప్రశ్నించారు. తక్షణమే జయ ఫొటోను తొలిగించాలని స్టాలిన్ డిమాండ్ చేశారు. అసెంబ్లీలో జయలలిత ఫొటో ఆవిష్కరణ జరుగగానే చెన్నై హైకోర్టును డీఎంకే ఆశ్రయించగా, మంగళవారం విచారించాలని చీఫ్ జస్టిస్ ఇందిరా బెనర్జీ బెంచ్ నిర్ణయించింది.

పాక్ పార్లమెంట్‌కు హిందూ మహిళ!

కృష్ణకుమారిని నామినేట్ చేయనున్న పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ



కరాచీ: పాకిస్థాన్‌లో తొలిసారిగా ఓ హిందూ మహిళ పార్లమెంటు సభ్యురాలు కానున్నారు. వచ్చే నెలలో ఎగువసభకు జరిగే ఎన్నికల్లో ప్రతిపక్ష పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ) కృష్ణకుమారిని అభ్యర్థినిగా ప్రకటించింది. ఈమేరకు పార్టీ అధికార ప్రతినిధి నాసిర్‌షా సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మన రాజ్యసభ తరహాలో పరోక్ష పద్ధతిన జరిగే ఈ ఎన్నికలు మార్చి 3న జరుగనున్నాయి. కృష్ణకుమారికి ఓటువేసి గెలిపించాల్సిందిగా తమ పార్టీ ప్రజాప్రతినిధుల్ని పీపీపీ ఆదేశించింది. పాకిస్థాన్‌లో రాజకీయ పక్షాలు సాధారణంగా ఎగువసభకు సంపన్న వర్గాలకు చెందినవారిని, ప్రముఖులను మాత్రమే నామినేట్ చేస్తుంటాయి. తనను అభ్యర్థిగా ప్రకటించడంపై కృష్ణకుమారి హర్షం వ్యక్తంచేశారు. తమది పేద కుటుంబమని, తాను చట్టసభలోకి వెళ్తానని ఊహించలేదని ఆమె చెప్పారు. 1947లో పాకిస్థాన్ ఏర్పడినప్పటినుంచి ఇప్పటివరకు హిందూమహిళలు ఎవరూ పార్లమెంటుకు ఎన్నికవలేదు.

దేశంలోనే సంపన్న సీఎం చంద్రబాబు!


రూ.177 కోట్లతో మొదటిస్థానం.. ఏడీఆర్ నివేదిక వెల్లడి



కోల్‌కతా: దేశంలో అతి సంపన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడేనని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) అనే ప్రభుత్వేతర సంస్థ వెల్లడించింది. రూ.177కోట్ల ఆస్తులతో దేశంలోనే అత్యంత ధనిక సీఎంగా చంద్రబాబు నిలిచారు. తర్వాత ఐదుస్థానాల్లో వరుసగా అరుణాచల్ ప్రదేశ్ సీఎం పెమాఖండూ (రూ.129కోట్లు), పంజాబ్ సీఎం అమరీందర్‌సింగ్ (రూ.48కోట్లు), తెలంగాణ సీఎం కే చంద్రశేఖర్‌రావు (రూ15.5కోట్లు), మేఘాలయ సీఎం ముకుల్ సంగ్మా (రూ.14.5కోట్లు) ఉన్నారు. దేశంలోని 81శాతం మంది ముఖ్యమంత్రులు కోటీశ్వరులని, 35శాతం సీఎంలు క్రిమినల్ ఆరోపణలను ఎదుర్కొంటున్నారని ఏడీఆర్ తెలిపింది. 31మంది ముఖ్యమంత్రులు ప్రకటించిన అఫిడవిట్లను విశ్లేషించి ఓ నివేదికను సోమవారం ఏడీఆర్ విడుదల చేసింది. దీని ప్రకారం.. 31మందిలో 11మంది (35శాతం) సీఎంలు తమపై నమోదైన క్రిమినల్ కేసుల వివరాలను ప్రకటించారని ఏడీఆర్ నివేదిక పేర్కొన్నది. వీరిలో 26శాతం మంది ముఖ్యమంత్రులు హత్యారోపణల వంటి తీవ్రమైన నేరాభియోగాలను ఎదుర్కొంటున్నారు. 25మంది ముఖ్యమంత్రులు (81శాతం మంది) కోటీశ్వరులేనని ఏడీఆర్ వెల్లడించింది. సగటున ఒక్కో సీఎం ఆస్తుల విలువ రూ.16.18కోట్లని తేల్చింది. అతితక్కువ ఆస్తులు కలిగిన సీఎంలుగా మాణిక్ సర్కార్ (త్రిపుర)-రూ. 27లక్షలు, మమతాబెనర్జీ (పశ్చిమబెంగాల్)-రూ.30.45లక్షలు నిలిచారు. ఇక 10శాతం మంది సీఎంలు 12వ తరగతిలోపు విద్యార్హతలు కలిగి ఉండటం గమనార్హం.

పాక్ మూల్యం చెల్లించక తప్పదు

- దుస్సాహసానికి తగిన గుణపాఠం చెబుతాం
- కార్యాచరణకు సిద్ధమవుతున్న భారత్
- పాక్ నుంచే జైషే ఉగ్రవాదులకు ఆదేశాలందినట్లు ఆధారాలున్నాయి
- రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి
- సుంజ్వాన్‌లో ఏరియల్ సర్వే
- దవాఖానలో బాధితులకు పరామర్శ



మిలిటరీ దవాఖానలో సుంజ్వాన్ బాధితురాలిని ఓదారుస్తున్న నిర్మలా సీతారామన్; సీఆర్పీఎఫ్ క్యాంప్ వద్ద మోహరించిన జమ్ముకశ్మీర్ పోలీసు బలగాలు

శ్రీనగర్, ఫిబ్రవరి 12:

జమ్ముకశ్మీర్‌లోని సుంజ్వాన్ ఆర్మీక్యాంప్‌పై ఉగ్రవాదుల దాడి ఘటనపై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ దుస్సాహసానికి పాకిస్థాన్ తగిన మూల్యం చెల్లించక తప్పదని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ హెచ్చరించారు. ఉగ్రవాదులు సరిహద్దులు దాటివచ్చినట్లు తమ వద్ద ఆధారాలున్నాయని, పాకిస్థానే అందుకు బాధ్యత వహించాలని స్పష్టంచేశారు. అయితే తమ సరిహద్దులు దాటి లక్షితదాడులు జరిపేందుకు భారత్ సాహసించవద్దని పాక్ హెచ్చరించింది. మరోవైపు యుద్ధం పరిష్కారం కాదని, రక్తపాతాన్ని నివారించేందుకు భారత్-పాక్ చర్చలు జరుపాలని జమ్ముకశ్మీర్ సీఎం మెహబూబా ముఫ్తీ సూచించారు. ఉగ్రవాదులు దాడిచేసిన సుంజ్వాన్ ఆర్మీ క్యాంప్ ప్రాంతంలో రక్షణమంత్రి నిర్మలాసీతారామన్ హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన నిర్మల.. పాక్ వైఖరిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. 'పాక్‌లో నివసిస్తున్న మసూద్ అజహర్ ప్రోద్బలంతో జైషే మొహమ్మద్ ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. సరిహద్దుకు ఆవల నుంచే వారికి ఆదేశాలిచ్చి నడిపించారు. ఆర్మీక్యాంప్, కుటుంబాలు రెండూ ఉండే ప్రాంతాన్ని ఎంపిక చేయాలని మసూద్ అజార్ నుంచి ఆదేశాలు వచ్చాయి. అందుకే సుంజ్వాన్ క్యాంప్‌ను వారు లక్ష్యంగా చేసుకున్నారు. స్థానికుల మద్దతు కూడా ఉగ్రవాదులకు లభించి ఉండొచ్చు' అని ఆమె తెలిపారు. చొరబాట్లను ప్రోత్సహించేందుకే పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్నదని విమర్శించారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా తిప్పికొడుతుందని, ఆ దిశగా ఓ కార్యచరణకు సిద్ధమవుతున్నదని ఆమె వెల్లడించారు. 'ఇప్పటికే ఎన్నోసార్లు ఉగ్రవాదుల చర్యల వెనుక పాక్ హస్తమున్నట్లు నిరూపితమైంది. సుంజ్వాన్ దాడికి సంబంధించి కూడా పక్కా ఆధారాలు లభ్యమయ్యాయి. ఈ దుస్సాహసానికి సిద్ధమైన పాక్ తగిన మూల్యం చెల్లించేలా చేస్తాం' అని సీతారామన్ చెప్పారు. అనంతరం మిలిటరీ దవాఖానకు వెళ్లిన నిర్మల ఉగ్రదాడిలో గాయపడిన వారిని పరామర్శించారు.

లక్షిత దాడులకు సాహసించవద్దు.. పాక్ హెచ్చరిక
సుంజ్వాన్‌పై ఉగ్రదాడి నెపాన్ని అడ్డం పెట్టుకొని భారత్ మరోసారి సరిహద్దు దాటి వచ్చి లక్షిత దాడులు జరిపేందుకు సాహసించవద్దని పాకిస్థాన్ హెచ్చరించింది. సుంజ్వాన్‌లోని ఆర్మీ క్యాంప్‌పై దాడికి పాల్పడింది పాక్‌కు చెందిన జైషే ఉగ్రవాదులేనని భారత్ ప్రకటించిన నేపథ్యంలో పాక్ ఈ హెచ్చరిక చేసింది.

రక్తపాతాన్ని ఆపేందుకు పాక్‌తో చర్చలు జరుపాలి: సీఎం
భారత్, పాకిస్థాన్ మధ్య మూడు యుద్ధాలు జరిగాయని అయినా కశ్మీర్ సమస్య పరిష్కారం కాలేదని రాష్ట్ర ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ పేర్కొన్నారు. సోమవారం ఆమె అసెంబ్లీలో మాట్లాడుతూ, 'మనం పాకిస్థాన్‌తో 1947, 1965, 1971లో మూడు యుద్ధాలు చేశాం. కార్గిల్ యుద్ధంతో సహా అన్నీ మనమే గెలిచాం. కానీ ప్రాథమిక సమస్య మాత్రం పరిష్కారం కాలేదు' అన్నారు. జమ్ముకశ్మీర్‌లో రక్తపాతాన్ని ఆపేందుకు వెంటనే భారత్, పాక్ మధ్య చర్చలు జరుగాలని ఆమె సూచించారు.

సీఆర్పీఎఫ్ క్యాంప్‌పై దాడికి విఫలయత్నం జవాన్ మృతి

ఉగ్రవాదులు సోమవారం సీఆర్పీఎఫ్ శిబిరంపై దాడికి ప్రయత్నించారు. వారి యత్నాన్ని భద్రతా బలగాలు తిప్పికొట్టాయి. అనంతరం ఉగ్రవాదుల కోసం గాలిస్తుండగా జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ జవాన్ మృత్యువాత పడ్డారు. ఈ ఘటన శ్రీనగర్‌లోని కరణ్‌నగర్ సీఆర్పీఎఫ్ శిబిరం వద్ద చోటుచేసుకున్నది. ఉదయం 4 గంటల ప్రాంతంలో ఇద్దరు సాయుధులు క్యాంప్ వైపు వస్తుండటంతో అప్రమత్తమైన జవాన్లు వారిపై కాల్పులు జరిపారు. దీంతో ఉగ్రవాదులు అక్కడి నుంచి పారిపోయి.. సమీపంలోని ఓ పాడుబడిన ఇంట్లో దాక్కున్నారు. సీఆర్పీఎఫ్ జవాన్లు ఉగ్రవాదుల కోసం గాలిస్తుండగా ఇరువర్గాల మధ్య ఎదుకాల్పులు జరిగాయి. ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులకు దిగడంతో బీహార్‌కు చెందిన ముజాహిద్‌ఖాన్ అనే జవాను చనిపోయారు.

కారుబాంబు దాడికి ఉగ్రవాదుల కుట్ర!

శ్రీనగర్: జైషే మొహమ్మద్ (జేఈఎం), లష్కరే తాయిబా ఉగ్రవాద సంస్థలు కశ్మీర్‌లో భారీ స్థాయిలో దాడి జరిపేందుకు వ్యూహం రచిస్తున్నట్టు భద్రతా సంస్థలకు సమాచారం అందింది. పేలుడు పదార్థాలతో నిండిన వాహనంతో ఫిదాయీ (ఆత్మాహుతి) దాడి చేయాలని ఉగ్రవాద సంస్థలు కుట్ర పన్నుతున్నట్టు వారి ఫోన్ సంభాషణల ద్వారా భద్రతా సంస్థలు గ్రహించాయి. తాజా సమాచారం ప్రకారం పైరెండు ఉగ్రవాద సంస్థలు హిజ్బుల్ ముజాహిదీన్‌తో కలిసి కశ్మీర్ లోయలో 'కళ్లు చెదిరే'లా కారు లేదా వాహన బాంబు దాడి జరుపాలని ప్రణాళిక వేస్తున్నట్టు తెలిసింది. జైషే మొహమ్మద్ సంస్థ 2001లో జమ్ముకశ్మీర్ అసెంబ్లీపై జరిపిన కారుబాంబు దాడిలో 40 మంది పౌరులు, ముగ్గురు ఉగ్రవాదులు మరణించారు. ఉగ్రవాదులు మరోసారి అసెంబ్లీ లేదా అధికారులు నివసించే ప్రాంతాలు లేదా సైనిక స్థావరం, హోటల్‌పై దాడి చేయవచ్చని భావిస్తున్నారు. ఇక దాడికి కావాల్సిన బాంబు తయారీకి లష్కరే తాయిబా కమాండర్ నవీద్ జట్ కృషి చేస్తున్నట్టు తెలిసింది. ఉగ్రవాదులు ఈ నెల 8న ఇద్దరు పోలీసులను హతమార్చి దవాఖాన నుంచి నవీద్ జట్‌ను తప్పించిన సంగతి తెలిసిందే.



ఆదిలాబాద్‌లోని అటవీ ప్రాంతం (ఫైల్)

భారతమాతకు ఆకుపచ్చటి చీర!

దేశంలో పెరుగుతున్న అడవులశాతం ■ రెండేండ్లలో ఒక శాతం పెరుగుదల
అడవుల విస్తీర్ణత వృద్ధిలో ఏపీ నం.1 ■ 5వ స్థానంలో తెలంగాణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:

ప్రపంచవ్యాప్తంగా అడవుల శాతం తగ్గిపోతుండగా భారత్‌లో మాత్రం పెరుగుతున్నది. 2015 నుంచి 2017 వరకు రెండేండ్లలో మన దేశంలో అడవులు, చెట్లున్న ప్రాంతాల విస్తీర్ణంలో ఒక శాతం పెరుగుదల నమోదైందని 'భారత అటవీ నివేదిక 2017' (ఐఎఫ్ఎస్ఆర్) వెల్లడించింది. కేంద్ర పర్యావరణ మంత్రులు హర్షవర్ధన్, మహేశ్‌శర్మ సోమవారం న్యూఢిల్లీలో ఈ నివేదికను విడుదల చేశారు. ఈ నివేదిక ప్రకారం దేశ విస్తీర్ణంలో 21.54శాతం అంటే 7,08,273 చదరపు కిలోమీటర్ల మేరకు అడవులున్నాయి. అడవులతోపాటు, చెట్లున్న ప్రాంతాలను కూడా కలుపుకొంటే ఇది 24.39 అంటే 8,02,088 కిమీ ఉంది. 2015తో పోల్చుకుంటే దట్టమైన అడవులు కూడా 1.36 శాతం పెరిగాయని పర్యావరణ మంత్రిత్వశాఖ పేర్కొంది. రెండేండ్లలో దేశంలో అడవులు, చెట్లున్న ప్రాంతాల విస్తీర్ణం 8,012 కి.మీ. (8 కోట్ల 02 లక్షల హెక్టార్లు) మేర పెరిగింది. అడవుల్లో ఎక్కువశాతం పెరుగుదల నమోదుకావడం సంతోషించదగిన పరిణామమని మంత్రి హర్షవర్ధన్ తెలిపారు. ఐఎఫ్ఎస్ఆర్‌ను రెండేండ్లకోసారి విడుదల చేస్తారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లోకెల్లా అడవుల విస్తీర్ణం మధ్యప్రదేశ్‌లో ఎక్కువగా ఉంది. ఆ రాష్ట్రంలో 77,414 కి.మీ. మేర అడవులున్నాయి. తరువాతి స్థానంలో అరుణాచల్‌ప్రదేశ్ (66,964కి.మీ.), ఛత్తీస్‌గఢ్ (55,547 కి.మీ.) ఉన్నాయి.

తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల్లో అడవుల విస్తీర్ణతలో గరిష్ఠవృద్ధి
అడవుల విస్తీర్ణతలో గరిష్ఠవృద్ధి సాధించిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ (2,141కి.మీ), కర్ణాటక (1,101 కి.మీ), కేరళ (1,043 కి.మీ), ఒడిశా (885 కి.మీ), తెలంగాణ (565 కి.మీ.) తొలి ఐదు స్థానాల్లో ఉన్నాయి. మొదటిసారి ఇప్పుడు అడవుల్లో జలవనరుల గురించి కూడా లెక్కగట్టారు. గత పదేండ్లలో అడవుల్లో 2,647 కి.మీ. మేరకు జలవనరులు విస్తరించినట్లు గుర్తించారు. జలవనరుల విస్తరణ మహారాష్ట్ర (243 కి.మీ.), గుజరాత్ (428 కి.మీ.), మధ్యప్రదేశ్ (389 కి.మీ.) ఎక్కువగా జరిగింది. దాదాపు అన్ని రాష్ట్రాల్లో జలవనరుల విస్తీర్ణత పెరిగిందని మంత్రి హర్షవర్ధన్ పేర్కొన్నారు. ఐదు ఈశాన్య రాష్ట్రాలైన మిజోరం(51 కిమీ), నాగాలాండ్ (450 కిమీ), అరుణాచల్ ప్రదేశ్(190 కిమీ), త్రిపుర(164 కిమీ) మేఘాలయ (116 కిమీ)ల్లో మాత్రం అడవులు క్షీణించాయి. అయితే ఆ రాష్ట్రాల భూభాగంలో అడవుల శాతం 70 కంటె అధికంగానే ఉంది. అడవుల శాతంలో భారత్ ప్రపంచంలో పదో స్థానంలో ఉన్నదని మంత్రి తెలిపారు.


దక్షిణ కొరియాలో ముగిసిన కిమ్ సోదరి పర్యటన



దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్‌తో కిమ్‌సోదరి యో జోంగ్

గ్యాంగ్‌వ్యాంగ్ (దక్షిణ కొరియా) : ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ సోదరి కిమ్ యో జోంగ్ దక్షిణ కొరియా పర్యటన ముగిసింది. దక్షిణ కొరియాలో జరిగిన శీతాకాల ఒలింపిక్స్‌కు వచ్చిన ఉత్తర కొరియా బృందానికి ఆమె నాయకత్వం వహించారు. సోదరుడు కిమ్ జోంగ్ ఉన్‌కు చెందిన జెట్ విమానంలో మిగతా బృందసభ్యులతో కలిసి ఆదివారం రాత్రి ప్యాంగ్‌యాంగ్ చేరుకున్నారు. అంతకుముందు దక్షిణ కొరియా అధ్యక్ష భవనంలో తన గౌరవార్థం ఏర్పాటుచేసిన విందులో దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జేతో జోంగ్ చర్చలు జరిపారు. సంగీత కళాకారుల సంప్రదాయ నృత్యాలను మూన్ జేతో కలిసి వీక్షించారు. ఉత్తర కొరియాలో జరిగే సదస్సులో పాల్గొనాలని మూన్‌ను కిమ్ ఆహ్వానించడం విశేషం. విడిపోయి దశాబ్దాలు కావస్తున్నా రెండు దేశాల్లో కొన్నింటిలో ఎలాంటి మార్పు లేదని ఆమె అన్నారు.

పాక్ 'నిర్భయ' కేసు వారం రోజుల్లో విచారణ పూర్తి



లాహోర్: మైనర్ బాలికపై లైంగిక దాడి, హత్య కేసులో ప్రధాన నిందితుడే దోషి అని పాకిస్థాన్ ఉగ్రవాద వ్యతిరేక కోర్టు సోమవారం నిర్ధారించింది. పంజాబ్ రాష్ట్రంలోని కసూర్‌లో ఏడేండ్ల పసిపాప జైనబ్‌ను ఆ కామాంధుడు కిడ్నాప్ చేసి లైంగికంగా హింసించి, హత్యచేసి చెత్తకుప్పలో పడేశాడు. గత జనవరి 5న జరిగిన ఈ ఘటనపై పాక్‌లో దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. పాక్ నిర్భయగా ఈ ఘటనను మన దేశ మీడియా అభివర్ణించింది. ఈ కేసు విచారణను ఉగ్రవాద వ్యతిరేక కోర్టుకు అప్పగించి వారం రోజుల్లోగా తేల్చాలని లాహోర్ హైకోర్టు సూచించింది. సాక్షుల విచారణ, లాయర్ల వాదనలు విన్న తరువాత నిందితుడు ఇమ్రాన్ అలీ నక్ష్‌బంది హత్యకు పాల్పడ్డట్లు జడ్జి నిర్ధారించారని జియోన్యూస్ టీవీ తెలిపింది. నిందితుడు ఇమ్రాన్ గతంలో పలువురు బాలికలపై లైంగికదాడులు జరిపి హత్యచేశాడు. బాధితుల నుంచి సేకరించిన శాంపిళ్లను, ఇమ్రాన్ డీఎన్‌ఏను పోల్చిచూడగా దాడి చేసింది అతనే అని తేలింది. పాలిగ్రాఫ్ పరీక్షలు, దుస్తులపై మరకలు, సీసీటీవీ దృశ్యాలు, వైద్య నివేదికలు కూడా ఇమ్రాన్‌ను దోషిగా నిర్ధారించాయి.

సమ్మె కారణంగా నిలిచిన ఎల్పీజీ రవాణా

కోల్‌కతా: సమ్మె కారణంగా ఎల్పీజీ ట్యాంకర్లు నిలిచిపోవడంతో దేశవ్యాప్తంగా గ్యాస్‌సరఫరాపై ప్రభావంపడే అవకాశముందని భావిస్తున్నారు. తూర్పు రీజియన్ పరిధిలోని పశ్చిమబెంగాల్, ఒడిశా, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లో సమ్మె కారణంగా సోమవారం నాలుగువేల ట్యాంకర్లు నిలిచిపోయాయి. ఫలితంగా 32-33 బాటిలింగ్ ప్లాంట్లకు గ్యాస్ సరఫరా స్తంభించింది. 'త్వరలోనే పశ్చిమ, ఉత్తర రీజియన్లలోనూ సమ్మె ప్రారంభమవుతుందని భావిస్తున్నాం. అదే జరిగితే నాలుగు రీజియన్ల పరిధిలో 22వేల ట్యాంకర్లు రవాణాను నిలిపివేస్తాయి' అని కాంట్రాక్టర్ల అసోసియేషన్ నేత భూపిందర్ గుజ్రాల్ తెలిపారు.

ద్వైపాక్షిక బంధం మరింత బలోపేతం

ఒమన్ రాజు ఖబూస్‌తో ప్రధాని మోదీ విస్తృత చర్చలు ■ ఇరుదేశాల మధ్య 8 కీలక ఒప్పందాలపై సంతకాలు
ముగిసిన ప్రధాని పశ్చిమాసియా పర్యటన

మస్కట్, ఫిబ్రవరి 12:



మస్కట్‌లోని సుల్తాన్ ఖబూస్ గ్రాండ్ మసీదును సందర్శించిన ప్రధాని మోదీ



మస్కట్‌లోని పురాతన శివాలయంలో పూజలు చేస్తున్న మోదీ

భారత్-ఒమన్ దేశాల మధ్య ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు తన పర్యటన దోహదపడుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆశాభావం వ్యక్తంచేశారు. చమురు సంపన్న గల్ఫ్‌దేశం ఒమన్‌లో పర్యటించాలన్న తన చిరకాల కోరిక తీరిందని ఆయన ట్విట్టర్‌లో తెలిపారు. మూడు పశ్చిమాసియా దేశాల పర్యటనలో భాగంగా ఆదివారం ఒమన్ చేరుకున్న ప్రధాని మోదీ సోమవారం ఉదయం రాజు ఖబూస్ బిన్ సయీద్‌తో విస్తృత చర్చలు జరిపారు. అనంతరం పలు ఒప్పందాలకు ఇరువురు నేతలు అంగీకారం తెలిపారు. 'ఒమన్, భారత్ మధ్య వందేండ్లకు పూర్వంనుంచే ఉన్న ద్వైపాక్షిక బంధం ఈ పర్యటనతో మరింత బలపడింది. వాణిజ్యం, పెట్టుబడులు, ఇతర రంగాల్లో మున్ముందు గణనీయమైన ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాను' అని మోదీ తెలిపారు. భారత్‌పట్ల, భారతీయులపట్ల విశేష ఆదరాభిమానాలు చూపుతున్న ఒమన్ ప్రజలకు మోదీ ధన్యవాదాలు తెలిపారు. ఒమన్ అభివృద్ధికి శ్రమిస్తున్న నిజాయితీపరులైన భారతీయుల కృషిని సుల్తాన్ ఖబూస్ అభినందించారు. ఒమన్ పర్యటనతో నాలుగురోజుల పశ్చిమాసియా పర్యటనను ముగించుకున్న ప్రధాని సోమవారం సాయంత్రం భారత్‌కు తిరుగుప్రయాణమయ్యారు. పాలస్తీనా, యూఏఈ, ఒమన్‌లో పర్యటించిన ఆయన ఈ సందర్భంగా ఆయా దేశాలతో పలు కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

ఒమన్‌తో 8 ఒప్పందాలపై సంతకాలు
వ్యాపారం, పెట్టుబడులు, ఇంధనవనరులు, రక్షణ, భద్రత, ఆహారభద్రతతోపాటు పలు స్థానిక అంశాలపై నేతలిరువురూ చర్చించినట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రవీశ్‌కుమార్ ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా రక్షణ, ఆరోగ్యం, పర్యాటక రంగాల్లో పరస్పర సహకారంపై భారత్, ఒమన్ దేశాలు ఎనిమిది ఒప్పందాలపై సంతకాలు చేశాయని వెల్లడించారు. దౌత్యాధికారుల, ప్రత్యేక సేవల, అధికారిక పదవుల్లో ఉన్నవారి వీసాల పొడిగింపునకు ఇరుదేశాలు అంగీకరించాయి. ఒమన్‌లోని దుఖ్మ్ ఓడరేవును భారత్ తన రక్షణ అవసరాలకు వాడుకునేందుకు వీలుగా ఒమన్ అంగీకరించింది. ఇరుదేశాల మధ్య వాణిజ్యం రూ.35,370కోట్లకు చేరింది.

పారిశ్రామిక వేత్తలతో మోదీ భేటీ
పశ్చిమాసియాకు చెందిన పారిశ్రామిక వేత్తలతో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. మస్కట్‌లో జరిగిన ఇండియా-ఒమన్ వాణిజ్య సదస్సులో ఆయన పాల్గొన్నారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని మోదీ పారిశ్రామికవేత్తలను కోరారు.

మస్కట్ శివాలయంలో మోదీ పూజలు
మస్కట్‌లోని పురాతన శివాలయాన్ని ప్రధాని మోదీ సోమవారం సందర్శించారు. మాత్రా ప్రాంతంలో ఉన్న ఈ మందిరాన్ని 125 ఏండ్ల క్రితం గుజరాత్‌కు చెందిన వ్యాపారులు నిర్మించారు. అనంతరం ఒమన్‌లోని అతిపెద్ద మసీదు 'సుల్తాన్ ఖబూస్ గ్రాండ్' మసీదును కూడా ప్రధాని సందర్శించారు.

సైన్యంపై భగవత్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

- ఆయన క్షమాపణ చెప్పాల్సిందే
- కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్
- భగవత్ వ్యాఖ్యలను వక్రీకరించారు: ఆరెస్సెస్

జెవార్గి/ న్యూఢిల్లీ/ అగర్తల, ఫిబ్రవరి 12: దేశ భద్రత కోసం ప్రాణ త్యాగాలు చేస్తున్న సైన్యాన్ని ఉద్దేశించి ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. దీనిపై మోహన్ భగవత్ క్షమాపణ చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు. బీహార్‌లోని ముజఫర్‌పూర్‌లో ఆరెస్సెస్ కార్యకర్తల సమావేశంలో ఆదివారం మోహన్ భగవత్ మాట్లాడుతూ 'యుద్ధానికి సంసిద్ధం కావడానికి సైన్యానికి ఆరేడు నెలల సమయం పడుతుంది. కానీ మనకు (ఆరెస్సెస్ శ్రేణులకు) రెండు, మూడు రోజులు చాలు. ఇది మన సామర్థ్యం. ఇది మన క్రమశిక్షణ' అని అన్నారు. దీనిపై సోమవారం కర్ణాటకలోని జెవార్గిలో రాహుల్ మీడియాతో మాట్లాడుతూ 'సరిహద్దుల్లో మన సైనిక జవాన్లు రక్తం ధారపోస్తున్నారు. సైన్యం గురించి మోహన్ భగవత్ వ్యాఖ్యలు వినడానికే బాధగా ఉంది. సైనికులు దేశ భద్రత కోసం పని చేస్తున్నారు. ప్రాణ త్యాగం చేస్తున్న సైనికులపై భగవత్ వ్యాఖ్యలు వారిని అవమానించడమే. ఇది ప్రతి భారతీయుడికి అవమానకరమే. ప్రతి సైనికుడు జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పిస్తారు. భగవత్ వ్యాఖ్యలు మన జాతీయ పతాకాన్ని అవమానించడమే' అని అన్నారు. భగవత్ వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో ఆరెస్సెస్ నష్ట నివారణ చర్యలు చేపట్టింది. భగవత్ వ్యాఖ్యలను వక్రీకరించారని తెలిపింది.



రాయచూర్‌లోని ఓ రోడ్డుపక్క హోటల్‌లో మిర్చీలు తింటున్న రాహుల్‌గాంధీ, సీఎం సిద్ధరామయ్య తదితరులు

సైనికులపై పోలీసు దర్యాప్తు వద్దు

షోపియాన్ కేసులో కశ్మీర్ ప్రభుత్వాన్ని ఆదేశించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: జమ్ముకశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో గత నెల 27న జరిగిన కాల్పుల ఘటనలో సైనికుల మీద స్థానిక పోలీసుల దర్యాప్తుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. రెండువారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని జమ్ముకశ్మీర్ ప్రభుత్వానికి సూచించింది. జనవరి 27న షోపియాన్ జిల్లా గనౌవ్‌పొర గ్రామం మీదుగా వెళ్తున్న ఆర్మీ కాన్వాయ్‌పై అల్లరి మూకలు రాళ్లదాడి చేశాయి. నియంత్రించడం అసాధ్యం కావడంతో సైన్యం కాల్పులు జరుపగా ముగ్గురు పౌరులు మృతిచెందారు. దీనిపై జమ్ముకశ్మీర్ సీఎం మెహబూబా ముఫ్తీ ఆదేశాల మేరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆర్మీ మేజర్ ఆదిత్యకుమార్ సహా '10 గర్వాల్ రైఫిల్స్' యూనిట్‌ను నిందితులుగా చేర్చారు. దీంతో ఆదిత్యకుమార్ తండ్రి లెఫ్టినెంట్ కల్నల్ కర్మవీర్ సింగ్ ఈ నెల 9వ తేదీన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆరోజు అల్లరి మూకలు ఒక్కసారిగా చుట్టుముట్టి రాళ్లదాడి ప్రారంభించాయని, ఉగ్రవాదుల ప్రేరేపణతోనే ఈ దాడి జరిగిందని చెప్పారు. ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, జస్టిస్ ఏ ఎం ఖాన్‌విల్కర్, డీవై చంద్రచూడ్‌తో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. పోలీసుల తదుపరి చర్యలపై స్టే విధించింది. రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని, కౌంటర్ దాఖలు చేయాలని జమ్ముకశ్మీర్ ప్రభుత్వాన్ని ఆదేశించింది.


కంబళపై స్టేకు సుప్రీం నిరాకరణ




న్యూఢిల్లీ: కర్ణాటకలో 'కంబళ' పేరుతో ఏటా జరిపే బర్రెల పరుగు పందేలపై స్టే విధించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. దీనిపై జంతు హక్కుల సంరక్షణ సంస్థ పెటా దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఏ ఎం ఖాన్‌విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. స్టే ఇవ్వడానికి నిరాకరిస్తూ మార్చి 12న తుదివాదనలు వింటామన్నది. కంబళ నిర్వహణకు కర్ణాటక ప్రభుత్వం గత ఏడాది తెచ్చిన ఆర్డినెన్స్ గడువు ముగిసినందున ఈ ఏడాది పోటీలు నిలిపివేయాల్సిందిగా ఆదేశించాలని సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూత్రా వాదించారు.

రాజస్థాన్‌లో ఒక పంటకు రుణమాఫీ

- రూ.8 వేల కోట్ల నిధులు కేటాయింపు
- వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు భూమి పన్ను మినహాయింపు



జైపూర్: రాజస్థాన్ సీఎం వసుంధర రాజే ఆ రాష్ట్ర రైతులకు సోమవారం వరాలు ప్రకటించారు. చిన్న, సన్నకారు రైతులకు ఒక పంటకు రూ.50 వేల వరకు రుణమాఫీ చేస్తామన్నారు. ఈ రుణాలు మాఫీ చేయడంతో ప్రభుత్వ ఖజానాపై రూ.8 వేల కోట్ల భారం పడుతుందని చెప్పారు. దీంతోపాటు రైతుల రుణ సహాయ కమిషన్‌ను శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటుచేస్తామన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల కోసం భూమి పన్ను మినహాయింపు ఇస్తామని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాలతో దాదాపు 40 నుంచి 50 లక్షల మంది రైతులకు మేలు జరుగుతుందన్నారు. 40 ఏండ్ల లోపు రాజస్థాన్‌కు చెందిన మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీలు, పారిశ్రామికవేత్తలకు రుణాలపై వడ్డీ రాయితీ 5% నుంచి 6 శాతం పెంచినట్టు చెప్పారు. ఒక పంటకు మాత్రమే రుణమాఫీని సీఎం ప్రకటించడాన్ని విపక్షాలు తప్పుపట్టాయి. పంట రుణాలు మాఫీ చేయాలని ఆ రాష్ట్ర ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నేత రామేశ్వర్ డిమాండ్ చేశారు.





నేటి నుంచి ఏడుపాయల జాతర

- ఏర్పాట్లకు రూ.1.50 కోట్లు విడుదల
- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి హరీశ్‌రావు, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ ప్రతినిధి/హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మెదక్ జిల్లా ఏడుపాయలలో మహాశివరాత్రి సందర్భంగా మంగళవారం నుంచి జాతర ప్రారంభంకానున్నది. ఈ జాతరకు మన రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీ నుంచి 15 లక్షలకుపైగా భక్తులు హాజరవుతారని అధికారులు అంచనావేస్తున్నారు. జాతరను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్ల కోసం ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ.1.50 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు ప్రణాళికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. మంగళవారం ఉదయం భారీ నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి ప్రభుత్వం తరఫున వనదుర్గామాతకు పట్టువస్త్రాలు సమర్పించి జాతరను ప్రారంభిస్తారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఇక్కడ భక్తులు ఉపవాస దీక్షలు ప్రారంభిస్తారు. రెండోరోజైన బుధవారం బండ్లు తిరిగే కార్యక్రమం నిర్వహిస్తారు. గురువారం రథోత్సవ కార్యక్రమం ఉంటుంది. ఏడుపాయల ఆలయ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వనదుర్గామాత జాతర ఏర్పాట్లు జరుగుతున్నాయి.

మహాశివరాత్రికి మహత్తర ఏర్పాట్లు

కీసరలో సకల సౌకర్యాలు కల్పించిన ప్రభుత్వం

మేడ్చల్ జిల్లా, నమస్తే తెలంగాణ ప్రతినిధి: మహాశివరాత్రిని పురస్కరించుకొని సుప్రసిద్ధ శైవక్షేత్రమైన కీసర శ్రీరామలింగేశ్వరస్వామి గుట్టపై ప్రభుత్వం మహత్తర ఏర్పాట్లు చేసింది. ఆరు లక్షల మంది భక్తులు ఈ బ్రహ్మోత్సవాలకు హాజరవుతారని అంచనా వేసిన అధికారులు అందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. గతంలో తాగునీటి కొరకు ట్యాంకర్లపైనే ఆధారపడగా, ప్రస్తుత బ్రహ్మోత్సవాల్లో మిషన్ భగీరథ పథకం ద్వారా గోదావరి నీటిని అందిస్తున్నారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఎంవీ రెడ్డి మహాశివరాత్రి ఏర్పాట్లలో లోపాలకు ఆస్కారం లేకుండా అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్, మల్కాజిగిరి డీసీపీ ఉమామహేశ్వరావు ఆధ్వర్యంలో వెయ్యి మంది పోలీసులతో భారీ బందోబస్తు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీఐపీలు ఎందరు వచ్చినా సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా క్యూలైన్లను ఏర్పాటు చేశారు. చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులు, స్త్రీలకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. చలువ పందిళ్లు, నడక మార్గంలో కార్పెట్లను పరిచారు. కలెక్టర్ ఆదేశాలతో కీసరగుట్ట జాతరలో మద్యం, మాంసం, బీడీలు, సిగరెట్ల విక్రయాలను పూర్తిగా నిషేధించారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కలెక్టర్ ఎంవీ రెడ్డి, జేసీ ధర్మారెడ్డి, డీపీవో సురేశ్ మోహన్, ఆర్డీవో కౌటిల్య, క్రీడలు, యువజన సర్వీసులశాఖ అధికారి ఉపేందర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. రెండోరోజైన సోమవారం గర్భగుడిలోని శ్రీమూలవిరాట్‌స్వామికి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మంగళవారం సుమారు ఆరు లక్షల మంది వచ్చే అవకాశం ఉన్నదని, వీరందరికి సరిపడేలా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ఎంవీ రెడ్డి తెలిపారు.



పార్కులో వెలిగే బెంచీలు

పార్కులు అంటే ఇప్పటి వరకు పచ్చగా అహ్లాదాన్ని పంచే మొక్కలు, ఇతర క్రీడా పరికరాలతో ప్రజలను ఆకర్షించేవి. దేశంలోనే మొదటి సారిగా హైదరాబాద్ పాతబస్తీలో పార్కును ఎల్‌ఈడీ లైటింగ్‌లతో విభిన్నంగా రూపొందిస్తున్నారు. కిషన్‌బాగ్ పార్కులోని వాకర్స్ బౌండరీలకు, బెంచీలకు ఎల్‌ఈడీ లైట్లు అమరుస్తున్నారు. బెంచీలపై కూర్చోగానే ఆటోమెటిక్‌గ్గా వెలుగులు విరజిమ్ముతాయి. ఇప్పటి వరకు దేశంలోని ఏ పార్కుల్లో ఇలాంటి వ్యవస్థ లేదని దక్షిణ మండల జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. చైనా నుంచి అత్యాధునిక లైటింగ్ వ్యవస్థ కలిగిన బెంచీలను ఇతర వస్తువులను తెప్పించామన్నారు.

– చార్మినార్



నుమాయిష్ ముగింపు కార్యక్రమం సోమవారం ఎగ్జిబిషన్ మైదానంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ జితేందర్‌రెడ్డి హాజరయ్యారు. 2,600 స్టాల్స్ ఎగ్జిబిషన్‌లో కొలువుదీరగా కేటగిరీలవారీగా ఉత్తమ స్టాళ్లను ఎంపికచేసి బహుమతులు అందజేశారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఆధ్వర్యంలో కేసీఆర్ కిట్స్‌కు ప్రచారం కల్పించేందుకు ఏర్పాటు చేసిన స్టాల్‌కు ద్వితీయ బహుమతిని డైరెక్టర్ లలిత కుమారికి అందజేస్తున్న దృశ్యం. - అబిడ్స్, నమస్తే తెలంగాణ

చరిత్రకారుడు, రచయిత వెంకటరామారావు కన్నుమూత

సంతాపం తెలిపిన ప్రముఖులు

నల్లవాగు శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి



తెలుగుయూనివర్సిటీ/ చాంద్రాయణగుట్ట: ప్రముఖ రచయిత, చరిత్రకారుడు, జర్నలిస్టు జీ వెంకటరామారావు (83) ఆదివారం రాత్రి తీవ్ర అస్వస్థతతో హైదరాబాద్ గౌలిపురాలోని స్వగృహంలో కన్నుమూశారు. ఆయనకు ముగ్గురు బిడ్డలు, ఇద్దరు కొడుకులు. వెంకటరామారావు రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మాదారంలో 1935 ఫిబ్రవరి 15న జన్మించారు. 38 ఏండ్లపాటు విద్యాశాఖలో అనేక హోదాల్లో పనిచేశారు. ఆధునిక ఆంధ్రప్రదేశ్ చరిత్రపై సాధికారిక రచనలు చేశారు. పలు దినపత్రికలకు వ్యాసాలు రాసేవారు. పరిష్కారం పేరుతో కథానికల సంపుటి, ఆంధ్రప్రదేశ్ చరిత్ర నాలుగు భాగాలు, భారతదేశ చరిత్ర–ప్రధాన సంఘటనలు, తెలంగాణ విద్యా సాంస్కృతిక రంగాల చరిత్ర, ప్రధానిగా పీవీ, స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర, తెలంగాణ చరిత్ర వంటి గ్రంథాలతోపాటు పులిజాల రంగారావు, నూకల రామచంద్రారెడ్డి, జేవీ నరసింగరావు, కోదాటి నారాయణరావు తదితర తెలంగాణ ప్రముఖుల జీవిత చరిత్రలను రచించారు. ఆయన సేవలకు తెలుగు విశ్వవిద్యాలయం సహా పలు సంస్థలు పురస్కారాలు అందించాయి. వెంకటరామారావు అలుపెరుగని రచయిత అని తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి కొనియాడారు. ఆయన నిరాడంబర జీవితం నేటి తరం సాహితీవేత్తలకు ఆదర్శమన్నారు. ఆయన రచించిన తెలంగాణ చరిత్రను పరిషత్ ముద్రించిందని, బీఎన్ శాస్త్రి పురస్కారంతో సముచితరీతిలో సత్కరించిందని పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జే చెన్నయ్య తెలిపారు. వెంకటరామారావు అంత్యక్రియలను సోమవారం సాయంత్రం నల్లవాగు శ్మశానవాటికలో పూర్తి చేశారు.

రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ పార్కు

దేశంలోనే మొదటిసారిగా హైదరాబాద్‌లో ఏర్పాటు

- ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ఇంకుడుగుంతలు తవ్వించాలి
- ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృతంగా చైతన్య కార్యక్రమాలు
- టీసాట్ ద్వారా పిల్లలకు అవగాహన కల్పించాలి ■ జలం-జీవంపై సమీక్షలో మంత్రి కేటీఆర్



జలమండలి కార్యాలయంలో జలం-జీవంపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి కే తారకరామారావు. చిత్రంలో జలమండలి ఎండీ దానకిశోర్, హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులు, జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, డీఎంఏ టీకే శ్రీదేవి ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

దేశంలో ఎక్కడా లేనివిధంగా అత్యుత్తమ విధానాలతో హైదరాబాద్‌లో వర్షపు నీటి సంరక్షణ (రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్) పార్కును ఏర్పాటు చేస్తామని పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు తెలిపారు. వాననీటిని ఒడిసి పట్టడంలో ఇంకుడుగుంతల ప్రాధాన్యాన్ని ఈ పార్కు ద్వారా వివరిస్తామన్నారు. నగరంలో కరువు పరిస్థితులు ఏర్పడినా ప్రజలకు నీళ్ల కరువు రావొద్దనే లక్ష్యంతోనే జలం-జీవం కార్యక్రమం ప్రారంభించామని చెప్పారు. సోమవారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో జలమండలి, టీఎస్‌ఐఐసీ, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, సీడీఎంఏ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ పార్కులో రోజువారీ నీటి అవసరాలకు నల్లా కనెక్షన్ అవసరం లేకుండా పూర్తిగా వాన నీటినే వినియోగించాల్సి ఉంటుందన్నారు. ఇలాంటి పార్కును మొదటిసారిగా హైదరాబాద్‌లోనే ఏర్పాటు చేయాలని జలమండలి అధికారులను ఆదేశించారు. ప్రజలు, విద్యార్థులు దాని నుంచి ప్రేరణ పొందేలా అనువైన చోట పార్కు రూపు దిద్దుకోవాలని సూచించారు.

కరువొచ్చినా తట్టుకునేలా..

మహారాష్ట్రలోని లాతూరు ప్రాంతం నీటి కష్టాలకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచిందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక రైళ్లలో లాతూరుకు మంచినీటిని తరలించిందని గుర్తు చేశారు. ఈ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితి ఎదురుకాకుండా ఉండేందుకు జలం- జీవం కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఇందులో భాగంగా విస్తృతంగా ఇంకుడు గుంతల నిర్మాణానికి పూనుకున్నామన్నారు. నగరంలో కరువు పరిస్థితులు వచ్చినా ప్రజలకు నీళ్ల కష్టాలు ఎదురుకావొద్దనే లక్ష్యాన్ని విధించుకొని జలం-జీవం చేపట్టామన్నారు. నగరంలో భూగర్భజలాలు, తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా చూడటమే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. అందుకే కృష్ణా, గోదావరి నుంచి మంచినీటిని తీసుకొచ్చి నగర ప్రజల దాహార్తిని తీరుస్తున్నామన్నారు. భూగర్భజలాలు పెరుగాలంటే నగర ప్రజలు ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రజల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని బ్యాంకుల ప్రాంగణాల్లో ఇంకుడుగుంతల నిర్మాణం తప్పనిసరి చేయాలని, ఈ మేరకు అన్ని శాఖలకు ఆదేశాలు జారీ చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం, విద్యాసంస్థలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంకుడు గుంతల నిర్మాణ ప్రక్రియ నిరంతరం కొనసాగాలన్నారు. టీసాట్, నిపుణ చానళ్ల ద్వారా ఇంకుడు గుంతల నిర్మాణంపై అవగాహన కార్యక్రమాలు ప్రసారం చేయాలని ఆదేశించారు. ఇంకుడుగుంతల నిర్వహణపైనా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జలం-జీవంలో ప్రముఖులను, సెలబ్రెటీలను భాగస్వాములు చేయాలని, వారితో పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం జలమండలి రూపొందించిన జలం-జీవం కార్యక్రమ పోస్టర్లను మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు.

ఇంకుడు గుంతలకు జియోట్యాగింగ్

ప్రభుత్వం వెయ్యి ఇంకుడుగుంతలను లక్ష్యంగా నిర్దేశించగా అన్నిశాఖల సమన్వయంతో ఇప్పటికే 821 పూర్తి చేసినట్టు జలమండలి ఎండీ దానకిశోర్ మంత్రికి వివరించారు. వాటికి జియోట్యాగింగ్ చేశామన్నారు. ఇంకుడు గుంతలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణానికి జలమండలి వినియోగదారులకు బ్యాంకు ద్వారా రుణాలను ఇప్పిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ కమిషనర్లు జనార్దన్‌రెడ్డి, చిరంజీవులు, మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, డీఎంఏ టీకే శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆమె.. పింకీ కశ్యప్!

- వీడుతున్న గర్భిణి హత్యకేసు
- భర్తతో కలిసి సిద్ధిఖీనగర్‌లో నివాసం
- సన్నిహితులే హంతకులు
- ముగ్గురి అరెస్ట్.. పరారీలో భర్త
- నేడు మీడియా ముందుకు నిందితులు

హైదరాబాద్ సిటీబ్యూరో/శేరిలింగంపల్లి, నమస్తే తెలంగాణ: గర్భిణిని ముక్కలుగా నరికి సంచుల్లో కుక్కి హైదరాబాద్ కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్ వద్ద పడేసిన కేసు మిస్టరీ వీడుతున్నది. సైబరాబాద్ పోలీసులు 13 రోజుల ముమ్మర దర్యాప్తు తర్వాత నిందితులను గుర్తించారు. మృతురాలి పేరు పింకీ కశ్యప్ అని, ఆమెను భర్తతో కలిసి సన్నిహితులే చంపేశారని పోలీసులు ప్రాథమికంగా తేల్చినట్టు సమాచారం. బీహార్‌కు చెందిన పికీ కశ్యప్ ఉత్తరప్రదేశ్‌కు చెందిన వికాస్‌ను కొన్నేండ్ల కిందట పెండ్లి చేసుకున్నది. వీరు ప్రస్తుతం సిద్ధిఖీనగర్‌లో బీహార్‌కు చెందిన అమర్‌కాంత్ ఝా, తండ్రి అనిల్ ఝా, తల్లి మమత ఝా కుటుంబంతో ఉంటున్నారు. వారి ఇంట్లో ఏడేండ్ల బాలుడు కూడా ఉన్నాడు. పింకీ కశ్యప్‌ను అమర్‌కాంత్ ఝా హత్య చేశాడని, ఇంట్లోనే తల్లిదండ్రులు, ఆమె భర్త వికాస్, బాలుడి ముందే క్రూరంగా చంపేశాడని తేలింది. మృతదేహాన్ని ముక్కలుగా నరికిన తర్వాత సంచుల్లో కుక్కి అమర్‌కాంత్, అతడి తల్లి మమతతో కలిసి బైక్‌పై తీసుకెళ్లి బొటానికల్ గార్డెన్ సమీపంలో పడేసినట్టు తేలింది. పింకీని ఎందుకు హత్య చేశారో తేలాల్సి ఉన్నది. అమర్‌కాంత్ ఓ బార్‌లో అటెండర్‌గా పనిచేస్తుండగా, పింకీ భర్త వికాస్, మమత కలిసి కొన్నాళ్లు గా పానీపూరీ బండి నడుపుతున్నారు. ప్రధాన అనుమానితులు అమర్‌కాంత్, వికాస్ పరారీలో ఉన్నారని, అమర్‌కాంత్ తల్లిదండ్రులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య తెలిపారు. పోలీసులు అమర్‌కాంత్ ఝాను మధ్యప్రదేశ్‌లో అరెస్ట్ చేసినట్టు తెలిసింది. నిందితులను మంగళవారం మీడియా ముందు ప్రవేశపెడుతామని అధికారులు తెలిపారు.

హోటల్ సిబ్బంది సమాచారంతో..

ఈ కేసును సవాలుగా తీసుకొని సీపీ సందీప్ శాండిల్యతోపాటు ఉన్నతాధికారులు, సిబ్బంది ముమ్మరంగా దర్యాప్తు జరిపారు. వీరికి సీసీటీవీ ఫుటేజీ కీలకంగా మారింది. మృతదేహం దొరికిన జనవరి 30న, అంతకు ముందురోజు సీసీ కెమెరాలను పరిశీలించినా క్లూ లభించలేదు. మృతురాలి ఒంటిపై ఉన్న దుస్తులను కొండాపూర్ ప్లాటినమ్ మాల్ ఎదురుగా ఉన్న ఉడిపి హోటల్ సిబ్బంది గుర్తుపట్టి ఆమె జనవరి 28న తమ హోటల్‌కు వచ్చిందని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో జనవరి 28 రాత్రి 10 నుంచి 29 తెలవారుజాము 4 గంటలవరకు సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. 28 అర్ధరాత్రి, 29 తెలవారుజాము 3 గంటల తర్వాత ఓ బైక్ బొటానికల్ గార్డెన్ వద్ద ఎనిమిది సెకండ్లు ఆగింది. తర్వాత శ్రీరాం నగర్ కాలనీ వైపు వెళ్లిందని గుర్తించారు. అక్కడ డెడ్ ఎండ్ ఉండటంతో ఐదు నిమిషాల తర్వాత వెనక్కివచ్చారు. ఆ సమయంలో దగ్గర్లోని హెరిటేజ్ షాపు వద్ద సీసీ కెమెరాల్లో నీలం రంగు అంగీ ధరించిన బట్టతల వ్యక్తి బైక్ నడిపిస్తుండగా వెనుక ఉన్న మహిళ నల్లని బ్యాగ్ పట్టుకున్నట్టు రికార్డయ్యింది. మజీద్ బండ, బొటానికల్ గార్డెన్ వద్ద ఉన్న కెమెరాల ఫుటేజీలు పరిశీలించగా ఇద్దరి మధ్య రెండు మూటలు ఉన్నట్టు గుర్తించి వారే హత్య చేసినట్టు నిర్ధారించుకున్నారు. దీంతో మరిన్ని సీసీ కెమెరాలను పరిశీలించగా వీరు బొటానికల్ గార్డెన్ చుట్టూ చక్కర్లు కొట్టినట్టు తెలిసింది. 29న టెక్ మహేంద్ర సంస్థ రహదారి నుంచి అంజయ్యనగర్, సిద్ధిఖీనగర్ కాలనీలోకి వెళ్లినట్టు నిర్ధారణైంది. బైక్ నంబర్ ఆధారంగా వాహన యజమానిని ప్రశ్నించగా అది అప్పటికే ఐదారుగురి చేతులు మారినట్టు తేలింది.



అమర్‌కాంత్ ఝా

మడ్‌గార్డ్ పట్టించింది

సీసీ ఫుటేజీ ఆధారంగా బైక్ నీలంరంగులో ఉన్నదని, మడ్‌గార్డ్ లేదని పోలీసులు గుర్తించారు. సైబరాబాద్ సీపీ సందీప్ శాండిల్య దాదాపు 600 మంది సిబ్బందితో ఆదివారం తెలవారుజామున 3 నుంచి ఉదయం 10 గంటల వరకు అంజయ్యనగర్, సిద్ధిఖీనగర్‌లో బైక్ గురించి ఆరా తీశారు. కిరాణా దుకాణదారులు ఆ బైక్ ఎక్కువగా ఒక గల్లీ నుంచి వస్తుందని చెప్పారు. దీంతో పోలీసులు అమర్‌కాంత్ ఝా ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న అతడి తల్లిదండ్రులు అనిల్ ఝా, మమత ఝా, ఏడేండ్ల బాలుడిని విచారించారు. పింకీని అమర్‌కాంత్ హత్య చేశాడని తేలింది. బార్‌లో పనిచేసే తన స్నేహితుడు బర్ధన్‌కు పని ఉన్నదని చెప్పి అతడి బైక్‌ను తీసుకొచ్చి మృతదేహం కుక్కిన సంచులను తల్లితో కలిసి తీసుకెళ్లాడని స్పష్టమైంది. మృతదేహాన్ని గుర్తుపట్టకుండా ఉండేందుకు ముఖాన్ని ఛిద్రం చేశారని తేలింది. ఈ మేరకు అనిల్ ఝా, మమత ఝాను అదుపులోకి తీసుకున్నారు. వికాస్, అమర్‌కాంత్ ఈ నెల 3వ తేదీ నుంచి పరారీలో ఉన్నారని తెలుసుకున్నారు. అయితే హత్యకు గల కారణాలు ఇప్పటికీ తేలలేదు. వివాహేతర సంబంధమే హత్యకు దారి తీసి ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. సోమవారం పింకీ తల్లిదండ్రులు గాంధీ దవాఖానలోని మార్చురీలో ఉన్న కూతురు మృతదేహాన్ని గుర్తించి బోరున విలపించారు.



పేలుడుతో ధ్వంసమైన గది, పేలని డిటోనేటర్లను స్వాధీనం చేసుకుంటున్న బాంబుస్క్వాడ్

జూబ్లీహిల్స్‌లో పేలిన డిటోనేటర్లు

- మహిళకు గాయాలు ■ పేలుడు ధాటికి కుప్పకూలిన గది
- దర్యాప్తు చేపట్టిన ఉన్నతాధికారులు ■ 98 డిటోనేటర్లు స్వాధీనం

బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో నిర్మాణంలో ఉన్న ఇంటి స్థలంలో సోమవారం ఉదయం పేలుడు సంభవించింది. బండరాళ్లను తొలిగించేందుకు ఉపయోగించే డిటోనేటర్లను అక్రమంగా గదిలో నిల్వఉంచగా పేలినట్టు గుర్తించారు. పేలుడు ధాటికి గదిగోడలు కూలిపోగా ఓ మహిళకు గాయాలయ్యాయి. సమీపంలోని ఇండ్లపై రాళ్లు పడటంతో రెండు కార్ల అద్దాలు ధ్వంసమయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్–48లో సిద్ధార్థ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు స్థలం ఉన్నది. ఇక్కడ బండరాళ్లను తొలిగించేందుకు ఆశిష్ అనే వ్యక్తికి కాంట్రాక్టు ఇచ్చారు. అతడు స్థానికంగా బండరాళ్లు కొట్టే మహేశ్, నవీన్‌కు సబ్ కాంట్రాక్టు ఇచ్చాడు. వారు ఎలక్ట్రానిక్ డిటోనేటర్లను నెల కిందట తీసుకొచ్చి సైట్‌లో ఉన్న ఓ గదిలో భద్రపర్చారు. వాటిల్లో కొన్ని సోమవారం ఉదయం పేలాయి. ఈ ధాటికి గది కుప్పకూలడంతోపాటు రాళ్లు తగిలి వాచ్‌మన్ భార్య భగవతి(36)కి స్వల్ప గాయాలయ్యాయి. ఆమెను జూబ్లీహిల్స్‌లోని అపోలో దవాఖానకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీస్ ఉన్నతాధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వెస్ట్‌జోన్ డీసీపీ వెంకటేశ్వరరావు, బంజారాహిల్స్ ఏసీపీ కేఎస్ రావు, జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌తోపాటు బాంబు స్క్వాడ్, క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. గదిలో అక్రమంగా నిల్వ ఉంచిన డిటోనేటర్లలో దాదాపు 25 పేలినట్టు నిర్ధారించారు. మిగిలిపోయిన 98 డిటోనేటర్లను స్వాధీనం చేసుకున్నారు. పేలుడు పదార్థాలను అక్రమంగా నిల్వ ఉంచిన కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేస్తామని డీసీపీ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. బ్లాస్టింగ్‌కు ఎలాంటి అనుమతులు తీసుకోలేదన్నారు. జీహెచ్‌ఎంసీ నుంచి కూడా ఎలాంటి అనుమతులు తీసుకోలేదని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వెంకన్న జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జీహెచ్‌ఎంసీ సెంట్రల్‌జోన్ కమిషనర్ రఘుప్రసాద్, సర్కిల్ 18 డీఎంసీ సత్యనారాయణ తదితరులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



మహాశివరాత్రిని పురస్కరించుకొని మార్కెట్లకు పండుగ కళ వచ్చింది. హైదరాబాద్‌లో ఎటుచూసినా పూలు, పండ్లతో మార్కెట్లు నిండిపోయాయి. నగరంలో ప్రధానమైన కొత్తపేట మార్కెట్ పండ్లతో నిండిపోయిన దృశ్యం

ఔటర్ మొత్తం ఎల్ ఈడీ వెలుగులు

- టెండర్లు ఆహ్వానించిన హెచ్‌ఎండీఏ
- రూ.107.5 కోట్లతో 136 కి.మీల మేర పనులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఔటర్ రింగ్ రోడ్డును వెలుగుల వలయంగా మార్చేందుకు హెచ్‌ఎండీఏ చర్యలు వేగవంతం చేసింది. 136 కిలోమీటర్ల మేర ఎల్‌ఈడీ లైట్లను ఏర్పాటు చేసేందుకు టెండర్లను ఆహ్వానించింది. ఇప్పటికే ప్రయోగాత్మకంగా రూ.30 కోట్ల జైకా నిధులతో గచ్చిబౌలి–శంషాబాద్ మార్గంలో 22 కి.మీ. మేర మెయిన్ క్యారేజ్ వేలోని సెంట్రల్ మీడియన్‌లో ఎల్‌ఈడీ లైట్లను ఏర్పాటుచేశారు. నగరం నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లే ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ మార్గాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపికచేశారు. ఈ మార్గంలో వెళ్లేవారు ఎల్‌ఈడీ వెలుగుల మధ్య ప్రయాణాన్ని అస్వాదిస్తుండటంతో పాటు అన్నివర్గాల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ఇదే సమయంలో సంస్థకు కరెంట్ బిల్లు తగ్గింది. దీంతో మిగతా 136 కి.మీ. మేర ఎల్‌ఈడీ వెలుగులు నింపాలని పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు ఇటీవల హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులును ఆదేశించారు. ఈ నేపథ్యంలో కోకాపేట నుంచి శంషాబాద్ వరకు 136 కి.మీ. మేర పనులకు రూ.107.5 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లను ఆహ్వానించారు. ఈ నెల 28వ తేదీని టెండరు గడువుగా ఖరారు చేయగా, ఆదే రోజు మధ్యాహ్నం 2:30 గంటలకు టెక్నికల్ బిడ్లు తెరువనున్నారు. మెయిన్ క్యారేజ్ వే, ఇంటర్ చేంజ్‌లు, జంక్షన్లు, సర్వీస్ రోడ్ల వెంబడి ఎల్‌ఈడీ లైట్ల బిగింపుతోపాటు ఐదేండ్లపాటు నిర్వహణ బాధ్యతను సంబంధిత ఏజెన్సీ చేపట్టనున్నది.

నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
మంగళవారం 13 ఫిబ్రవరి 2018
WWW. NTNEWS.COM



గుప్పిట్లో గుట్టల్ని బంధించి.. చుట్టూతా చెట్టూ చేమల్ని చేరదీసి..
ఆకాశానికి ఆనుకున్నట్లు.. బండలపై పరుపేసినట్లు కనిపిస్తున్నదో కొండ!
ఏమా రాచఠీవి..? ఏమా తేజస్సు..? ఇది.. రాళ్లు పొదిగిన రాతికొండనో..
నిర్మానుష్యంగా ఉన్న నిషేధిత కొండనో మాత్రం కాదు!
చరిత్రకు చెక్కుచెదరని సాక్ష్యం. పాలనా వైభవానికి పట్టంగట్టే ఆధారం!
నాటి రతనాల కొండ.. తెలంగాణ సాంస్కృతిక వైభవపు అండ రాచకొండ!
మహాశివ రాత్రిని పురస్కరించుకొని ఫిబ్రవరి 12 నుంచి
రాచకొండ పర్యాటక ఉత్సవాలు జరుగుతున్నాయి.
పర్యాటక కేంద్రంగా విలసిల్లుతున్న
రాచకొండ రాజసంపై ప్రత్యేక కథనం!

పర్యాటక ఉత్సవాలకు.. రాచకొండ పిలుస్తోంది!

కోటలకు పుట్టినిల్లు లాంటిది రాచకొండ. అత్యంత ఎత్తయిన ప్రతాప రుద్రకోట.. రామగిరి ఖిల్లా తర్వాత ఎత్తయిన కోట రాచకొండలోనే ఉందని చరిత్రకారులు చెప్తున్నారు. మొదటి సింగ భూపాలుడు ఈ కోటకు అంకురార్పణ చేయగా అనపోతన రాజు విస్తరింపజేశారని చెప్తుంటారు. దీని పొడవు పది గుట్టల మధ్యన సుమారు 40 కిలోమీటర్లు ఉంటుంది. శత్రు దుర్భేద్యంగా నిర్మితమైన రాచకొండలో ఎన్నో చారిత్రక కట్టడాలు.. ఆలయాలు.. కోట గోడలు.. బావులు.. విశ్రాంతి గదులు.. నాట్య మందిరాలు నిర్మించారు రాజులు. ఎన్నో వేల ఏళ్లనాడు పునాది వేసుకున్న నాటి వైభవ కట్టడాలు.. వాటి చుట్టూ వెలసిన ప్రకృతి నేడు పర్యాటకంగా ఆకర్షిస్తున్నది. స్వరాష్ట్రంలో సంబురంగా పర్యాటక ఉత్సవాలు జరుపుకొంటున్నది!

1

ఎక్కడ ఉన్నది?:

యాదాద్రి భువనగిరి జిల్లా.. రంగారెడ్డి జిల్లాల సరిహద్దుల్లో హైదరాబాద్ నగరానికి 50 కిలోమీటర్ల దూరంలో రాచకొండ గ్రామంలో ఉన్నది.



2

ఎలా వెళ్లాలి?:

నాగార్జునా సాగర్ జాతీయరహదారి నుంచి వెళ్లాలనుకుంటే ఇబ్రహీం పట్నం.. మంచాల మీదుగా వెళ్తే తిప్పాయిగూడెం వస్తుంది. తిప్పాయి గూడెంకు ఆనుకునే రాచకొండ గ్రామం.. రాచకొండ కోట దర్శనమిస్తాయి. విజయవాడ జాతీయరహదారి నుంచి వెళ్లాలనుకుంటే చౌటుప్పల్.. సంస్థాన్ నారాయణపూర్ నుంచి వెళితే రాచకొండ వస్తుంది.

3


ఉత్సవాలు ఏంటి?:

ఒకప్పుడు తెలంగాణకు రాజధాని రాచకొండ. ఎన్నో చారిత్రక ఘట్టాలకు.. వీరోచిత విజయాలకు కేంద్రం. అద్భుత కట్టడాలకు.. ఆధ్యాత్మిక కేంద్రాలకు నెలవు. అందమైన ప్రకృతికి స్థావరం. అలాంటి రాచకొండ వైభవాన్ని రాష్ట్రవ్యాప్తంగా.. దేశ్యాప్తంగా చాటిచెప్పేందుకు మొట్టమొదటిసారిగా తెలంగాణ ప్రభుత్వం తరపున పర్యాటక శాఖ నిర్వహిస్తున్న పర్యాటక ఉత్సవాలు.

4

ఎన్ని రోజులు జరుగుతాయి?:

పర్యాటకంగా రాచకొండను తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. అందులో భాగంగానే ఫిబ్రవరి 12, 13, 14 తేదీలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనికి రాచకొండ చారిత్రక.. పర్యావరణ.. పర్యాటక పరిరక్షణ సమితి సహకారం అందిస్తున్నాయి. మూడ్రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి వేలాది మంది తరలిరానున్నారు.



నేపథ్యం: క్రీస్తుశకం 1400 సంవత్సరాల క్రితం రాచకొండ పట్టణం వెలసిందని చరిత్రకారులు చెప్తున్నారు. తదనాంతరం సింగమ వంశస్థులు.. అనుపోతనాయుడు.. రావు మాదవ తదితర వంశస్థులు రాజులుగా పరిపాలన సాగించారు. రేచర్ల గోత్రం కలిగిన పద్మనాయకులు ఇక్కడి రాజులే. వీరి పాలనలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడలేదట. రాచకొండ.. దేవరకొండ.. ఓరుగల్లు.. అమనగల్లు పట్టణాలు రాచకొండ పరిధిలో ఉండేవి. తెలంగాణకు రాజధానిగా రాచకొండ విరాజిల్లింది. అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో రాచకొండ పట్టణం చిన్నాభిన్నమైంది.

చారిత్రక కట్టడాలు: వేల సంవత్సరాల క్రితం రాజులు నిర్మించిన కట్టడాలు రాచకొండలో చాలా ఉన్నాయి. అవి ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. గత పాలకులు రాచకొండను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. పైగా ధ్వంసం చేయడానికీ వెనకాడలేదు. కానీ తెలంగాణ సర్కారు రాచకొండకు పూర్వ వైభవం తీసుకొచ్చే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నది. మొదటగా దీనిని పర్యాటక ప్రాంతంగా గుర్తించేందుకు నిర్ణయం తీసుకున్నది. రాచకొండలో శివాలయం, రామాలయం, బైరన్నగుడి, వీరన్నగుడి, బోగందాని మంచెం, కుమ్మరి మట్టం, చాకలి మఠం సోరంగ మర్గాలు, శత్రుసైన్యాల నుంచి కాపాడుకోవడానికి రాతితో ప్రహరీ గోడ, గాడ్‌పీర్ల దర్గా, రాజుల కాలం నాటి స్నానాల గది తదితర కట్టాడాలు ఇప్పటికి ఉన్నాయి. వీటిని చూడటానికి నిత్యం పర్యాటకులు వస్తుంటారు.



సిరుల ఖిల్లా: రాచకొండ పాలకులు ప్రజలను ఎలాంటి ఇబ్బందులకూ గురిచేయలేదు. శిస్తులు.. పన్నులకు వారిని వేధించలేదు. దీనికంతటికీ కారణమూ ఉన్నది. ఇక్కడ సిరిసంపదలకు ఎలాంటి కొదువ లేకుండెనట. శతృదుర్భేద్యమైన కోటలను నిర్మించడమే కాదు.. శతృవులను తుదముట్టించడంలో రాచకొండ రాజులది పైచేయిగా కొనసాగింది. అలా ఎన్నో రాజ్యాలను కూల్చి రాచకొండలో కలుపుకొన్నారు. అలా గెలిచి శతృరాజ్యాల ధాన్య భాండాగారాలను స్వాధీనం చేసుకునేవాళ్లు. దానితో లభ్యమైన ధనంతో చెరవులు.. కుంటలు.. బావులు తోడేవారట. వీటిని వ్యవసాయ అవసరాలకు చక్కగా వినియోగించేవారట. అనపోత సముద్రం.. రాయసముద్రం.. సంకెల్లబావి.. కొలువుకూటం అన్నీ వాళ్లు నిర్మించినవే. రాచకొండ సమీప గ్రామాల్లో ఇప్పటికీ కొన్ని బావులు వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడుతున్నాయట. ఇలా సాగునీరు ఏర్పాట్ల ద్వారా పుష్కలంగా పంటలు పండి ప్రజలు సిరిసంపదలతో తులతూగేవారట. చారిత్రక కట్టడాలే కాదు.. సాహితీ పరిమళాలు కూడా ఇక్కడ వెదజల్లేవనీ.. సాహితీ ఉత్సవాలు ఇక్కడ జరిగేవని చరిత్రకారులు చెప్తున్నారు.

పిక్‌నిక్ స్పాట్: చారిత్రక.. ఆధ్యాత్మిక.. పర్యాటక ప్రాంతంగా వెలుగొందుతున్న రాచకొండ గురించి నేటి తరానికి తెలవాల్సిన ఆవశ్యకత ఉన్నది. రాతిగుట్టలుగానో.. కొండ కోనలుగానో మిగిలివుండి గుప్పిట్లో గుళ్లూ గోపురాలను.. చరిత్ర మూటను పదిలంగా భద్రపరిచిన రాచకొండ ఎప్పటికీ వైభవోపేతంగానే కనిపించాలి. అలా ఉండాలి.. మన చరిత్ర నిలవాలి అంటే ఇలాంటి ఉత్సవాలు ఇంకా ఎన్నో జరగాలి. అందులో ప్రజల భాగస్వామ్యం ప్రత్యక్షంగా కనిపించాలి. కాబట్టి ప్రాథమికంగా దీన్ని నేటి తరానికి తెలియజేసేందుకు పిక్‌నిక్ స్పాట్‌గా ఎంచుకోండి. తర్వాత్తర్వాత దాని గొప్పదనమేంటో తెలియజేయండి. రాజసానికి.. నిదర్శనమైన రాచకొండను ఎల్లకాలం వెలిగేలా చేయండి.



సందర్భమేంటి?:


గతేడాది కూడా ఇలాంటి ప్రయత్నం చేసి ఉత్సవాలు నిర్వహించారు. పర్యాటకులు.. చరిత్రకారులు.. ఆధ్యాత్మికవేత్తల నుంచి మంచి ఆదరణ లభించింది. అయితే వేసవి కావడంతో పర్యాటకులు కొంత అసౌకర్యంగా మారింది. దీనిని దృష్టిలో ఉంచుకుని వేసవికి ముందే ఉత్సవాలు నిర్వహించాలనుకున్నారు. రాచకొండ మార్గంలో స్వయంభుగా వెలసిన శివలింగం.. రాచకొండ కోటలోని శివాలయం భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ సందర్భంగా పర్యాటక ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.



ఆధ్యాత్మిక కేంద్రం: రాచకొండ ఆధ్యాత్మిక కేంద్రంగా ఇప్పటికీ విరాజిల్లుతున్నది. కోటలో ఉండే శివాలయం దూపదీప నైవేద్యాలు అందుకొని భక్తుల పూజలందుకుంటున్నది. రాచకొండకు వెళ్లే మార్గంలోనే 'శివలింగం' వెలసింది. రాచకొండ అటవీ ప్రాంతంలో వెలసిన మరొక ఆలయం సరళ మైసమ్మ. పక్కనే గాడ్ పీర్ల దర్గా ఉన్నది. వైష్ణవాలయం.. రామాలయం.. నరసింహస్వామి ఆలయం ఇలా చాలా ఉన్నాయి. ఇంతటి వైభవాన్ని.. సంపదను పరిరక్షించడానికి స్వచ్ఛందంగా రాచకొండ పరిరక్షణ సమితి.. రాచప్ప కమిటీ.. పర్యావరణ సంఘాలు బాధ్యతగా పనిచేస్తున్నాయి. ఇప్పుడు ప్రభుత్వం.. పర్యాటకశాఖ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తూ వైభవంగా పర్యాటక ఉత్సవాలు నిర్వహిస్తున్నాయి.

దాయి శ్రీశైలం

దివ్యత్వాన్నిచ్చే రాత్రి..!



శివపురాణంలోని విజ్ఞాన శాస్త్ర ప్రాథమిక సూత్రాలను, అందులో వివరించిన శక్తివంతమైన సాధనాలతో మన జీవితంలోని పరిమితులు, సమస్యలను ఎలా అధిగమించాలో సద్గురు వివరిస్తున్నారు.

'శివ' అని సూచించబడుతున్న అనంతమైన ఈ శూన్యం పరిమితిలేని నిరాకార స్వరూపం. దానికి మొదలూ, చివరా లేవు. అది శాశ్వతమైనది. అయితే మనిషి అవగాహన, రూపానికి పరిమితమైపోయింది. కాబట్టి మన సంస్కృతి, సంప్రదాయాల్లో ఈ 'శివ' తత్వానికి ఎన్నో అద్భుతమైన స్వరూపాలను సృష్టించుకున్నాం. నిగూఢమూ, అగోచరమూ అయిన ఈశ్వరునిగా, మంగళకరుడైన 'శంభు'నిగా, అమాయకత్వంతో మనల్ని నిర్వీర్యులను చేసే 'భోళా శంకరుని'గా, సకల వేదాలూ, శాస్త్రాలూ, తంత్రాలూ బోధించిన గొప్ప గురువు దక్షిణామూర్తిగా, ఎవరినైనా ఇట్టే క్షమించేసే 'ఆశుతోషు'నిగా, ఆ సృష్టికర్త రక్తాన్నే శరీరానికి అలముకున్న కాలభైరవునిగా, ప్రశాంతతకు ప్రతిరూపమైన 'అచలేశ్వరు'నిగా, బ్రహ్మాండ నృత్యకారుడైన 'నటరాజు'గా ఆపాదింపబడ్డాయి.

మంచీ చెడూ.. అన్నీ శివుడే!


సాధారణంగా 'దైవత్వం'గా భావించే వాటిని 'మంచి'గా సూచిస్తారు. కానీ శివపురాణం చదివితే శివుణ్ణి మంచివాడనీ అనలేరు, చెడ్డవాడనీ అనలేరు. సర్వస్వమూ ఆయనే. ఆయనే కురూపీ, ఆయనే సుందరమూర్తీను. దుష్టుడూ ఆయనే, ఉత్తమోత్తముడూ ఆయనే. దేవతలూ, రాక్షసులూ మొదలైన సకల జీవరాశులూ ఆయన్ని కొలుస్తాయి. నాగరికతగా పిలువబడే సంస్కారం శివుణ్ణి గురించి మనం జీర్ణించుకోలేని కథలన్నింటినీ తుడిచిపారేసింది. కానీ శివ తత్త్వమంతా అక్కడే ఉంది! జీవితంలో ఒకదానికొకటి విరుద్ధమైన పార్శ్వాలన్నీ శివుని వ్యక్తిత్వంలో నెలకొల్పబడ్డాయి. ఈ సమస్త సృష్టిలోని జటిలమైన లక్షణాల సమాహారాన్ని 'శివ' అనబడే ఈ వ్యక్తిలో ఎందుకు సమ్మేళితం చేశారంటే.. ఈ ఒక్కరిని మీరు పూర్తిగా అంగీకరించగలిగితే మీరిక జీవితాన్ని దాటేసినట్టే! అసలు జీవితంలో ఎప్పుడూ ఎదురయ్యే పెద్ద సమస్య – ఏది మంచి, ఏది చెడు, ఏది సుందరం, ఏది కాదు అనేది నిర్ణయించాల్సి రావడం. జీవితంలోని సంక్లిష్ట లక్షణాల సమాహారమైన ఈ ఒక్క వ్యక్తిని మనస్ఫూర్తిగా అంగీకరించగలిగితే ఇక మరెవరితోనూ ఏ సమస్యా ఉండదు.

> **మహా శివరాత్రి అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకున్న అతి పెద్ద రాత్రి. యోగ సంప్రదాయల నుంచి పుట్టిన ఆదిగురువైన శివుని కరుణా కటాక్షాలందించే వేడుకైన రాత్రి. మహా శివరాత్రి నాడు గ్రహాల స్థితిగతులు మానవ శరీర వ్యవస్థకు సహజమైన శక్తిని ఇవ్వగలిగేలా ఉంటాయి. అందుకే శివరాత్రి నాడు రాత్రంతా నిటారుగా కూర్చుని, మేలుకుని ఉండడం అవసరం. తద్వారా శారీరక, ఆధ్యాత్మిక ఆరోగ్యం చేకూరుతుంది.**

పురాణం కాదు... శాస్త్ర విజ్ఞానం!

శివపురాణంలోని కథల్ని జాగ్రత్తగా పరిశీలించి చూస్తే అందులో ఆధునిక భౌతిక శాస్త్రమంతా కథల రూపంలో ఎంతో అందంగా చెప్పారని గ్రహిస్తారు. విజ్ఞాన శాస్త్రాన్ని కథనాల ద్వారా చెప్పారు. ప్రతీదానికి ఓ వ్యక్తిత్వం ఇవ్వబడింది. కాలక్రమంలో ఎక్కడో ఆ కథల్లోంచి శాస్త్రం విస్మరించబడి కథలు మాత్రమే కొనసాగించబడ్డాయి. ఆ కథలు కూడా ఒక తరం నుండి మరో తరానికి మారేసరికి అతిశయోక్తులతో చిలవలు పలవలుగా అల్లబడ్డాయి. ఆ కథల్లోకి విజ్ఞానాన్ని చొప్పించగలిగితే శాస్త్రాన్ని మళ్లీ ఎంతో అందంగా చెప్పవచ్చు. మానవ ప్రకృతిలోని చేతనని ఉత్కృష్ట శిఖరాలకు తీసుకెళ్లగల మహోన్నతమైన విజ్ఞాన ఖనియైన ఈ శివపురాణం అందమైన కథలుగా చెప్పబడింది. కొద్దిగా తరచి చూస్తే శివపురాణమూ, యోగశాస్త్రమూ అవిభాజ్యంగా కనిపిస్తాయి. ఒకటి కథలంటే మక్కువ ఉన్నవారికీ, రెండవది ప్రతి విషయాన్నీ శాస్త్రీయ దృక్పథంతో మాత్రమే చూసి తెలుసుకోవాలనుకునేవారికీ. రెండింటిలోనూ మౌలిక విషయాలు ఒక్కటే.

ఆధునిక విద్యావిధానపు రీతుల గురించి శాస్త్రవేత్తలిప్పుడు ఎన్నో పరిశోధనలు జరుపుతున్నారు. అందులో వారు తెలుసుకున్న విషయమేమిటంటే, 20 ఏళ్ల పాటు ఒక పిల్లవాడు ఒక సంప్రదాయిక విద్యావిధానంలో చదువుకొని బయటకు వస్తే ఆ పిల్లవాని వివేచన శక్తి చాలా వరకు తిరిగి కోలుకోలేనంతగా నాశనమైపోతుందని. ఇంకోమాటలో చెప్పాలంటే అతనొక విషయ పరిజ్ఞానం గల మూర్ఖునిగా బయటకొస్తాడు! అందుకే ఈ శాస్త్రవేత్తలిప్పుడు ఆటపాటల ద్వారా, కథా-కథనాల ద్వారా విద్యాబోధన చేయమని సలహా ఇస్తున్నారు. ఈ దిశగా చిన్న చిన్న ప్రయత్నాలు జరిగినప్పటికీ, స్థూలంగా ప్రపంచంలోని విద్యావిధానం చాలా వరకు వివేకాన్ని అణచేదిగానే కొనసాగుతోంది. క్రమపద్ధతిలో అందివ్వకపోతే, ఎక్కువ సమాచారం అందించడం వివేచనని అణచివేస్తుంది. ఆ పద్ధతుల్లో కథా రూపకమైన బోధన ఉత్తమమైనది. సంస్కృతిలో గహనమైన వైజ్ఞానిక కోణాలను కథల రూపంలో అందజేశారు.



- సద్గురు

నమస్తే తెలంగాణ
జీవనరేఖ
[హైదరాబాద్]
మంగళవారం 13 ఫిబ్రవరి 2018



పిల్లలకు అత్యంత ఇష్టమైనవి చాక్లెట్లు. కానీ ఇవి ఎక్కువగా తింటే దంతాలు పుచ్చిపోతాయనే భయం ఉంటుంది తల్లికి. అందుకే చాక్లెట్లు ఇవ్వడానికి ఆలోచిస్తారు. అయితే అన్ని రకాల తినుబండారాలకు ఏదో ఒక వ్యాధి అంటగడితే మరి పిల్లల అభిరుచి సంగతేంటి? అందుకే ముందు చాక్లెట్లు తిన్నప్పుడు ఏయే పరిస్థితుల్లో దంతాలు పుచ్చుతాయనేది అర్థం చేసుకోవాలి.

చాక్లెట్లు తింటే పళ్లు పుచ్చిపోతాయా?

ముందు చాక్లెట్లు, వాటికి సంబంధించిన తినుబండారాలను గురించి తెలుసుకుందాం. చాక్లెట్ అనేది తీపి పదార్థం. అందుకే పిల్లలు ఎక్కువగా ఇష్టపడుతారు. చెప్పిన మాట వింటే చాక్లెట్ ఇస్తానని పెద్దవాళ్లు పిల్లలతో అంటుంటారు. అయితే ఈ తీపి పదార్థాలు తిన్నంత మాత్రాన పిప్పిపళ్లు రావు. ఈ పదార్థాలు పళ్ల మధ్య చిక్కుకుని పోయినప్పుడు, నోటి పరిశుభ్రత లోపించినప్పుడు మాత్రమే ఇలాంటి సమస్య ఏర్పడుతుంది. ఇలాంటప్పుడు నోటిలో నివసించే కొన్ని బాక్టీరియా ఈ పదార్థాలను పులియబెడతాయి. తద్వారా పంటిని నష్టపరిచే ఆమ్లాలు విడుదలవుతాయి. ఈ ఆమ్లాల్లో లాక్టిక్ ఆమ్లం ఒకటి. ఇది శరీరంలోని వివిధ భాగాల్లో అతి గట్టిదైన పింగాణిపొరను కూడా కరిగించగలదు. ఆమాల్లలు దంతాల మీది ఎనామిల్ (పింగాణి) పొరపై చర్య జరిపినప్పుడు చిన్న చిన్న రంధ్రాలు ఏర్పడి, అవి క్రమంగా డొల్లలుగా మారుతాయి. వీటినే మనం పిప్పిపన్ను లేక డెంటల్ కెరీస్ అంటాం.

ఈ జాగ్రత్తలతో నో వర్రీస్!

- ఒక పన్ను పిప్పి పన్నుగా మారడానికి చాలా కాలం పడుతుంది. అందువల్ల పిప్పి పన్ను తయారుకావడానికి చాక్లెట్ లాంటి తీపి పదార్థాలు ఉపయోగపడినప్పటికీ నోటి శుభ్రత లోపించినప్పుడు మాత్రమే పై చర్యలు అధికంగా జరిగి దంత వ్యాధులు సంభవిస్తాయి.
- కాబట్టి పిల్లలు చాక్లెట్లు తినడం మానేయడం కంటే నోటి శుభ్రతకు తగిన జాగ్రత్తలు పాటిస్తే ఎలాంటి అనర్థాలు రావు. ఇకపోతే కేకులు అతుక్కుపోయే గుణం గల ఆహార పదార్థాల కిందకి వస్తాయి. ఒక్కోసారి మామూలుగా నోటిని నీటితో పుక్కిళించినప్పటికీ ఇలాంటి పదార్థాలు పంటి ఉపరితలం మీద అలా అతుక్కునే ఉండిపోతాయి. వీటి విషయంలో కొంచెం ఎక్కువ శ్రద్ధ పాటించాల్సి ఉంటుంది. అంటే నోటిని వీలయినన్ని సార్లు పుక్కిళించాలి.
- ఇలా అంటుకునే ఆహార పదార్థాల వల్ల పళ్ళు పుచ్చిపోవడమే కాకుండా నోటి దుర్వాసన కూడా అధికంగా ఉంటుంది. కనుక కేకులు, ఇతర అంటుకునే ఆహారపదార్థాలు తిన్నప్పుడు కనీసం రెండు మూడు సార్లు చక్కగా నోటిని శుభ్రపరుచుకోవాలి. పిల్లలు కనీసం రోజుకు రెండుసార్లు దంత ధావనం అలవాటు చేసుకోవాలి. చాక్లెట్ గాని, మిఠాయిలు గాని, ఇతర అల్పాహారం గానీ తిన్న వెంటనే నోరు కడుక్కోవడం అలవాటు చేసుకోవాలి. కొందరు పిల్లలు తిన్న తరువాత నోటిలో నీళ్లు పోసుకుని పుక్కిళించి మింగేస్తారు. ఇది మంచి అలవాటు కాదు. పై జాగ్రత్తలన్నీ పాటిస్తే పిల్లలు చాక్లెట్‌లు తినే విషయంలో భయపడాల్సిన పనిలేదు.



- డాక్టర్ కె.యల్.వి. ప్రసాద్
సీనియర్ దంతవైద్య నిపుణులు
హన్మకొండ



ఫిబ్రవరి 15 వరల్డ్ చైల్డ్‌హుడ్ క్యాన్సర్ డే

క్యాన్సర్లనగానే వయసు పైబడినవాళ్లకు వచ్చే తీవ్రమైన వ్యాధి అని సాధారణంగా ఉండే అభిప్రాయం. కానీ దీనికి వయసుతో సంబంధం లేదు. అయితే పిల్లల్లో వచ్చే క్యాన్సర్లు ఎక్కువే. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ వ్యాధికి గురవుతున్న పిల్లల్లో మూడో వంతు మనదేశానికి చెందినవారే. మనదేశంలో ఏటా కొత్తగా నమోదవుతున్న పదిలక్షల క్యాన్సర్ కేసుల్లో 55 వేలు పిల్లలు, టీనేజర్లకు సంబంధించినవేనని భారత వైద్య పరిశోధనా మండలి (ఐసిఎంఆర్) అధ్యయనంలో వెల్లడైంది. అయితే క్యాన్సర్ వచ్చిన పది మంది పిల్లల్లో ఒక్కరు మాత్రమే పూర్తి చికిత్స తీసుకుంటున్నారు. ఫలితంగా పిల్లల్లో పూర్తిగా నయం కాగల లింఫోమా, ల్యుకేమియా వంటి పిల్లల క్యాన్సర్లు కూడా మనదేశంలో కేవలం 30 శాతం పిల్లల్లో మాత్రమే నయం అవుతున్నాయి. వీటిని గుర్తించలేకపోవడం, ఎవరికీ చెప్పకుండా దాచిపెట్టడం ఇందుకు ప్రధాన కారణాలు.


చిన్నారుల్లోనూ క్యాన్సర్లు!

చికిత్సల్లో కొత్త ఆశలు

నిజానికి క్యాన్సర్ చికిత్సలో అభివృద్ధి వేగవంతంగా జరుగుతున్నది. కీమోథెరపీ, సర్జరీ, రేడియోథెరపీలకు తోడుగా ఇమ్యునోథెరపీ అందుబాటులోకి వచ్చింది. ఫలితంగా పెద్దవాళ్లతో పోలిస్తే పిల్లల్లో ప్రభావవంతమైన చికిత్స సాధ్యపడుతున్నది.

పిల్లల్లో ప్రధానంగా తొమ్మిది రకాల క్యాన్సర్లను గుర్తించారు. అవి :


ల్యుకేమియా



ఇది పిల్లల్లో ఎక్కువగా కనిపించే క్యాన్సర్. క్యాన్సర్ బారిన పడ్డ పిల్లల్లో దాదాపు 30 శాతం మందిలో ల్యుకేమియా కనిపిస్తుంది. ఇది ఎముక మజ్జ, రక్తానికి సంబంధించిన క్యాన్సర్. దీనిలో అక్యూట్ లింఫోసైటిక్ ల్యుకేమియా, అక్యూట్ మైలోజెనిక్ ల్యుకేమియా అని రెండు రకాలుంటాయి. ల్యుకేమియా వల్ల ఎముకలు, కీళ్లలో నొప్పులుంటాయి. విపరీతమైన అలసట ఉండి, చర్మం పాలిపోయి కనిపిస్తుంది. జ్వరం, శరీర బరువు తగ్గిపోవడంతో పాటు రక్తస్రావం, గాయాలు ఉంటాయి. అక్యూట్ ల్యుకేమియా వ్యాధి ప్రారంభమైతే వేగంగా పెరిగిపోతుంది. అందువల్ల వ్యాధిని గుర్తించిన వెంటనే కీమోథెరపీ చేయాల్సిన అవసరం ఉంటుంది.

మెదడు, వెన్నులో గడ్డలు


ల్యుకేమియా తర్వాత పిల్లల్లో ఎక్కువగా కనిపించే క్యాన్సర్లు మెదడు, వెన్నుపాము గడ్డలే. పిల్లల క్యాన్సర్లలో 26 శాతం ఇవే. ఈ గడ్డలు అనేక రకాలుగా ఉంటాయి. వాటి చికిత్సకు అనుసరించాల్సి పద్ధతులు కూడా వేర్వేరుగా ఉంటాయి. పెద్దవాళ్లలో వచ్చే మెదడు క్యాన్సర్లకు భిన్నంగా పిల్లల్లో వచ్చే మెదడు క్యాన్సర్లు సెరిబెల్లం లేదా బ్రెయిన్ స్టెమ్ వంటి మెదడు దిగువ భాగాల్లో ప్రారంభమవుతుంటాయి. ఈ క్యాన్సర్లలో తలనొప్పి, మైకం, మూర్ఛలు, నడవడంలో ఇబ్బందులు, వస్తువులను పట్టుకోవడానికి ఇబ్బందిగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.



న్యూరోబ్లాస్టోమా

పిల్లల క్యాన్సర్లలో ఇవి 6 శాతం ఉంటాయి. పిండదశలో నాడీకణాలు ఏర్పడిన తొలిరోజుల్లోనూ న్యూరోబ్లాస్టోమా మొదలవుతుంది. అందువల్ల పసివాళ్లు, చిన్న పిల్లల్లో ఇది కనిపిస్తుంది. పది సంవత్సరాలు దాటిన పిల్లల్లో ఇది చాలా అరుదు. ఈ క్యాన్సర్ గడ్డ ఎక్కడైనా ఏర్పడవచ్చు. కానీ ఎక్కువగా పొట్ట ప్రాంతంలో బయటపడుతుంది. పొట్ట వాపుగా కనిపిస్తుంది. జ్వరం, ఎముకల నొప్పి వంటి లక్షణాలుంటాయి.


విల్మ్స్ ట్యూమర్



దీన్ని నెఫ్రోబ్లాస్టోమా అని కూడా అంటారు. ఇది ఒకటి లేదా అరుదుగా రెండు కిడ్నీల్లో రావొచ్చు. నాలుగేళ్ల వయసున్న పిల్లల్లో బయటపడే అవకాశాలెక్కువ. పిల్లల క్యాన్సర్లలో ఇవి 5 శాతం. ఉదర భాగంలో వాపు లేదా పొట్ట వద్ద గడ్డగా ఇది బయటకు కనిపిస్తుంది. కొంతమంది పిల్లల్లో జ్వరం, నొప్పి, కడుపులో తిప్పినట్టుండడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలుంటాయి.

లింఫోమాలు

రోగనిరోధక వ్యవస్థలోని లింఫోసైట్లలో ఇవి ప్రారంభమవుతాయి. చాలా సందర్భాల్లో లింఫ్ గ్రంథులు, థైమస్, టాన్సిల్స్ వంటి లింఫ్ కణజాలాల్లో మొదలవుతాయి. సాధారణంగా ఈ క్యాన్సర్లలో పిల్లలు బరువు తగ్గిపోవడం, జ్వరం, చెమటలు పడుతుండడం, విపరీతమైన అలసట, మెడ,చంకలు, గజ్జల్లో గడ్డలు ఏర్పడడం వంటి లక్షణాలుంటాయి. లింఫోమాల్లో ప్రధానంగా హాడ్జ్‌కిన్స్ లింఫోమా, నాన్ హాడ్జ్‌కిన్స్ లింఫోమా అని రెండు రకాలుంటాయి. పిల్లల క్యాన్సర్లలో హాడ్జ్‌కిన్స్ లింఫోమా 3 శాతం ఉంటుంది. పెద్దవాళ్లకు ఇచ్చే చికిత్సలే పిల్లల్లోనూ మంచి ఫలితాలు ఇస్తున్నాయి. సాధారణంగా నాన్ హాడ్జ్‌కిన్స్ లింఫోమాలు మూడు నుంచి అయిదేళ్ల మధ్య వయసులో కనిపిస్తాయి. ఇవి వేగంగా పెరుగుతాయి. గుర్తించిన వెంటనే చికిత్స చేస్తే త్వరగా లొంగివస్తాయి.




రబ్డోమయోసార్కోమా



అస్థిపంజరాన్ని అంటుకుని ఉండే కండరాలు (స్కెలిటల్ మజిల్స్)లో ఇది వస్తుంది. ఈ కండరాలే శరీరంలోని వివిధ భాగాలను కదిలించడానికి ఉపయోగపడుతాయి. తల, మెడ, పొట్ట, గజ్జులు, కటి వలయం, కాళ్లూచేతుల వంటి ఏ భాగంలోనైనా ఇది ప్రారంభం కావొచ్చు. దీనిలో నొప్పి, వాపు లేదా ఈ రెండు లక్షణాలూ కూడా వ్యక్తం కావొచ్చు. పిల్లల క్యాన్సర్లలో ఇవి మూడు శాతం ఉంటాయి.


రెటినోబ్లాస్టోమా



ఈ కంటి క్యాన్సర్ పిల్లల క్యాన్సర్లలో రెండు శాతం ఉంటుంది. సాధారణంగా రెండేళ్ల వరకు వయసున్న పిల్లలు ఈ వ్యాధికి గురవుతారు. పిల్లల కళ్లు అసాధారణంగా ఉండడాన్ని తల్లిదండ్రులో, డాక్టరో చూడడంతో ఇది బయటపడుతుంది. రెటినోబ్లాస్టోమాలో కనుపాప సాధారణంగా చూసినప్పుడు తెల్లగా లేదా గులాబి రంగులో కనిపిస్తుంది. వారి కళ్లపైకి కాంతిని కేంద్రీకరించి చూసినప్పుడు కనుపాప ఎర్రగా కనిపిస్తుంది. కనుపాప వెనుక కంటిలోని రక్తనాళాల వల్ల ఇలా కనిపిస్తుంది.

ఎముకల క్యాన్సర్లు

ఎముకల్లో మొదలయ్యే ఈ క్యాన్సర్లు టీనేజర్లలో ఎక్కువ. మూడు శాతం ఉంటాయివి. ప్రైమరీ బోన్ క్యాన్సర్లలో ఆస్టియోసార్కోమా, ఈవింగ్స్ సార్కోమా అని రెండు రకాలు. వీటిలో ఆస్టియోసార్కోమా టీనేజ్ పిల్లల్లో ఎక్కువ. కాళ్లూచేతుల్లో వేగంగా పెరిగే పొడవాటి ఎముకల్లో ఇది మొదలవుతుంది. ఎముకల నొప్పి ఉంటుంది. రాత్రివేళల్లో తీవ్రంగా ఉంటుంది. కొన్నిసార్లు ఎముక వద్ద వాపు కనిపిస్తుంది. ఈవింగ్స్ సార్కోమా కొంత తక్కువ. దీనిలో కూడా ఎముకల నొప్పి ఉంటుంది. టీనేజ్‌కి దగ్గరగా ఉన్న పిల్లల్లో ఇది ఎక్కువ. కాళ్లలోని పొడవైన ఎముకల మధ్య, కటివలయం, ఛాతి ఎముకల్లో ఇది కనిపిస్తుంది.



హెపటోబ్లాస్టోమా



పిల్లల్లో వచ్చే రెండు శాతం ఉండే కాలేయ క్యాన్సర్ ఇది. దీన్ని హెపటోసెల్యులార్ కార్సినోమా అని కూడా అంటారు. ఇది పసిపాపల నుంచి మూడేళ్ల వయసు పిల్లల వరకు వస్తుంటుంది. పొట్ట వాచిపోవడం దీనిలో కనిపించే మొదటి లక్షణం. దీనికి తోడు ఆకలి మందగించడం, శరీర బరువు తగ్గిపోవడం, కడుపులో తిప్పడం, నొప్పి, వాంతులు, కామెర్లు, శరీర భాగాల పెరుగుదల సమంగా లేకపోవడం, త్వరగా నెలసరి మొదలవడం దీని లక్షణాలు.

పిల్లల్లో క్యాన్సర్ ఎందుకు?



దీనికి కచ్చితమైన సమాధానం లేదు. కాని పరిశోధనల్లో కొన్ని కారణాలను గుర్తించారు. పెద్దవాళ్లలో లాగా జీవనశైలి, ఆహారపు అలవాట్లు, పర్యావరణ పరిస్థితులతో సంబంధం ఉండడం లేదు. పర్యావరణ సంబంధిత కారణాలు కొన్ని, రేడియేషన్ పిల్లల్లో క్యాన్సర్‌కు కారణమవుతున్నట్టు భావిస్తున్నారు. కాలుష్యం, ధూమపానం చేసేవారికి దగ్గరగా అధిక సమయం గడపడం కూడా కారణమే. కొద్దిమంది పిల్లల్లో జన్యుపదార్థ మార్పులు, తల్లిదండ్రుల నుంచి (వంశానుగతంగా) క్యాన్సర్ వచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

చికిత్సలెన్నో..

పిల్లల్లో క్యాన్సర్ రకం, దాని తీవ్రత పైన ఆధారపడి మూడు నెలల నుంచి రెండున్నర సంవత్సరాల వరకు చికిత్సకు సమయం పడుతుంది. క్యాన్సర్ రకాన్ని బట్టి చికిత్స ఉంటుంది. ఇప్పుడు ఆధునిక కీమో, టార్గెటెడ్ థెరపీ మందులెన్నో ఉన్నాయి. ఇమ్యునోథెరపీ అనే నూతన విధానం వచ్చాక క్యాన్సర్ చికిత్సలు మరింత ఆశావహంగా ఉన్నాయి. అవసరాన్ని బట్టి కీమోథెరపీ, శస్త్రచికిత్స, రేడియేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. సాధారణంగా కీమోథెరపీనే వాడుతారు. అవసరమైతే క్యాన్సర్ గడ్డను తొలగించడానికి శస్త్రచికిత్స చేస్తారు. కొందరికి బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ ద్వారా వ్యాధి నివారణ సాధ్యమవుతుంది. కొన్ని సందర్భాల్లో ఒకటి కంటే ఎక్కువ విధానాల ద్వారా చికిత్స చేయాల్సి వస్తుంది. రేడియేషన్ పసిపిల్లలపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది కాబట్టి అనివార్యమైతేనే ఇస్తారు.



డాక్టర్ గణేష్ జైషెట్వార్
సీనియర్ హెమటో ఆంకాలజిస్ట్, బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ నిపుణులు
యశోద హాస్పిటల్స్
హైదరాబాద్



గుర్తుండాలంటే?

గురుకులాల్లో వేదాలను గట్టిగా వల్లె వేయడం గురించి మనకు తెలుసు. అలా నేర్చుకున్న వేదపాఠాలను వాళ్లు ఎప్పటికీ మరిచిపోరు. అదేవిధంగా స్కూల్లో పిల్లలు చదువుకునేప్పుడే ప్రశ్న-జవాబులను పైకి పెద్దగా చదువుతుంటారు. అలా చదివితే తొందరగా పాఠాలను నేర్చుకోవడం సాధ్యమవుతుంది కూడా. ఇదే విషయాన్ని కొత్త పరిశోధనలు ధ్రువీకరిస్తున్నాయి. మనసులో సైలెంట్‌గా కాకుండా పైకి వినబడేట్టుగా గట్టిగా చదవడం వల్ల ఆ అంశాలు మన మెదడులో మరింత పదిలంగా ఉంటాయిట. ఎక్కువ కాలం గుర్తుంటాయి అని చెప్తున్నారు పరిశోధకులు. ఈ పరిశోధన ఫలితాలు మెమొరీ అనే మ్యాగజైన్‌లో ప్రచురితమయ్యాయి.


సాధారణంగా రాసి ఉన్న సమాచారాన్ని గుర్తుపెట్టుకోవడానికి నాలుగు రకాల మార్గాలను ఎంచుకుంటారు. మనసుతో నిశ్శబ్దంగా చదువుకోవడం, ఎవరైనా చదువుతుంటే విని మనసుకు ఎక్కించుకోవడం, తమకు తామే చదువుకునేప్పుడు మనసులో రికార్డు చేసుకోవడం, గట్టిగా చదువుతూ అదే సమయంలో మనసుకి ఎక్కించుకోవడం. ఇలా గట్టిగా చదవడం వల్ల మాట్లాడడం, వినడం అనే రెండు పనులు ఒకేసారి జరుగుతాయి. తద్వారా చదివిన పదాలను ఎక్కువ కాలం గుర్తుపెట్టుకునేందుకు వీలవుతుంది. ఇలా గట్టిగా చదవడమే కాకుండా పదాలను రాయడం, టైపు చేయడం ద్వారా చదివిన దాని కన్నా ఎక్కువ కాలం గుర్తుపెట్టుకోగలుగుతామని కూడా ఈ పరిశోధనలు నిరూపించాయి. అందుకే ఎక్కువ కాలం గుర్తుపెట్టుకోవాలంటే చూస్తూ రాయండి, చదవాలంటే గట్టిగా పైకి చదవండి అని సూచిస్తున్నారు అధ్యయనకారులు.



కొంపముంచే ఒక్క సిగరెట్టు!

'ఒక్కసారి రుచిచూస్తే పోయేదేముందిలే....!'
'ఈ ఒక్క సిగరెట్ తాగుతాను.. ఇక ముట్టుకోను..'
'ఒక్కసారి టేస్ట్ చెయ్ భయ్యా.. ఒక్క సిగరెట్‌తో ఏమీ కాదులే...!'

ఇలా చెయిన్ స్మోకర్లుగా మారినవాళ్లలో చాలామంది ఒక్క సిగరెట్టుతో మొదలుపెట్టినవాళ్లే. ఒకసారి టేస్ట్ చూద్దామనో, స్నేహితుల బలవంతం మీదో, ఒకసారి తాగితే ఏమవుతుందిలే అని ఒక సిగరెట్ తాగుతూ ఉంటారు. ఇక ఆ తరువాత మరొకటి.. తరువాత ఇంకొకటి... ఇలా వాటి సంఖ్య పెరుగుతూనే పోతుంది. మొదలు ఒక్క సిగరెట్‌తో ప్రారంభించినవాళ్లలో మూడు వంతుల మంది తరువాత చెయిన్ స్మోకర్లుగా మారిపోతారట. ఇదేదో గాలి మాట కాదు... అనేక సర్వేల హెచ్చరిక. 2,16,314 మందిపై 8 సర్వేల ఫలితం ఇది. మంచి అలవాటును వెంటబడి తెచ్చుకోవాలి. అదే దురలవాటైతే ఒక్కసారి దానికేసి చూస్తే చాలు.. ఇక పట్టుకుని విడువదు. పొగతాగే అలవాటు కూడా అంతే. సరదాగానో, ఎలా ఉంటుందో తెలుసుకుందామనే జిజ్ఞాసతోనో మొదలుపెట్టిన సిగరెట్టు ఇక వదలడం కష్టం. అందుకే దాని జోలికే వెళ్లొద్దని సూచిస్తున్నారు నికోటిన్ అండ్ టొబాకో రీసెర్చ్‌కి చెందిన పరిశోధకులు.



నైట్ షిఫ్టులతో క్యాన్సర్లు!!

దీర్ఘకాలంగా రాత్రి షిఫ్టుల్లో పనిచేసే మహిళలు ప్రత్యేకించి చర్మం, రొమ్ము, ఊపిరితిత్తుల క్యాన్సర్ల బారిన పడేందుకు ఆస్కారం ఉందంటున్నారు. పగలు పనులు చేసుకోవడం, రాత్రివేళ నిద్రించడం.. మన జీవగడియారం పాటించే పద్ధతి. కానీ దీనికి విరుద్ధంగా చేయడం వల్ల శరీరంలోని సర్కాడియన్ రిథమ్ దెబ్బతింటుంది. అంతర్గత జీవగడియారం శరీరంలోని అనేక ప్రక్రియలను నియంత్రిస్తుంది. అందువల్ల దీనిలో తేడాలు వస్తే వివిధ రకాల ప్రక్రియలు అలజడికి లోనవుతాయి. ఇలా జీవగడియారంపై ప్రభావంతో గుండెజబ్బులు, స్థూలకాయం వచ్చే అవకాశం ఉందని ఇప్పటికే స్పష్టమైంది. ఇప్పుడు ఈ కోవలో క్యాన్సర్లు కూడా చేరాయి. 3,909,152 మందిపై 61 రకాల అధ్యయనాలు చేసిన అనంతరం ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నారు. ఆసియా, ఆస్ట్రేలియా, యూరప్, నార్త్ అమెరికాకు చెందిన 114 వేల క్యాన్సర్ కేసులను ఇందుకోసం అధ్యయనం చేశారు. పగటివేళ పనిచేసేవాళ్లతో పోలిస్తే రాత్రి షిఫ్టులో పనిచేసే మహిళల్లో 19 శాతం ఎక్కువ క్యాన్సర్ రిస్కు ఉంటుంది. దీర్ఘకాలిక నైట్‌షిఫ్ట్ వల్ల చర్మ క్యాన్సర్ వచ్చే అవకాశం 41 శాతం, రొమ్ము క్యాన్సర్ 32 శాతం, జీర్ణవ్యవస్థ క్యాన్సర్ల అవకాశం 18 శాతం ఉన్నట్టుగా ఈ అధ్యయనంలో వెల్లడైంది. రాత్రి షిఫ్టుల్లో పనిచేస్తున్నప్పుడు ప్రతి అయిదేళ్లకు రొమ్ము క్యాన్సర్ రిస్కు 3.3 శాతం పెరుగుతుందంటున్నారు అధ్యయనకారులు. ఈ అధ్యయన ఫలితాలు 'క్యాన్సర్ ఎపిడెమాలజీ, బయోమార్కర్స్ అండ్ ప్రివెన్షన్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

మాకు రాయండి



ఆరోగ్యపరమైన సలహాలు, సూచనలతో పాటుగా వివిధ రకాల జబ్బుల గురించి ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నది మన జీవనరేఖ. అంతేగాకుండా వ్యాధుల నివారణోపాయాలు, ఆధునిక చికిత్సలు, కొత్త పరిశోధనల గురించిన సమాచారాన్ని అందిస్తూ మీకూ, మీ కుటుంబానికి ఉపయోగపడుతున్నదని భావిస్తున్నాం.

మీకు ఆరోగ్యాన్ని మరింత చేరువ చేసేందుకు, మీ కథల్ని మరింతమందిలో స్ఫూర్తి నింపేందుకు నడుం కట్టింది జీవనరేఖ. అందుకే మీకు వైద్య, ఆరోగ్య సంబంధమైన సందేహాలు, సమస్యలేవి ఉన్నా మాకు రాసి పంపండి. నిపుణుల చేత సూచనలిప్పిస్తాము. అంతేకాదు.. మీరేవైనా జబ్బుల్ని ధైర్యంగా ఎదుర్కున్నా మాకు చెప్పండి. మీ ధైర్యం పదిమందికి ఆశ కల్పించగలుగుతుంది.

డాక్టర్లు, హాస్పిటల్స్‌తో మీకు కలిగిన అనుభవాలు మంచివైనా, చెడ్డవైనా మాతో పంచుకోండి. పేషెంట్ డైరీలో భాగంగా ప్రచురిస్తాం.

మా చిరునామా
జీవనరేఖ
నమస్తే తెలంగాణ,
తెలంగాణ పబ్లికేషన్స్ ప్రై. లిమిటెడ్ రోడ్ నెం. 10,
బంజారాహిల్స్,
హైదరాబాద్ - 500 034
jeevanarekha@ntnews.com

9.
నమస్తే తెలంగాణ
శాస్త్ర
[హైదరాబాద్]
మంగళవారం 13 ఫిబ్రవరి 2018

వాళ్లది భిన్నమైన మెదడు

'పురుషులందు పుణ్య పురుషులు వేరయా' అన్నట్టు బ్రెయిన్స్‌లో క్రియేటివ్ బ్రెయిన్స్ వేరుగా ఉంటాయట. సృజనాత్మకతమైన ఆలోచనలు చేసే మెదడుపై తాజా పరిశోధన ఆసక్తికరవిషయాలను వెల్లడించింది.


మిగితావారితో పోలిస్తే క్రియేటివ్ మైండ్‌సెట్ ఉన్న వారు ఈ ప్రపంచాన్ని భిన్న కోణంలో చూస్తారు. వినూత్నంగా ఆలోచిస్తారు. ప్రతిక్షణం కొత్తదనాన్ని ఆవిష్కరించే దిశగా వారి ఆలోచనలు సాగుతుంటాయి. అసలింతకూ వీరి ఆలోచనాధోరణి అలా ఉండేందుకు కారణం ఏమిటి? ఇదే విషయంపై హార్వర్డ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పరిశోధన చేశారు. వీళ్ల ఆలోచనలే కాదు, మెదడు నిర్మాణం కూడా భిన్నంగానే ఉంటుందని తేల్చారు. సృజనాత్మక వ్యక్తుల ఆలోచన భిన్నంగా ఉండడానికి.. వాళ్ల మెదడు నిర్మాణం భిన్నంగా ఉండడమే కారణమని తేల్చారు. క్రియేటివ్ ఆలోచనలలో ముందుకొచ్చే కొందరిని ఎంపిక చేసుకొని, స్కాన్ చేయడం ద్వారా వారి మెదడులో జరిగే నిరంతర క్రియను అధ్యయనం చేశారు. కొత్త ఆలోచనల్లో మెదడు నిమగ్నమై ఉన్నప్పుడు డిఫాల్ట్ మోడ్ నెట్‌వర్క్, ది సాలియన్స్ నెట్‌వర్క్, ఎగ్జిక్యూటివ్ కంట్రోల్ నెట్‌వర్క్ అనే మూడు సబ్‌నెట్‌వర్క్‌లు ముఖ్య పాత్ర పోషిస్తాయని గుర్తించారు. డిఫాల్ట్ మోడ్ నెట్‌వర్క్ జ్ఞాపక శక్తి, మానసిక అనుకరణలో క్రియాశీలకంగా ఉంటే, సాలియన్స్ నెట్‌వర్క్ ముఖ్యమైన సమాచార సేకరణలో, ఎగ్జిక్యూటివ్ కంట్రోల్ నెట్‌వర్క్ ఉపయోగకరమైన ఐడియాల మీద ఫోకస్ పెడుతుందట. మొత్తానికి ఈ నెట్‌వర్క్‌ల మధ్య బంధం దృఢంగా ఉండడమే క్రియేటివ్ మైండ్‌సెట్ ఉన్నవాళ్ల బలమని పరిశోధకులు కనుగొన్నారు. మిగితా వారిలో ఈ నెట్‌వర్క్‌ల మధ్య కనెక్షన్లు అంత దృఢంగా ఉండకపోవచ్చని అభిప్రాయపడుతున్నారు. క్రియేటివ్ బ్రెయిన్ నిర్మాణం మిగితావాటితో పోలిస్తే భిన్నంగా నిర్మాణమై ఉండడం కూడా ఒక కారణం కావొచ్చంటున్నారు. అందుకే వాళ్ల ఆలోచనావిధానం అందరికీ భిన్నంగా, వినూత్నంగా ఉంటుందని చెబుతున్నారు.





స్నేక్ రోబో

పాములా మెలికలు తిరిగి ఉండే ఈ రోబో టెక్నాలజీ ప్రపంచంలో ఒక అద్భుతమే కాదు.. బలమైనది కూడా. ఏసీఎమ్- ఆర్5గా మార్కెట్‌లోకి దూసుకొచ్చిన ఈ రోబోను హైబోట్ అనే జపనీస్ కంపెనీ రూపొందించింది. విభిన్నంగా నిర్మితమైన దీని భాగాలు మనోహరంగాను, నీటిలో గింగిరాలు తిరుగుతూ అబ్బురపరిచేవిగానూ ఉంటాయి. బలమైన రోబోట్స్‌లో ఒకటిగా గుర్తింపు పొందిన ఈ యంత్రతంత్రము.. అటు భూఉపరితల మీద, ఇటు నీటిలోనూ దూసుకుపోగలగడం విశేషం.




ఈ రోబోల రూటే సెపరేటు!

మానవజీవితం ఇప్పుడు యాంత్రికం. నడుస్తున్నది మరమనుషుల కాలం. అందుకే తనలాంటి మరో రూపాన్ని సృష్టించి.. యంత్రమనే గుండెసాయంతో ప్రాణం పోశాడు మనిషి. టెక్నాలజీలో కొత్త పుంతలు తొక్కుతూ ఆ యంత్రుడికి మహోన్నత శక్తులను అందించేందుకు కొన్నేళ్లుగా కృషిచేస్తున్నాడు. కొత్త కొత్త ప్రయోగాలు చేస్తూనే ఉన్నాడు. ఆ ప్రయత్నంలో తానే ఓ యంత్రుడిలా మారిపోయాడు. ఎన్నో విభిన్నమైన రోబోలను ఆవిష్కరించాడు. వాటిలో దేని ప్రత్యేకత దానిదే. ఒకటి మాట్లాడే రోబో అయితే, మరొకటి స్వతంత్రంగా వ్యవహరించే రోబో. ఇలా ఒకటేమిటి ఈ టెక్నాలజీ ప్రపంచంలో చాలా ప్రత్యేకతలున్న రోబోలే ప్రాణం పోసుకున్నాయి. అలాంటి రోబోల్లో అత్యంత శక్తివంతమైన వాటిని, వాటి విశేషాలను మీకు పరిచయం చేస్తున్నాం.

నావ్ రోబో

స్వతంత్రంగా వ్యవహరించే రోబో ఇది. పారిస్‌లో ఉండే ఆల్డిబరన్ రోబోటిక్స్ అనే ఫ్రెంచ్ కంపెనీ రూపొందించిన ఈ యంత్రుడు.. స్వయంగా ప్రోగ్రామింగ్ చేసుకోగలడు. అంతేకాదు కట్టింగ్ ఎడ్జ్‌మోషన్, వ్యూ మరియు ఆడియో సామర్థ్యాలను కలిగి ఉన్నదీ రోబో. విభిన్నమైన ఉపరితలాలపైన నడువగలదు. వస్తువులను, మనుషుల ముఖాలను గుర్తించగలదు. ఎమోషన్స్‌ను వ్యక్తం చేయగలదు, అర్థం చేసుకోగలదు. స్పర్శ, వినికిడి కమాండ్స్‌కు స్పందిస్తుంది. ఇది చాలదనుకొంటే.. గగ్నమ్ స్టైల్ డ్యాన్స్‌తోనూ అలరించగలదు ఈ బలమైన రోబో.

కురట రోబో



రోబోటిక్స్ వరల్డ్‌లో కొన్ని ఆవిష్కరణలు కాల్పనికత కంటే దృఢంగా ఉంటాయి. ఈ భారీ స్థాయి కురట రోబోను చూస్తే.. హాలీవుడ్ బ్లాక్‌బస్టర్స్ ట్రాన్స్‌ఫార్మర్స్, రియల్ స్టీల్‌లలో సందడి చేసిన మెషినరీలను నిజమేనని నమ్మాల్సిందే. జపనీస్ టెక్నాలజీతో కూడిన ఈ భారీ రోబోను స్యుడోబాషి హెవీ ఇండస్ట్రీ తయారు చేసింది. నాలుగు మీటర్ల ఎత్తుండే ఈ యంత్రుడి చేతిలో మెషిన్ గన్స్, రాకెట్‌లాంచర్స్ వంటి ప్రమాదకరమైన మారణాయుధాలు ఉంటాయి. దీని లోపల ఏర్పాటు చేసిన కాక్‌పిట్ ద్వారా ఆపరేట్ చేయవచ్చు, లేదంటే స్మార్ట్‌ఫోన్‌కు కనెక్ట్ చేయడం ద్వారా రిమోట్ ద్వారానూ పర్యవేక్షించవచ్చు. దీని స్పెషాలిటీస్ చూసి కొనుక్కోవాలనుకొంటే మాత్రం కాస్త ఆలోచించాల్సిందే. ఎందుకంటే దీని ధర 1.35 మిలియన్ డాలర్ల పైమాటే.

ఆక్టోవియా రోబో

యూఎస్ నావల్ రీసెర్చ్ లాబొరేటరీ రూపొందించిన మానవ రూపిత యంత్రమిది. ముఖ కవళికలు మనిషిని పోలి ఉండడం విశేషం. ఆ దేశపు నౌకాదళంలోని ఇంజినీర్లకు ఫైర్‌ఫైటర్‌గా ఇది సాయం చేస్తుంది. ఇది మనుషులతో పరస్పరం సంభాషించగలదు, మనుషులను గుర్తించగలదు. మనుషులు చేపట్టే హానికారకమైన చర్యలను ట్రాక్ చేయగలదు. నౌకాదళంలోని ఇంజినీరింగ్ సభ్యులతో భుజం భుజం కలిపి పని చేయడంలో ఇది మానవుడి మాదిరే పనిచేస్తుంది. మాట్లాడడం, దృశ్యవీక్షణం గుర్తించడం వంటి స్పెషాలిటీస్‌తో దృఢమైన రోబోట్స్‌లో ఒకటిగా హైలైట్ అయ్యిందీ ఆక్టోవియా.



స్వైన్‌ఫ్లూ రోబో



సాధారణంగా రోబో అనగానే అందరిలో ఒక యాంత్రికమైన నిర్మాణమే స్ఫురణకు వస్తుంది. కానీ ఇది కచ్చితంగా అలాంటి రోబో అయితే కాదు. ఇదొక మానవ వింత. అచ్చం మనిషిని పోలి ఉండే ఈ రోబో స్వైన్‌ఫ్లూ లక్షణాలను అనుకరిస్తుంది. అదేంటి రోగంతో పుట్టిందా? అని ఆశ్చర్యపోవద్దు. జపాన్‌లోని ట్రైనీ డాక్టర్లకు స్వైన్‌ఫ్లూ (H1N1) గురించి ట్రైనింగ్ ఇచ్చేందుకు ప్రత్యేకంగా వీటిని తయారు చేశారట. అన్ని రోబోట్స్‌లా కాదు, ఇవి అచ్చం మనిషి శరీరాన్ని పోలిన బాహ్యనిర్మాణాన్ని కలిగి ఉంటాయి. మనిషిలాగే వీటికి కూడా చెమటొస్తుంది. ఇవి ఏడుస్తాయి. బాధతో మెలికలు తిరిగిపోతాయి. సరైన చికిత్స అందకపోతే వీటి ఆరోగ్య పరిస్థితి విషమంగా మారుతుంది. కొన్ని క్లిష్టపరిస్థితుల్లో శ్వాస ఆగిపోయి చనిపోతాయి కూడా.

బిగ్ డాగ్ రోబో



2005లో బోస్టన్ డైనమిక్స్ రూపొందించిన నాలుగు కాళ్ల రోబో ఇది. దీనిపేరు బిగ్ డాగ్. మిలిటరీ వాళ్లకు సాయం చేసేందుకు ఈ తెలివైన రోబోటిక్ డాగ్‌ను తయారు చేశారు. సైనికశక్తికి కొత్త టెక్నాలజీని జోడించడం కోసం డిఫెన్స్ అడ్వాన్స్‌డ్ రీసర్చ్ ప్రాజెక్ట్స్ ఏజెన్సీ ఈ కొత్త రోబోను తయారు చేసింది. బిగ్‌డాగ్ తన దృఢమైన కాళ్లతో యుద్ధవాహనాలకు కూడా కష్టతరమైన ఉపరితలంపై.. సైనికుల వెంట నడుస్తుంది. ఇది 340 పౌండ్లు (150 కిలోగ్రామ్స్) బరువు గల వస్తువును గంటకు 6.4 కిలోమీటర్ల వేగంతో విసురగలదు. అందుకే దృఢమైన రోబోట్స్‌లో స్థానం దక్కించుకున్నది.

నమ్మకం - విజ్ఞానం

శిగాలు, పూనకాల్లో నిజమెంత?

శిగాలు, పూనకాలు జాతర్లలో, క్రతువుల్లో సాధారణంగా కనిపిస్తుంటాయి. ఒంటిపైకి దేవుడు వచ్చాడని, దేవత పూనిందని అంటుంటారు. దానికి ప్రభావితులైన వ్యక్తులు వింతవింతగా ప్రవర్తిస్తుంటారు. ఏమేమో మాట్లాడుతుంటారు. జనాలు వాటిని దేవతల పలుకులుగానే భావిస్తుంటారు. నిజంగా శిగాలు, పూనకాలకు గల కారణం వారి ఒంటి మీద దేవుడు పూనడమేనా? ఇంకేమైనా ఇతర కారణాలున్నాయా? ఒక్కొక్కసారి కొందరు విపరీతంగా ప్రవర్తించడం, పెద్ద పెద్ద బండరాళ్లు ఎత్తడం, బిందెలకొద్దీ నీళ్లు తాగడం, పెద్దపెద్ద చెట్లు ఎక్కడం వంటి వింత చేష్టలు చేస్తుంటారు. ఈ మధ్య కొంతమంది బ్రదర్స్ అని చెప్పుకొంటూ స్వస్థత కూటముల పేరుతో ఏవేవో అరుస్తూ ఉంటే అక్కడ హాజరైనవారు వింతవింతగా ఊగుతుండడం కనిపిస్తున్నది. వాళ్లంతా పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తుంటారు. తమకున్న దైవిక శక్తులతో ఒంటిమీద సైతాన్‌ని పారదోలుతున్నామని, దీనితో రోగాలు తగ్గుతాయని, చనిపోయిన వారు కూడా సజీవంగా తిరిగివస్తారని .. అక్కడ స్టేజీపై ఉన్నవాళ్లు చెబుతుంటారు. ఇవన్నీ నిజంగా నిజమేనా? అసలు వీటి వెనుకున్న అసలు కారణమేమిటి?



పూనకాలు, శిగాలు ఊగేవాళ్లు చెప్పేవన్నీ నిజాలనీ, స్వస్థత కూటములలో వింతప్రవర్తనలు అతీత శక్తులకు నిదర్శనమనీ అనుకొంటారు చాలామంది. అందులో ఎంత మాత్రం నిజం లేదు. సాధారణంగా ఇవి రెండు రకాలు. వాటిల్లో ఒకటి.. కావాలనే ఇలా ప్రవర్తించి జనాలను మోసం చేయడం. ఇలాంటివారి నాటకాలను పసిగట్టి, వారి బండారాన్ని బట్టబయలు చేయొచ్చు.

ఇంకొకటి మానసిక బలహీనలతల కారణంగా వచ్చిన మానసిక లోపం. ఈ లోపాలనే వాడుక పరిభాషలో హిస్టీరియా అంటారు. ఈ పదం గ్రీకు నుంచి వచ్చింది. గ్రీకు భాషలో హిస్టెరీ అంటే గర్భసంచి అని అర్థం. ఎక్కువగా ఈ మానసిక లోపం మహిళల్లోనే తలెత్తుతుందని దీనికీ పేరు పెట్టారు. ఒకేసారి అనేకమందికి ఇలాంటి లోపం తలెత్తితే మాస్ హిస్టీరియా అంటారు.

కానీ వైజ్ఞానిక పరిభాషలో దీన్ని కన్వర్షన్ డిజార్డర్ అంటారు. ఈ రుగ్మతలు డిసోసియేటివ్ అని, సొమటోఫార్మ్ అని రెండు రూపాల్లో ఉంటాయి. ఈ రుగ్మతలకు గురైనవారిలో.. పరిస్థితికి గల కారణాలను గుర్తించి సరిచేయగలిగితే మరోసారి అలా ప్రవర్తించరు. ఈ చికిత్స జాగ్రత్తగా నిపుణులైన సైకియాట్రిస్టుల ద్వారానే జరుగాలి.

ఈ మానసిక రుగ్మతలు ఎందుకొస్తాయ్?

అసలు మనిషిలో ఇలాంటి మానసిక రుగ్మతలు ఎందుకొస్తాయి? మానసిక ఆందోళనలు జంకు, బిడియం ఉండడం, ఒంటరితనంగా భావించడం, గాలి సరిగ్గా తీసుకోకపోవడం, నరాల నిస్సత్తువ, సరైన రక్తప్రసరణ లేకపోవడం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడడం, తమకున్న బలీయమైన కోరికలు అణచివేయబడడం.. ఇలా అనేక కారణాలు హిస్టీరియాకు దారి తీయవచ్చు. అయితే ఈ హిస్టీరియా లక్షణాలు ఎక్కువగా మహిళల్లో కనబడుతుండడం గమనార్హం. ఇందుకు కారణం బాల్యవివాహాలు, చిన్నతనంలోనే తల్లులవడం, ఎక్కువమంది పిల్లలను కనడం, తమ ఆకాంక్షలను బలవంతంగా మనసులోనే అణిచివేసుకోవాల్సిరావడం, పిల్లలు పుట్టకపోవడం వల్ల సూటిపోటి మాటలతో ఇబ్బందిపడడం వంటి పరిస్థితులు ఆడవారిని తీవ్రమైన మానసిక ఒత్తిళ్లకు గురిచేస్తున్నాయి. అందుకే హిస్టీరియా బారిన పడుతున్నారు.

ఇంకొంత మంది తమను ఎవరూ పట్టించుకోవడం లేదని, తమ బాధలు ఎవరికీ పట్టడం లేదని.. ఈ రకంగా ప్రవర్తిస్తారు. దేవతలు పూనినట్టుగా శిగాలు ఊగిపోవడం ద్వారా అంతకు ముందు తమను గుర్తించనివారు, పట్టించుకోని వారూ.. తమ పట్ల శ్రద్ధ చూపించడం కూడా దీనికి కారణమవుతుంది. వారికి ఎలాంటి రుగ్మత లేకున్నా కూడా తమకు ప్రత్యేకమైన గుర్తింపు దక్కాలనే ఆశతో ఇలా వింతగా ప్రవర్తిస్తుంటారు. లేని వాటిని ఉన్నట్టుగా భ్రమిస్తుంటారు.

ఇలా శిగాలు, పూనకాలు ఊగేవారు చేస్తున్నది నటనా? లేక నిజంగానే సమస్యలతో బాధపడుతూ ఇలా చేస్తున్నారా? అనే విషయాన్ని గమనించాలి. సమస్యలతో బాధపడుతూ విపరీత ధోరణిలో ప్రవర్తిస్తున్న వారి పరిస్థితిని సానుభూతితో అర్థం చేసుకోవాలి. వారితో చాలా ఓపికగా మసలుకోవాలి. నిపుణులైన సైకియాట్రిస్టులతో చికిత్స చేయించాలి.

టి. రమేష్
ప్రధాన కార్యదర్శి, ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్

సుడోకు

డైలీ సుడోకు 125 సమాధానం

3	7	2	5	1	8	4	9	6
1	8	4	2	9	6	3	7	5
9	5	6	3	7	4	1	2	8
5	6	7	4	8	2	9	3	1
2	1	3	6	5	9	8	4	7
8	4	9	1	3	7	5	6	2
4	9	5	7	6	1	2	8	3
6	3	8	9	2	5	7	1	4
7	2	1	8	4	3	6	5	9

డైలీ సుడోకు -126

4							3	6
	5		3	9		8		
					8			4
8		5		2				3
	6						4	
3				5		1		9
9			2					
		1		6	3		7	
6	2							1

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

ట్వీట్



ముంబై సెంట్రల్ స్టేషన్‌లో మొట్టమొదటి టాయిలెట్ సదుపాయాన్ని ఏర్పాటు చేశారని ప్రకటిస్తున్నందుకు గర్వపడుతున్నాను. శుభ్రమైన, సురక్షితమైన పారిశుధ్యం కోసం ఈ ఏర్పాటు చేయడం జరిగింది. మహిళా హక్కుల్లో మరొక ముందుడుగు పడినందుకు ఆశిస్తున్నా.

సోనమ్‌కపూర్
@sonamakapoor



సోనమ్ కపూర్‌ని ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
11, 635, 641

కామన్‌మ్యాన్ వాయిస్

మనిషిపై గ్రహాల ప్రభావం కంటే మనీప్రభావం ఎక్కువ. అది ఉంటే అన్ని గ్రహాలు వాటంతటవే అనుకూలిస్తయ్!
– Raju Athikam

బాగా ఖర్చు పెట్టేవాళ్లే గోవాకు టూరిస్టులుగా వెళ్లాలంట. ఎక్కువ రాబడి కోసం రాష్ట్రాన్ని గుత్తగా అమ్మేసుకోండి ఇంకా ఎక్కువ వస్తాయి.
–Venu Bekkam

జీవితం.. రాజకీయం.. క్లాప్‌తో మొదలు కావు. అలా అని ఫ్లాప్‌తో అంతం కావు. కొనసాగుతూ ఉంటాయి. అలా కొనసాగించినవాళ్లే ఎప్పటికైనా నెగ్గుతారు.
– Mahesh Kathi

వైరల్ వీడియో



రంగస్థలం సినిమాలో సమంత పాత్ర ఎలా ఉండబోతున్నదన్న ప్రశ్నకు ఈ టీజర్‌తో ఫుల్‌స్టాప్ పెట్టింది. పల్లెటూరి పాత్రలో మురిపించిన సమంతని ఎంతమంది చూశారో తెలుసా..!

Rangasthalam Latest Teaser | Introducing Samantha as Rama Lakshmi | Ram Charan | Aadhi | DSP
Total views : 6,257,024+
Published on Feb 8, 2018


మంజుల

‘మహేష్‌బాబును దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకంగా కథలు రాయాల్సిన అవసరం లేదు. అందం, అభినయం, వ్యక్తిత్వంతో ఎలాంటి కథలోనైనా అతడు ఒదిగిపోతాడు. హాలీవుడ్ స్థాయి నటుడు తెలుగు ఇండస్ట్రీలో ఉన్నందుకు, అతడు నా తమ్ముడైనందుకు గర్వపడుతున్నాను’ అని అన్నారు మంజుల. సీనియర్ నటుడు, సూపర్‌స్టార్ కృష్ణ వారసురాలిగా అరంగేట్రం చేసిన మంజుల మంచి నటిగా, విజయవంతమైన చిత్రాల నిర్మాతగా బహుముఖప్రజ్ఞాశాలిగా రాణిస్తున్నారు. తాజాగా దర్శకురాలిగా మారుతూ మంజుల తెరకెక్కించిన చిత్రం ‘మనసుకు నచ్చింది’. ఈ నెల 16న ఈ చిత్రం విడుదలకానున్నది. ఈ సందర్భంగా మంజుల పాత్రికేయులతో పంచుకున్న ముచ్చట్లివి...

మహేష్‌ను కొత్తగా చూపిస్తా!

సినిమాలో మీ మనసుకు నచ్చినదేమిటి?

• కమర్షియల్ సినిమా తీసి డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో కాకుండా నాలోని ఆలోచనలు, అభిప్రాయాలకు అక్షరరూపమిస్తూ మనసుపెట్టి నిజాయితీగా చేసిన ప్రయత్నమిది. ఆధునిక జీవన శైలి కారణంగా చిన్న చిన్న ఆనందాలకు దూరమైపోతున్నాం. ఆ జ్ఞాపకాలకు అందమైన దృశ్యరూపంగా ఈసినిమా ఉంటుంది.

ఇంతకీ ఈ సినిమా కథేమిటి?

• ఫన్ లవ్‌స్టోరీ ఇది. కథ వెనుక మరో కథతో ఆద్యంతం ఆసక్తికరంగా ఉంటుంది. ప్రకృతి సినిమాలో కీలకభూమిక పోషిస్తుంది. ప్రకృతికి సంబంధించిన సన్నివేశాలకు మహేష్‌బాబు వాయిస్ ఓవర్ అందించారు. పెళ్లి పీటల మీది నుంచి పారిపోయిన ఓ జంట చివరకు తమ మనసుకు ఏం కావాలో ఎలా తెలుసుకున్నారు? ఏ విధంగా తమ ప్రేమను గెలుచుకున్నారన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. ఆధునిక యువత మనస్తత్వాలకు దగ్గరగా ఉంటుంది.

మీ నిజజీవితంలోనుంచి స్ఫూర్తి పొందిన సంఘటనలేమైనా సినిమాలో కనిపిస్తాయా?

• అలాంటివేమి ఉండవు. పూర్తిగా కల్పిత కథ ఇది. నిజజీవితంలో నాకో లవ్‌స్టోరీ ఉంది. నా కథకు సినిమాలోని లవ్‌స్టోరికి ఎలాంటి పోలికలు ఉండవు. సూర్యోదయాలు, సూర్యస్తమయాలంటే నాకు చాలా ఇష్టం. ఇందులో కథానాయికను అలాగే చూపించాను. నాన్న, మహేష్‌బాబుతో పాటు నిజజీవితంలో నేను చూసిన వ్యక్తుల గుణగణాలను సినిమాలోని పాత్రలకు అన్వయించాను. కానీ వారిని యథాతథంగా తెరపై చూపించలేదు.

నటన, నిర్మాణం, దర్శకత్వంలో మీకు ఏది కష్టంగా అనిపించింది?

• ఈ సినిమాతో దర్శకురాలిగా నాకు పదికి పది మార్కులు పడతాయనే నమ్మకముంది. నాన్నగారి ప్రభావం.. ఇతర కారణాల వల్ల తొలుత నటనవైపు అడుగులు వేశాను. అలాగని నేనేమి గొప్ప నటిని కాదు. కానీ ఎన్ని చేసినా దర్శకత్వంపైనే నా మనసంతా కేంద్రీకృతమయ్యేది. కానీ సొంతగా కథను రాయగలనా? లేదా? అనే అపనమ్మకం ఉండేది. తెలుగు భాషపై పెద్దగా పట్టులేకపోవడంతో ఆ ప్రయత్నం ఎప్పుడూ చేయలేదు. నా హృదయంలోంచి పుట్టిన కథ ఇది. దానికే తెరరూపమిచ్చాను.

దర్శకత్వం చేస్తాననగానే నాన్న, మహేష్‌బాబు ఏమన్నారు?

• నాన్నగారు చాలా థ్రిల్‌గా ఫీలయ్యారు. దర్శకత్వ విభాగం పట్ల నాకు ఆసక్తి ఉన్న విషయం ఆయనకు తెలుసు. ఆయన నటించిన ‘తెలుగు వీర లేవరా’ సినిమాకు పనిచేశాను. కానీ నటిగా రాణించలేకపోవడంతో దర్శకత్వ ప్రయత్నాలు చేస్తున్నాననుకున్నారు. మహేష్‌బాబుతో చెప్పగానే దర్శకత్వ ఎంత కష్టమో నీకు తెలుసా? పిచ్చెక్కిందా? అని అన్నాడు. తొలుత నా మాటలు నమ్మలేదు. కథ, నాలోని విశ్వాసాన్ని చూసి అప్పుడు నమ్మాడు. ట్రైలర్ అతడికి చాలా నచ్చింది.

నాన్న, మహేష్ ఈ సినిమా చూశారా?

• లేదు. ఫస్ట్‌డే ఫస్ట్‌షో చూస్తామని అన్నారు.

మహేష్‌బాబుతో సినిమా ఎప్పుడు చేయబోతున్నారు?

• మహేష్‌బాబుతో ఓ సినిమా చేయాలనే ప్లానింగ్‌లో ఉన్నాను. ఇంతకుముందు నాన్నగారు తప్ప ఎవరూ చేయనటువంటి కొత్త కథలో మహేష్‌బాబును చూపించబోతున్నాను. స్ట్రెయిట్ సినిమానా? నాన్నగారి రీమేకా? అనే విషయం ఇప్పుడు చెప్పను. తొందరలోనే ఆ సినిమాకు సంబంధించిన వివరాల్నివెల్లడిస్తాను.

పవన్‌కల్యాణ్ కోసం కథను సిద్ధం చేసుకున్నారని ప్రచార కార్యక్రమాల్లో చెప్పారు?

• ఓ అగ్ర కథానాయకుడు సినిమాల్ని వదిలిపెట్టి ప్రజా సేవ చేయాలనే ఆలోచనతో రాజకీయాల్లోకి వస్తే ఏం జరుగుతుందనే ఇతివృత్తంతో ఓ కథను సిద్ధంచేసుకున్నాను. ఆ కథను పవన్‌కల్యాణ్‌తో చేస్తాననే నమ్మకమైతే ఉంది. అది కుదురుతుందో లేదో తెలియదు.

‘జువ్వ’ గీతావిష్కరణ


ఝాన్సీ, బొత్స సత్యనారాయణ, భరత్, వినాయక్, రంజిత్, కీరవాణి. పాలక్, త్రికోటి

సోమి ఫిలిమ్స్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం ‘జువ్వ’. రంజిత్, పాలక్ లల్వాని జంటగా నటిస్తున్నారు. త్రికోటి దర్శకుడు. భరత్ నిర్మాత. కీరవాణి సంగీతాన్నందించిన ఈ చిత్ర గీతాలు ఆదివారం హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ ఆడియోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ‘ సినిమా బాగుంటేనే కీరవాణిగారు సంగీతాన్నందిస్తారు. ఈ చిత్రం ద్వారా రంజిత్ నటుడిగా మంచి గుర్తింపును సంపాదించుకోవాలని కోరుకుంటున్నాను. ఈ చిత్రం తప్పకుండా అందరిని అలరిస్తుందనే నమ్మకం ఉంది’ అన్నారు. ‘ఈ సినిమాకు మాటల రచయిత రత్నం మంచి కథనందించాడు. ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇది. కీరవాణిగారు సంగీతాన్నందించడం అదృష్టంగా భావిస్తున్నాను. కథానుగుణంగా అద్భుతమైన బాణీలు కుదిరాయి’ అని దర్శకుడు చెప్పారు. కీరవాణి మాట్లాడుతూ ‘దర్శకుడు త్రికోటి మొదటి చిత్రం ‘దిక్కులు చూడకు రామయ్య’కు నేనే సంగీతాన్నందించాను. ‘జువ్వ’ ఓ విందు భోజనంలాంటి సినిమా. ఇందులో అన్ని రకాల ఎమోషన్స్ ఉన్నాయి. హీరోగా రంజిత్ నిలదొక్కుకుంటాడు. సినిమా తప్పకుండా పెద్ద విజయం సాధిస్తుందనే విశ్వాసం ఉంది’ అని అన్నారు. తన తొలి చిత్రానికే లెజెండరీ సంగీత దర్శకుడు కీరవాణి స్వరాల్ని అందించడం అదృష్టంగా భావిస్తున్నానని, తనకు మంచి గుర్తింపును తీసుకొచ్చే చిత్రమవుతుందని కథానాయకుడు రంజిత్ పేర్కొన్నాడు. నిర్మాత మాట్లాడుతూ ‘నేటి యువతరాన్ని మెప్పించే చక్కటి కథ ఇది. రత్నం సంభాషణలు గుర్తుండిపోయేలా వుంటాయి. మా యూనిట్‌ను ఆశీర్వదించడానికి వచ్చిన బొత్స సత్యనారాయణ దంపతులకు కృతజ్ఞతలు. ఈ నెలలోనే చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం’ అన్నారు. ఈ కార్యక్రమంలో బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, సప్తగిరి, అలీ, అడివి శేష్ తదితరులు పాల్గొన్నారు.











తిరుమల వెంకన్నకు కారు సమర్పించిన భక్తుడు

తిరుమల,నమస్తే తెలంగాణ: తిరుమల వెంకన్నస్వామికి ఓ భక్తుడు కారును విరాళంగా సమర్పించుకొన్నారు. ఏపీలోని అనంతపురానికి చెందిన వాహనాల సరఫరా సంస్థ యజమాని రూ.10 లక్షల విలువచేసే మారుతీ కారును టీటీడీ అధికారులకు అందజేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కారుకు చెందిన డాక్యుమెంట్లను, తాళాన్ని అధికారులకు అప్పగించారు. దీనిని టీటీడీ అవసరాలకు వినియోగించనున్నట్టు అధికారులు తెలిపారు.




మంగళవారం శివరాత్రి మహాపర్వదినాన్ని పురస్కరించుకుని ముస్తాబైన ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాళహస్తి దేవాలయం



శివరాత్రి పర్వదినం సందర్భంగా విద్యుత్ అలంకరణలతో వెలిగిపోతున్న శ్రీశైల మల్లికార్జున స్వామి దేవస్థానం

ప్రాణాంతక వ్యాధులపై పరిశోధన

- పలు సంస్థలకు పది ప్రాజెక్టుల అప్పగింత
- అటవీ, పర్యావరణశాఖమంత్రి జోగురామన్న వెల్లడి



సోమవారం సచివాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రి జోగు రామన్న

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రాణాంతక వ్యాధులకు తక్కువ ఖర్చుతో చికిత్స అందించడానికి రాష్ట్రంలో విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయని అటవీ, పర్యావరణశాఖల మంత్రి జోగురామన్న తెలిపారు. ఇప్పటికే వివిధ సంస్థలకు పరిశోధనా బాధ్యతలను అప్పగించినట్టు ఆయన వెల్లడించారు. సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ మధ్యంతర సమీక్ష సమావేశం సోమవారం సచివాలయంలో జరిగింది. ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్యపరీక్షలు ఏ విధంగా అందించాలనే అంశంపై అధికారులతో మంత్రి చర్చించారు. క్యాన్సర్, కిడ్నీ, మైగ్రేన్, తలసేమియా వంటి ప్రాణాంతక వ్యాధులకు తక్కువ ఖర్చుతో వైద్యాన్ని అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని ఆయన తెలిపారు. ప్రాణాంతక వ్యాధులకు మందులను కనిపెట్టడానికి వివిధ సంస్థలకు పది ప్రాజెక్టులను అప్పగించినట్టు వెల్లడించారు. పరిశోధనల కోసం ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరుచేసిందని, అందులో ఇప్పటికే రూ.25 లక్షలు విడుదలచేసినట్టు వివరించారు. వాన నీరు నేరుగా భూగర్భ జలాలలో కలిసేలా తీసుకుంటున్న చర్యల వల్ల నల్లగొండ జిల్లాలో ఫ్లోరిన్ శాతాన్ని తగ్గించవచ్చని సమావేశంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. సమావేశంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ ముఖ్యకార్యదర్శి రజత్‌కుమార్, మెంబర్ సెక్రటరీ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



సీఎస్ ఎస్కే జోషికి పుష్పగుచ్ఛం అందిస్తున్న పోలీసుజాగిలం

సవాళ్లను అప్రమత్తంగాఎదుర్కోవాలి: సీఎస్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భవిష్యత్‌లో ఎదురయ్యే అన్ని రకాల సవాళ్ల పట్ల పోలీసు విభాగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషి పిలుపునిచ్చారు. తీవ్రవాదం, ఉగ్రవాదం నుంచి వస్తున్న ముప్పును ఎదుర్కోవడంలో పోలీసులు చేస్తున్న కృషికి శిక్షణ పొందిన జాగిలాల సేవలు ఎంతగానో దోహదపడుతాయని ఆయన చెప్పారు. మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ అకాడమీలో సోమవారం 17వ బ్యాచ్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న జాగిలాల దీక్షాంత్ పరేడ్ జరిగింది. 71 జాగిలాలు, 92 డాగ్ హ్యాండ్లర్స్ పాల్గొన్న కవాతులో సీఎస్ గౌరవవందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ మహేందర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఓఎస్డీ ఎంకే సింగ్, ఐజీ నవీన్‌చంద్, పోలీసు అధికారులు గోపీకృష్ణ, జితేందర్, సందీప్ శాండిల్య, మల్లారెడ్డి, ఎం.రామకృష్ణ, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోటేటి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

నేరస్థుల సర్వే సర్క్యులర్ అమలుచేయడం లేదు

- సర్క్యులర్ ప్రతిని ధర్మాసనానికి అందించిన ఏజీ
- విచారణను ముగిస్తూ ఉత్తర్వులు జారీచేసిన హైకోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పాత నేరస్థుల సమగ్ర సర్వే కోసం జారీచేసిన సర్క్యులర్‌ను అమలుచేయడం లేదని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉమ్మడి హైకోర్టుకు నివేదించింది. ఈ విషయాన్ని ఇప్పటికే రాష్ట్ర డీజీపీ సర్క్యులర్ మెమోరాండం ద్వారా ఈ నెల 7న జారీచేసినట్టు ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి న్యాయస్థానానికి నివేదించారు. ఇందుకు సంబంధించిన సర్క్యులర్ ప్రతిని ధర్మాసనానికి అందజేశారు. ఈ వివరాలను పరిశీలించిన జస్టిస్ వీ శేషసాయి నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం.. పాత నేరస్థుల సర్వేను సవాల్‌చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై విచారణను ముగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. సర్వేకు సంబంధించిన సర్క్యులర్ అమలుచేయనప్పుడు ఈ వ్యాజ్యాలపై విచారణ అనవసరమని అభిప్రాయపడింది.



విద్యుత్ ఉద్యోగుల విభజనలో రాష్ట్ర ఉద్యోగులకు న్యాయం చేయాలని పవర్ ఎంప్లాయిస్ ఇంజినీర్స్ జేఏసీ నాయకులు సోమవారం సచివాలయంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావులకు విజ్ఞప్తిచేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రత్నాకర్‌రావు, ప్రధానకార్యదర్శి సదానందం పాల్గొన్నారు. – హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి

సీపీఎస్ రద్దుకు మార్చి 22న బహిరంగ సభ

సుల్తాన్‌బజార్: సీపీఎస్ రద్దుతోపాటు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మార్చి 22న హైదరాబాద్‌లో బహిరంగసభ నిర్వహించనున్నట్టు టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి చెప్పారు. సోమవారం నాంపల్లిలోని కార్యాలయంలో జరిగిన టీఎన్జీవో కేంద్ర కమిటీ కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు ఆయన వెల్లడించారు. సీపీఎస్ రద్దు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఏప్రిల్ ఐదు నుంచి ఎనిమిది వరకు మద్రాసులో నిర్వహించే ఏఐఎస్‌జీఈఎఫ్ సమావేశాల్లో ఉద్యోగులు అధికసంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తిచేశారు. టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ఎం రాజేందర్, సహాధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, మహిళా చైర్‌పర్సన్ రేచల్ తదితరులు పాల్గొన్నారు.

జేఎఫ్‌సీ లోగో ఆవిష్కరించిన పవన్

తొలిసారిగా భేటీ అయిన జేఎఫ్‌సీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏపీ విభజన అంశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రకటనలు, నిధుల కేటాయింపులపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఏర్పాటుచేసిన సంయుక్త నిజ నిర్ధారణ కమిటీ (జేఎఫ్‌సీ) లోగో విడుదలైంది. ట్విట్టర్ ఆకౌంట్‌లో జేఎఫ్‌సీ లోగోను సోమవారం సాయంత్రం ఆయన ఆవిష్కరించారు. లోగోలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విభజనను సూచిస్తూ రెండురాష్ట్రాల మ్యాప్‌లను పొందుపర్చారు. ఎగువన తెలంగాణ, దిగువన ఏపీ ఉండగా మధ్యలో విభజనను సూచిస్తూ జేఎఫ్‌సీ అక్షరాలున్నాయి. అంతకుముందు నిజ నిర్ధారణ కమిటీ సభ్యులైన మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ లోక్‌సత్తా కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ భేటీలో ఏపీ సీపీఐ కార్యదర్శి రామకృష్ణ కూడా పాల్గొన్నారు. రెండు రాష్ట్రాల విభజన సమస్యలపై ఈ కమిటీ నిజ నిర్ధారణ చేయనున్నది.

కాళేశ్వరం, భగీరథ.. అద్భుతాలు

మొదటిపేజీ తరువాయి...

గవర్నర్.. సామాజిక తెలంగాణే లక్ష్యంగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ముందుకు సాగుతున్నారని ప్రశంసించారు. 'తెలంగాణలో మంచి ప్రభుత్వం ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ పథకాలు అద్భుతం. తెలుగు తన జీవన గమనాన్ని మార్చుకున్నదని తెలుగు మహాసభల సందర్భంగా సీఎం కేసీఆర్ చెప్పిన మాటలు అందరినీ ఆలోచింపజేశాయి' అని ఆయన అన్నారు. మరోవైపు రాజేంద్రనగర్‌లోని టీఎస్ఐపార్డ్ (తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ)లో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న కేంద్రమంత్రి రాంకృపాల్‌యాదవ్‌కు రాష్ట్రంలో అమలవుతున్న వివిధ కేంద్ర పథకాల పురోగతిని అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఉపాధి హామీ, పీఎంజీఎస్‌వై, రూర్బన్, డీడీయూజీకేవై, టీఆర్ఐజీపీ, పింఛన్ల పంపిణీ తదితర అంశాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా రాంకృపాల్ యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణలో గ్రామీణాభివృద్ధిశాఖ కార్యక్రమాల అమలు బాగున్నదని మెచ్చుకున్నారు. మరింత ఉత్సాహంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. హరితహారంలో నాటిన మొక్కల మనుగడ రేటు 70% వరకు ఉండటంపై కేంద్రమంత్రి సంతృప్తి వ్యక్తంచేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ఉపాధిహామీ లక్ష్యాన్ని 16 కోట్ల పని దినాలకు పెంచాలని, రూ.750 కోట్ల మెటీరియల్ కాంపొనెంట్ త్వరలో విడుదలచేయాలని కోరారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన ద్వారా యువతకు పెద్దఎత్తున శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ పథకం లక్ష్యాన్ని మరింత పెంచాలని సూచించారు. 2003-04లో పొరపాటు నివేదికవల్ల రాష్ట్రానికి దక్కకుండాపోయిన 1230 కిలోమీటర్ల రహదారుల గురించి గుర్తుచేశారు. రూ.800 కోట్ల విలువైన రహదారుల నిర్మాణానికి పీఎంజీఎస్‌వై-2 కింద అనుమతి కోరారు. అలాగే కనీసం జిల్లాకు ఒక్కటైనా రూర్బన్ క్లస్టర్ మంజూరుచేయాలని కోరుతూ కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేశారు.

గ్రామీణ ప్రాంతాల ప్రజల కనీస అవసరాలు తీర్చాలి

ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ప్రధానమంత్రి ముద్రా యోజన, ప్రధానమంత్రి సడక్‌యోజన, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం వంటి ప్రభుత్వ పథకాల ద్వారా స్థిరమైన ఉపాధి అవకాశాలను కల్పిస్తూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆహారం, వస్త్రాలు, గృహవసతిని అందించవలసిన అవసరం ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, భూవనరుల శాఖ సహాయ మంత్రి రాంకృపాల్‌యాదవ్ అన్నారు. హైదరాబాద్ జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ సంస్థ ఆధ్వర్యంలో 'గ్రామీణాభివృద్ధికోసం చిన్న వ్యాపార సంస్థలకు ఆర్థిక సహాయం' అనే అంశంపై శిక్షణా కార్యక్రమాన్ని కేంద్రమంత్రి సోమవారం రాజేంద్రనగర్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పుణెలోని 'సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ అండ్ ట్రైనింగ్ ఇన్ అగ్రికల్చర్ బ్యాంకింగ్ (సీఐసీటీఏబీ) కూడా సహకరిస్తున్నది. ఈ నెల 16 వరకు కొనసాగే ఈ శిక్షణ కార్యక్రమంలో శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌లతోపాటు భారతదేశం నుంచి 35 మంది పాల్గొంటున్నారు. నేషనల్ ట్రైనింగ్ పోగ్రామ్ ఆన్ సోషల్ ఆడిట్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ స్కీమ్, వాటర్ రిసోర్సెస్ ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్‌కు చెందిన శిక్షణ కార్యక్రమాలకు హాజరవుతున్న 100 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రాంకృపాల్ యాదవ్ మాట్లాడుతూ.. 2022 నాటికి 'న్యూఇండియా'ను సాకారం చేసే కృషిలో భాగంగా ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం కోసం వ్యవసాయం పైనా, నిరుద్యోగులైన గ్రామీణ ప్రాంతాల యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలను కల్పించడం కోసం, గ్రామీణ అభివృద్ధి, నాణ్యమైన మౌలిక సదుపాయాలను అందించడం కోసం విద్య, ఆరోగ్య సంరక్షణలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఎన్ఐఆర్డీపీఆర్ డైరెక్టర్ డాక్టర్ డబ్ల్యూఆర్ రెడ్డితోపాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి ఎన్ఐఆర్డీపీఆర్ ప్రాంగణంలో ఉన్న రూరల్ టెక్నాలజీ పార్క్‌ను సందర్శించారు. ఒక ఆధునిక మినీ ట్రైనింగ్ -కం- కాన్ఫరెన్స్ హాల్‌ను, హైడ్రోపానిక్స్ యూనిట్, సౌరశక్తితో పనిచేసే మూడు కిలోవాట్ల విద్యుత్ ఉత్పాదక యూనిట్‌ను ప్రారంభించారు. 'సూర్యమిత్ర' శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్నవారితో మంత్రి మాట్లాడి.. పాఠ్యాంశాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సోలార్ టెక్నీషియన్ల కొరత చాలా ఉందని, ఈ నేపథ్యంలో జీయూటీఎస్ సహకారంతో ఎన్ఐఆర్డీపీఆర్ శిక్షణ నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం సోలార్ డీ హైడ్రేషన్ అండ్ కూలింగ్ టెక్నాలజీ యూనిట్, పుట్టగొడుగుల సేద్య విభాగం, తేనే శుద్ధి విభాగం, ఆదివాసీ ఆభరణాల విభాగం, వేప నూనె సంగ్రహణ విభాగం, కేక్ తయారీ విభాగాలను సందర్శించారు. గ్రామీణ ప్రాంత యువజనులకు ఉపాధి అవకాశాలను పెంపొందించడంలో రూరల్ టెక్నాలజీ పార్క్ కృషిని కేంద్రమంత్రి అభినందించారు. ఇక్కడ చేపడుతున్న కార్యక్రమాలను దేశవ్యాప్తంగా విస్తరించేందుకు కేంద్రమంత్రితోను, కార్యదర్శితోను చర్చిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఐఆర్డీపీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్, హెడ్ ఇంచార్జి డాక్టర్ రమేశ్ శక్తివేల్, సీనియర్ కన్సల్టెంట్ మహమ్మద్ ఖాన్, ప్రాజెక్టు ఇంజినీర్ బీ ఎన్ మణి తదితరులు పాల్గొన్నారు.



సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న కేంద్రమంత్రి రాంకృపాల్‌యాదవ్, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

ముస్లిం సమాజాన్ని చీల్చేందుకు కుట్ర

- మోదీకి తొత్తుగా మారిన నద్వీ
- దారుస్సలాం బహిరంగసభలో ఒవైసీ



ఆదివారం రాత్రి దారుస్సలాంలో జరిగిన బహిరంగసభలో పాల్గొన్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్రం కనుసన్నల్లో నడుస్తూ, ప్రధాని మోదీకి తొత్తులుగా మారిన కొందరు నేతలు ముస్లిం సమాజాన్ని చీల్చేందుకు కుట్రలు చేస్తున్నారని అఖిల భారత మజ్లిసే ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. ముస్లిం పర్సనల్‌లా బోర్డు బహిష్కృత నేత మౌలానా సల్మాన్ నద్వీ రాజకీయలబ్ధి కోసమే తంటాలు పడుతున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లో మూడురోజులపాటు జరిగిన ఏఐఎంపీఎల్‌బీ 26వ ప్లీనరీ సమావేశాల ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి మజ్లిస్ పార్టీ కార్యాలయం దారుస్సలాం గ్రౌండ్‌లో జరిగిన భారీ బహిరంగసభలో అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడారు. ట్రిపుల్ తలాక్ పేరుతో ఇప్పటికే ముస్లింలకు సమస్యలు సృష్టిస్తున్న కేంద్రం ఇప్పుడు బాబ్రీ మసీదును లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. బాబ్రీమసీదు విషయంలో రాజీపడబోమని ముస్లిం పర్సనల్‌లా బోర్డు నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ఇస్లామిక్ చట్టాల పరిరక్షణకే ముస్లిం పర్సనల్‌లా బోర్డు పనిచేస్తున్నదని అధ్యక్షుడు మౌలానా రాబే హుస్సేన్ నద్వీ స్పష్టం చేశారు. బోర్డు ఉపాధ్యక్షుడు మౌలానా ఫక్రుద్దీన్ అష్రఫ్ అల్ జిలానీ, ప్రధాన కార్యదర్శి మౌలానా వలీ రహమానీ తదితరులు మాట్లాడారు.

పాత ఎరువులకు పాత ధరే!

వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ నెల 2వ తేదీకి పూర్వం స్టాక్‌వున్న ఎరువులను పాత ఎమ్మార్పీకే విక్రయించాలని, కొత్త ధరకు విక్రయిస్తే డీలర్ల, ఎరువుల దుకాణాల లైసెన్స్‌లను రద్దుచేస్తామని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి హెచ్చరించారు. ఈ నెల 2 నుంచి కేంద్రప్రభుత్వం ఎరువుల ధరలను పెంచిన నేపథ్యంలో కలెక్టర్లు, అధికారులకు సోమవారం లేఖరాశారు.

'ధరణి' వెబ్‌సైట్‌పై కసరత్తు ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని భూముల సమగ్ర సమాచారంతో కూడిన 'ధరణి' వెబ్‌సైట్ రూపకల్పన పనులు మొదలయ్యాయి. ఏ విధంగా వెబ్‌సైట్‌ను రూపొందించాలి, సమాచారాన్ని ఎలా నిక్షిప్తం చేయాలన్న దానిపై సోమవారం సీసీఎల్‌ఏలో సమావేశం జరిగింది. వెబ్‌సైట్‌ను రూపొందించే సంస్థకు గ్రామాలవారీగా వస్తున్న సమాచారాన్ని ఈ నెల 14వ తేదీ నుంచి అప్పగించనున్నారు. కంప్యూటరీకరించిన డేటాను తహసీల్దార్లందరూ మరోసారి సరిచూసుకొని పంపించాలని సూచించారు. 'ధరణి వెబ్‌సైట్ రూపొందించే బాధ్యతలు తీసుకున్న ఐఎఫ్ఎల్ సంస్థతో ఎన్ఐసీ, సీసీఎల్ఏ అధికారులు నిత్యం సమన్వయం చేసుకుంటారు.

ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలు అసమంజసం

- ఆయన మాటలు మాదిగలను మభ్యపెట్టేలా ఉన్నయ్
- ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి



శంషాబాద్: ఎస్సీ వర్గీకరణపై మాదిగలను మభ్యపెట్టేలా ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించడం సమంజసం కాదని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ కూతురు వివాహానికి వచ్చిన వెంకయ్యనాయుడు ఎస్సీ వర్గీకరణ పక్కా అనడంపై రవి తీవ్రంగా స్పందించారు. శంషాబాద్‌లోని ఓ హోటల్‌లో ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ సమావేశాల్లో ఎన్డీయే ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై చర్చకు అనుమతించలేదని, ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా పార్లమెంట్‌లో తక్షణమే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం టీఆర్ఎస్ మాత్రమే సరైనమార్గంలో ఉన్నదని, ప్రధాని మోదీకి కూడా లేఖ రాసిందని చెప్పారు. ఈ నెల 28న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాదిగ యూత్ జేఏసీ సదస్సు నిర్వహిస్తున్నట్టు పిడమర్తి రవి వెల్లడించారు.



సోమవారం మహబూబాబాద్ జిల్లా కురవిలో భద్రకాళి సమేత శ్రీవీరభద్రస్వామి కల్యాణ మహోత్సవానికి ఊరేగింపుగా వస్తున్న వీరభద్రీయ వంశీయులు

పురుషోత్తంరెడ్డికి మరిన్ని అక్రమాస్తులు

- పెండ్లి సమయంలో పెద్దకూతురి పేరిట గిఫ్ట్‌డీడ్, ఆభరణాలు
- బినామీ రికార్డులను పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు
- హైకోర్టును ఆశ్రయించిన పురుషోత్తంరెడ్డి, కుటుంబసభ్యులు



బంగారు ఆభరణాలతో పురుషోత్తంరెడ్డి పెద్ద కూతురు విదితారెడ్డి (ఫైల్)

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏసీబీ అధికారుల కండ్లుగప్పి తప్పించుకు తిరుగుతున్న హెచ్ఎండీఏ ప్రణాళికా విభాగం డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి అక్రమాస్తులు ఒక్కొక్కటి బయట పడుతున్నాయి. సోమవారం మరో రూ.పది కోట్ల విలువజేసే ఆస్తులు బయటపడ్డాయి. ప్రభుత్వం ఇప్పటికే ఆయనను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. మూసాపేట రాజీవ్‌గాంధీనగర్‌లోని పారిశ్రామికవాడలో రూ. మూడున్నర కోట్ల విలువజేసే భవనాన్ని పురుషోత్తంరెడ్డి తన పెద్ద కూతురికి గిఫ్ట్‌గా ఇచ్చినట్టు అధికారులు గుర్తించారు. పురుషోత్తంరెడ్డికి ఇద్దరు కుమార్తెలు కాగా, పెద్ద కూతురు విదితారెడ్డి పెండ్లి సందర్భంగా కూతురికి ఇచ్చిన వజ్రాలు, బంగారు ఆభరణాలు వియ్యంకుడైన రాధాచరణ్‌రెడ్డి కార్యాలయంలో సోమవారం బయటపడ్డాయి. కూతురికి గిఫ్ట్‌గా ఇచ్చిన ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు, బంగారు ఆభరణాలను ఏసీబీ అధికారులు సీజ్ చేశారు. ఈ ఆస్తులు కుటుంబసభ్యుల పేర్లతోపాటు బినామీ పేర్లతో ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. తనను అరెస్టు చేసి వేధించే అవకాశమున్నందున బెయిల్ మంజూరు చేయాలని పురుషోత్తంరెడ్డి సోమవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పురుషోత్తంరెడ్డి బామ్మర్ది శ్రీనివాస్‌రెడ్డి, అల్లుడు గడ్డం నిపుణ్‌రెడ్డి కూడా తమను అనవసరంగా వేధిస్తున్నారని వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు.

లైసెన్స్ రాజ్ మళ్లీ వస్తున్నట్లుంది!

కేంద్ర బడ్జెట్‌పై అరవింద్ పనగరియా తీవ్ర విమర్శలు

దేశంలో ఆశావాదం అంతరించిపోయేలా ఉందంటూ ఆందోళన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:

నీతి ఆయోగ్ మాజీ వైస్ చైర్మన్ అరవింద్ పనగరియా.. ఇటీవలి కేంద్ర బడ్జెట్‌పై ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్ తీరును తీవ్రంగా విమర్శించారు. ఈ బడ్జెట్ 1991కి ముందు దేశంలో ఉన్న 'లైసెన్స్ రాజ్' రక్షణాత్మక విధానాలకు అద్దం పడుతున్నదని అభిప్రాయపడ్డారు. ఆశావాదం అంతరించిపోయి.. నిరాశావాదం పెచ్చుమీరేలా ఉందంటూ ఆందోళన వెలిబుచ్చారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2018-19)గాను ఈ నెల 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. దీనిపై 'ఎకనామిక్ టైమ్స్'కు రాసిన ఓ వ్యాసంలో పనగరియా తనదైన శైలిలో స్పందించారు. 'గతేడాది డిసెంబర్‌లో చాలావరకు ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం కస్టమ్ సుంకాలను పెంచింది. అయినప్పటికీ ఈ నిర్ణయం దేశ ఆర్థిక వ్యవస్థలోని ఆశావాదానికి ఇబ్బంది కలిగించలేదు. కానీ, బడ్జెట్‌లో పతంగులు, పాదరక్షల నుంచి సెల్యులార్ మొబైల్ ఫోన్లు, మోటార్ వాహనాల వరకు దాదాపు అన్ని రకాల ఉత్పత్తులపై సుంకాలను పెంచుతూ ప్రతిపాదనలు చేశారు. ఇప్పుడు మాత్రం ఈ నిర్ణయం ఆశావాదాన్ని దెబ్బతీస్తున్నది' అన్నారు. 'నిజానికి, రెవెన్యూ కార్యదర్శి హస్ముఖ్ అధియా.. ఈ సుంకాల విధింపు రెవెన్యూ కోసం కాదని స్పష్టం చేశారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లకు రక్షణ కల్పించడానికేనని వివరణ ఇచ్చారు. కానీ అలా కనిపించడం లేదు' అన్నారు. మరోవైపు పనగరియాపై ఆర్ఎస్ఎస్ అనుబంధ విభాగమైన స్వదేశీ జాగరణ్ మంచ్‌కు చెందిన అశ్విని మహాజన్, బీజేపీ ఎంపీ సుబ్రమణ్యన్ స్వామి విరుచుకుపడ్డారు. పనగరియా వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయని, 1991కి ముందు పరిస్థితులతో నేటి పరిస్థితులను అంచనా వేయడం సరికాదని మహాజన్ అన్నారు. ప్రపంచ దేశాలు రక్షణాత్మక ధోరణులను అవలంభించినప్పుడు భారత్ కూడా అదే బాటలో నడవాల్సిందేనన్న ఆయన కుంటుబడిన ఎంఎస్ఎంఈలకు బడ్జెట్ బాసటగా నిలిచిందన్నారు. రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)నూ పనగరియా గతంలో వ్యతిరేకించినట్లు చెప్పారు. ఇక స్వామి మాట్లాడుతూ నీతీ ఆయోగ్ వైస్ చైర్మన్ పదవి నుంచి పనగరియాను ప్రభుత్వం తీసేయలేదని, ఆయనంతట ఆయనే తప్పుకున్నారని, అయినప్పటికీ ప్రభుత్వంపై ఎందుకీ ఆశ్చర్యకర విమర్శలో అర్థం కావడం లేదన్నారు. నీతి ఆయోగ్ వైస్ చైర్మన్‌గా పనగరియా తగిన వ్యక్తి కాదన్న ఆయన పనగరియా ఓ విదేశీ వ్యక్తి అని భారతీయ పరిస్థితులపై ఎంతమాత్రం అవగాహన లేదన్నారు.




పారిశ్రామికోత్సాహం

- డిసెంబర్‌లో ఐఐపీ 7.1 శాతంగా నమోదు
- తయారీ, క్యాపిటల్ గూడ్స్ రంగాల్లో భారీగా వృద్ధిరేటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:

దేశంలో పారిశ్రామికోత్సాహం ఉరకలెత్తింది. తయారీ, క్యాపిటల్ గూడ్స్, నాన్-డ్యూరబుల్ కన్జ్యూమర్ గూడ్స్ రంగాల ప్రదర్శన గొప్పగా నమోదవడంతో పారిశ్రామికోత్పత్తి సూచీ గతేడాది డిసెంబర్‌లో 7.1 శాతానికి ఎగబాకింది. అంతకుముందు ఏడాది డిసెంబర్‌లో కేవలం 2.4 శాతంగానే ఉందని సోమవారం కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్‌వో) తెలిపింది. అయితే గతేడాది నవంబర్‌తో పోల్చితే మాత్రం తక్కువే. నవంబర్‌లో 8.8 శాతంగా నమోదైంది. మొదట్లో 8.4 శాతంగానే ఉన్నట్లు ప్రకటించినా.. దాన్ని ఆ తర్వాత 8.8 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. కాగా, తాజా ఐఐపీ వృద్ధిలో తయారీ రంగమే కీలకంగా నిలిచింది. మొత్తం ఐఐపీలో 77.63 శాతం వాటా కలిగిన ఉత్పాదక రంగం.. నిరుడు డిసెంబర్‌లో 8.4 శాతం పుంజుకున్నది. 2016 డిసెంబర్‌లో 0.6 శాతం వృద్ధికే పరిమితమైంది. ఇక క్యాపిటల్ గూడ్స్ సూచీ కూడా గతంతో పోల్చితే 6.2 శాతం నుంచి 16.4 శాతానికి ఎగిసింది. ఫాస్ట్ మూవింగ్ కన్జ్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ)లో ప్రధానమైన కన్జ్యూమర్ నాన్-డ్యూరబుల్స్ రంగం కూడా 0.2 శాతం నుంచి 16.5 శాతానికి ఎగబాకింది. ఇదిలావుంటే గతేడాది ఏప్రిల్-డిసెంబర్‌లో పారిశ్రామికోత్పత్తి 3.7 శాతం పుంజుకున్నది. అంతకుముందు ఏడాది ఇదే వ్యవధిలో వృద్ధిరేటు 5.1 శాతంగా ఉన్నట్లు సీఎస్‌వో తెలియజేసింది.



స్వల్పంగా తగ్గిన ద్రవ్యోల్బణం

- జనవరిలో 5.07 శాతంగా నమోదు
- కూరగాయలు, పండ్లు, ఇంధన ధరలు తగ్గుముఖం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: చిల్లర ద్రవ్యోల్బణం గత నెలలో తగ్గింది. కూరగాయలు, పండ్లు, ఇంధనం ధరలు దిగిరావడంతో జనవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.07 శాతంగా నమోదైంది. వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ఈ ద్రవ్యోల్బణం గణాంకాలు డిసెంబర్‌లో 17 నెలల గరిష్ఠ స్థాయిలో 5.21 శాతంగా ఉంటే, నిరుడు జనవరిలో 3.17 శాతంగా ఉంది. ఈ మేరకు సోమవారం కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్‌వో) తెలియజేసింది. డిసెంబర్‌తో పోల్చితే జనవరిలో కన్జ్యూమర్ ఫుడ్స్ ధరలు 4.96 శాతం నుంచి 4.7 శాతానికి, కూరగాయల ధరలు 29.13 శాతం నుంచి 26.97 శాతానికి, పండ్ల ధరలు 6.63 శాతం నుంచి 6.24 శాతానికి తగ్గుముఖం పట్టాయి. ఇంధన ధరలు కూడా 7.90 శాతం నుంచి 7.73 శాతానికి శాంతించాయి. ఎంపిక చేసిన గ్రామాల నుంచి తపాలా శాఖ ద్వారా, ఎంచుకున్న పట్టణాల నుంచి ఎన్ఎస్ఎస్‌వో ఫీల్డ్ ఆపరేషన్స్ డివిజన్ ద్వారా ధరల వివరాలను సీఎస్‌వో సేకరించింది.

కోలుకున్న సూచీలు

294 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్ • పది సెషన్లలో రెండోసారి లాభపడ్డ మార్కెట్లు

ముంబై, ఫిబ్రవరి 12: సార్వత్రిక బడ్జెట్, అమెరికా దెబ్బకు డీలా పడిన దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ కోలుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల పవనాలతో మదుపరులు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. ఫలితంగా ఈ వారం ప్రారంభ రోజు సూచీలు భారీగా లాభపడ్డాయి. కార్పొరేట్ల ఆర్థిక ఫలితాలు అంచనాలకుమించి నమోదు చేసుకోవడం, రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గనున్నదన్న అంచనాలు మార్కెట్లకు ఊతమిచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్లకు తోడు దేశీయ పరిణామాలు కూడా తోడవడంతో సూచీలు భారీగా లాభపడటానికి దోహదపడినట్లు మార్కెట్ విశ్లేషకులు అంచనావేస్తున్నారు. గడిచిన ఆరు రోజులుగా చమురు ధరలు దిగువముఖం పట్టడం, రూపాయి బలపడటం సూచీలకు మరింత కిక్కునిచ్చింది. ఇంట్రాడేలో 34,351.34 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకిన సూచీ ఒక దశలో మదుపరులు ప్రాఫిట్ బుకింగ్‌కు పాల్పడటంతో 34,115.12 కనిష్ఠ స్థాయిని తాకింది. యూరప్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూలతతో చివరకు 294.71 పాయింట్లు (0.87%) లాభపడి 34,300.47 వద్ద స్థిరపడింది. గత శుక్రవారం సూచీ 407.40 పాయింట్లు (1.18 శాతం) పడిపోయి నెల కనిష్ఠ స్థాయి 34,005.76కి జారుకున్న విషయం తెలిసిందే. ఇంట్రాడేలో 10,555.50 స్థాయిని తాకిన నిఫ్టీ..ముగిసే సమయానికి 84.80 పాయింట్లు ఎగబాకి 10,539.75 వద్ద ముగిసింది. గడిచిన పది సెషన్లలో కేవలం రెండు రోజులు మాత్రమే లాభాల్లో ముగిశాయి. మూడో త్రైమాసికానికిగాను నికర లాభం ఐదు రెట్లు పెరుగడంతో టాటా స్టీల్ షేరు ధర 4.22 శాతం లాభపడానికి కారణమైంది. టాటా కమ్యూనికేషన్స్ 1.71 శాతం, ఎల్ అండ్ టీ 1.63 శాతం లాభపడ్డాయి. వీటితోపాటు యెస్‌బ్యాంక్, పవర్‌గ్రిడ్, ఇండస్ఇండ్ బ్యాంక్, హీరో మోటోకార్ప్, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, మారుతి, ఓఎన్‌జీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, విప్రో, బజాజ్, సన్‌ఫార్మాలు 2.89 శాతం వరకు లాభపడ్డాయి. కానీ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ షేరు ధర 2.67 శాతం పతనం చెందింది. రంగాలవారీగా చూస్తే ఇంధనం(1.87 శాతం), రియల్టీ (1.73 శాతం), క్యాపిటల్ గూడ్స్(1.65 శాతం), మౌలికం(1.47 శాతం), హెల్త్‌కేర్ (1.18 శాతం), ఆటో(1.06 శాతం), మెటల్, బ్యాంకింగ్ రంగాలకు చెందిన షేర్లను కొనుగోలు చేయడానికి దేశీయ, అంతర్జాతీయ మదుపరులు ఆసక్తి చూపారు. కానీ, ఐటీ, టెక్ రంగాల్లో ప్రతికూల వృద్ధి నమోదైంది.



నేడు మార్కెట్లకు సెలవు

శివరాత్రి సందర్భంగా మంగళవారం స్టాక్ మార్కెట్లు సెలవు పాటించనున్నాయి. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్‌తోపాటు నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్, ఫారెక్స్, మనీ, బులియన్, మెటల్స్, ఆయిల్‌సీడ్స్, చక్కెర మార్కెట్లు మూసివేసివుంచనున్నారు.

వచ్చే ఆర్థిక సంవత్సరంలో

7.5% వృద్ధిరేటు

డాయిష్ బ్యాంక్ అంచనా

ముంబై, ఫిబ్రవరి 12: వచ్చే ఆర్థిక సంవత్సరంలో దేశ ఆర్థిక వృద్ధిరేటు వేగవంతమై 7.5 శాతానికి చేరుకోవడం ఖాయమని జర్మన్ బ్రోకరేజి సంస్థ డాయిష్ బ్యాంక్ తన తాజా నివేదికలో స్పష్టం చేసింది. ద్రవ్యోల్బణ సమస్యలు పెరుగుతున్నందున సమీప భవిష్యత్తులో రిజర్వు బ్యాంకు వడ్డీ రేట్లను పెంచే అవకాశాలు చాలా తక్కువగా మాత్రమే ఉన్నాయని ఆ సంస్థ పేర్కొన్నది. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి సంబంధించి ఆశావహమైన పరిస్థితులు ఉన్నాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18)లో 6.6 శాతంగా నమోదవుతుందని భావిస్తున్న స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు వచ్చే ఆర్థిక సంవత్సరంలో 7.5 శాతానికి పెరుగుతుందని అంచనా వేస్తున్నామని సోమవారం విడుదల చేసిన నివేదికలో డాయిష్ బ్యాంక్ వెల్లడించింది. దేశంలో పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ (వస్తు, సేవల పన్ను) అమలు వలన తలెత్తిన ఇబ్బందుల కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సర తొలి త్రైమాసికం చివరి (2017 జూన్ నెలాఖరు) నాటికి జీడీపీ వృద్ధిరేటు మూడేండ్ల కనిష్ఠ స్థాయికి పతనమై 5.7 శాతంగా నమోదైన విషయం విదితమే. అయితే ఈ ఇబ్బందుల నుంచి భారత ఆర్థిక వ్యవస్థ కోలుకోవడంతో రెండో త్రైమాసికం (జులై-సెప్టెంబర్)లో 6.7 శాతంగా నమోదైన జీడీపీ వృద్ధిరేటు ముమ్మందు మరింత పెరిగి మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో 7 శాతానికి, చివరి త్రైమాసికం (జనవరి-మార్చి)లో 7.5 శాతానికి చేరుకునే అవకాశం ఉందని డాయిష్ బ్యాంక్ తెలిపింది.

ఇండియన్ బ్యాంక్ లాభంలో క్షీణత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ప్రభుత్వరంగ సంస్థ ఇండియన్ బ్యాంక్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్ 31తో ముగిసిన మూడు నెలల్లో కంపెనీ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 19 శాతం క్షీణించి రూ.303.06 కోట్లకు పరిమితమైంది. నిర్వహణ ఖర్చులు పెరుగడం, మొండి బకాయిలను పూడ్చుకోవడానికి అధికంగా నిధులు వెచ్చించడం వల్లనే లాభాల్లో గండిపడిందని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. 2016-17 ఇదే కాలానికి లాభం రూ.373.48 కోట్లుగా ఉన్నది. ఆదాయం విషయానికి వస్తే రూ.4,557.25 కోట్ల స్థాయి నుంచి రూ.4,903.07 కోట్లకు ఎగబాకింది. సమీక్షకాలంలో నిర్వహణ ఖర్చులు రూ.825 కోట్ల స్థాయి నుంచి రూ.962.33 కోట్లకు పెరిగాయి. గడిచిన త్రైమాసికంలో బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ రూ.7.69 శాతం(రూ.9,595 కోట్లు) నుంచి 6.27 శాతానికి తగ్గగా, నికర ఎన్‌పీఏ 3.30 శాతానికి (రూ.4,898 కోట్లు) పరిమితమైనట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ రూ.918.12 కోట్ల నిధులను వెచ్చించింది.

విశాఖ ఇండస్ట్రీస్ లాభం 141% వృద్ధి

హైదరాబాద్, ఫిబ్రవరి 12: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.14.26 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు విశాఖ ఇండస్ట్రీస్ ప్రకటించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.5.90 కోట్ల లాభంతో పోలిస్తే 14.69 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ విక్రయాలు ఏడాది ప్రాతిపదికన 10.51 శాతం ఎగబాకి రూ.241.84 కోట్లుగా నమోదైంది.

ఈ-ట్రియో నుంచి విద్యుత్ కారు

హైదరాబాద్, ఫిబ్రవరి 12: హైదరాబాద్ కేంద్రస్థానంగా ఆటోమొబైల్ సేవలు అందిస్తున్న ఈ-ట్రియో తాజాగా ఎలక్ట్రిక్ వాహన విభాగంలోకి అడుగుపెట్టింది. వచ్చే నెలలో సెడాన్, హ్యాచ్‌బ్యాక్ రెండు రకాల మోడళ్లను విడుదల చేయబోతున్నట్లు కంపెనీ వ్యవస్థాపకుడు సత్య ప్రకటించారు. ఈ కార్లను ఉత్పత్తి చేయడానికి హైదరాబాద్‌కు అత్యంత సమీపంలో రూ.13 కోట్ల పెట్టుబడితో అసెంబ్లింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ యూనిట్‌లో ప్రతి నెల 1,500 కార్లు ఉత్పత్తి కానున్నాయి.



యూపీలో మేఘా భారీ విద్యుత్ ప్రాజెక్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశీయ ప్రైవేట్ రంగంలో తొలిసారిగా అతిపెద్ద విద్యుత్ సరఫరా వ్యవస్థను నిర్మించింది హైదరాబాద్‌కు చెందిన మేఘా ఇంజినీరింగ్. 13,220 ఎంవీఏ విద్యుత్ సరఫరా సామర్థ్యం ఉన్న ఈ పవర్ ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ ఇటీవలే జాతికి అంకితమైంది. ఉత్తరప్రదేశ్‌లోని పశ్చిమ ప్రాంతంలో విద్యుత్ సరఫరా, పంపిణీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చేపట్టిన వెస్టర్న్ యూపీ పవర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ లిమిటెడ్ (డబ్ల్యూయూపీపీటీసీఎల్)ను ఎంఈఐఎల్ (మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్) పూర్తి చేసింది. దీంతో హైదరాబాద్ కేంద్రంగా దేశ, విదేశాల్లో కార్యకలాపాలను కొనసాగిస్తున్న ఈ సంస్థ.. తాగు, సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల నిర్మాణాల్లోనే కాకుండా విద్యుత్ సరఫరా రంగంలోనూ కీలక మైలురాయిని దాటినట్లయింది. ఈ ప్రాజెక్టుతో యూపీలోని పది జిల్లాల్లో విద్యుత్ సరఫరాను మెరుగుపరుస్తుండగా, ఏడు సబ్ స్టేషన్లతోపాటు 836 సర్క్యూట్ కిలోమీటర్ల పొడవైన విద్యుత్ లైన్లను మేఘా ఇంజినీరింగ్ నిర్మించింది. 2011 మే 31న ఈ ప్రాజెక్టు పనులను ప్రారంభించిన మేఘా.. ఈ నెలలో లక్ష్యం మేరకు పూర్తి చేయడం విశేషం. కాగా, దేశంలోనే తొలిసారిగా గ్యాస్ ఆధారిత జీఐఎస్ (గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్‌స్టేషన్లు) నిర్మించిన ఘనత ఈ ప్రాజెక్టుతో మేఘా ఇంజినీరింగ్‌కు దక్కింది. జీఐఎస్‌లో సాధారణం కన్నా 65 శాతం తక్కువ ప్రాంతంలోనే ఇండోర్ పద్ధతిలో ప్రాజెక్టును నిర్మిస్తారు.



ఎస్సార్ స్టీల్ కొనుగోలుకు ఆర్సెలార్ బిడ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: అప్పుల ఊబిలో పీకల్లోతున కూరుకుపోయి దివాలా దిశగా అడుగులు వేస్తున్న దేశీయ ఉక్కు సంస్థ ఎస్సార్ స్టీల్‌ను కొనుగోలు చేసేందుకు బిడ్‌ను దాఖలు చేసినట్లు అంతర్జాతీయ ఉక్కు దిగ్గజం ఆర్సెలార్ మిట్టల్ వెల్లడించింది. ఈ బిడ్ల దాఖలుకు సోమవారమే తుది గడువు. దీంతో కార్పొరేట్ దివాలా ప్రక్రియకు అనుగుణంగా ఎస్సార్ స్టీల్‌ను కొనుగోలు చేసేందుకు లక్సెంబర్గ్ కేంద్రంగా వ్యాపారం సాగిస్తున్న ఆర్సెలార్ మిట్టల్ అనుబంధ సంస్థ ఏఎంఐపీఎల్ (ఆర్సెలార్ మిట్టల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్) బిడ్‌ను దాఖలు చేసింది. ఎస్సార్ స్టీల్ పనితీరును మెరుగుపర్చి మళ్లీ లాభాల బాటలోకి తీసుకొచ్చేందుకు అవసరమైన సమగ్ర పారిశ్రామిక ప్రణాళికను ఏఎంఐపీఎల్ తన బిడ్‌లో పొందుపర్చింది. నష్టాల్లో నడుస్తున్న ఆస్తులను కొనుగోలు చేసి వాటిని విజయ పథంలో నడపడంలో తమకు గల విస్తృత అనుభవాన్ని కూడా ఈ బిడ్‌లో వివరించినట్లు ఆర్సెలార్ మిట్టల్ గ్రూపు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. వృద్ధి పథంలో పరుగులు తీస్తున్న భారత ఉక్కు మార్కెట్లో ప్రవేశించేందుకు ఎస్సార్ స్టీల్ తమకు చక్కటి అవకాశాన్ని కల్పిస్తోందని గ్రూపు చైర్మన్, సీఈవో లక్ష్మీ మిట్టల్ పేర్కొన్నారు. దివాలా చట్టం కింద తొలి విడతలో చర్యలు చేపట్టేందుకు రిజర్వు బ్యాంకు గుర్తించిన 12 కంపెనీల్లో ఎస్సార్ స్టీల్ ఒకటి.

మాల్యాకి మరో ఎదురుదెబ్బ

బీఓసీ ఏవియేషన్ కేసులో భంగపాటు

90 మిలియన్ డాలర్లు చెల్లించాలని లండన్ హైకోర్టు ఆదేశం

లండన్/సింగపూర్, ఫిబ్రవరి 12: దేశంలోని బ్యాంకులకు వేలాది కోట్ల రూపాయల రుణాలను ఎగ్గొట్టి బ్రిటన్‌కు పారిపోయిన ప్రముఖ మద్యం వ్యాపారి విజయ్ మాల్యాకి అక్కడ మరో ఎదురుదెబ్బ తగిలింది. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌కు విమానాలను అద్దెకు ఇచ్చిన సింగపూర్ సంస్థ బీఓసీ ఏవియేషన్‌కు 90 మిలియన్ డాలర్లు చెల్లించాలని లండన్ హైకోర్టు తీర్పునివ్వడంతో మాల్యాకు భంగపాటు తప్పలేదు. భారత్‌లోని వివిధ బ్యాంకులకు దాదాపు రూ.9 వేల కోట్ల రుణాలను ఎగ్గొటిన విజయ్ మాల్యాను స్వదేశానికి అప్పగించేందుకు బ్రిటన్‌లోని వెస్ట్‌మినిస్టర్ కోర్టు ఇప్పటికే విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. 2014 సంవత్సరానికి ముందు కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌తో కుదుర్చుకున్న లీజు ఒప్పందం ప్రకారం ఆ సంస్థకు మూడు విమానాలను అద్దెకు ఇచ్చిన బీఓసీ ఏవియేషన్ అందుకు సంబంధించిన బకాయిల కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.

రాజన్న క్షేత్రం గొప్పది

స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించడం అదృష్టం

దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

వేములవాడలో ఘనంగా శివరాత్రి వేడుకలు ప్రారంభం

వేములవాడ, నమస్తే తెలంగాణ: వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం రాష్ట్రంలోనే గొప్ప శైవ క్షేత్రమని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం రాజన్న సన్నిధిలో మహా శివరాత్రి జాతర ప్రారంభం కాగా, రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివార్చన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రమేశ్‌బాబుతో కలిసి మంత్రి ప్రారంభించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరికీ శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. రాజన్న క్షేత్రానికి సీఎం కేసీఆర్‌కు అవినాభావ సంబంధం ఉందని, సీఎం వివాహం వేములవాడలోనే జరిగిందన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా దేవాలయాలను అభివృద్ధి చేస్తున్న సీఎం కేసీఆర్ వేములవాడ ఆలయాభివృద్ధికి రూ.400 కోట్లు మంజూరు చేశారన్నారు. స్వామివారి అనుగ్రహం వల్లే ఇంత గొప్ప కార్యక్రమం జరుగుతున్నదన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం తరుపున స్వామివారికి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. ఆనవాయితీ ప్రకారం టీటీడీ తరుపున స్వామివారికి జేఈవో శ్రీనివాసరాజు పట్టువస్త్రాలను సమర్పించనున్నారు.

పోటెత్తిన భక్తజనం: మూడు రోజులపాటు రాజన్న క్షేత్రంలో జరిగే శివరాత్రి వేడుకలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు రాజన్న సన్నిధికి భక్తులు పోటెత్తారు. తెలంగాణ జిల్లాలతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచీ దాదాపు లక్షన్నరకు పైగా భక్తులు వేములవాడకు చేరుకున్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కలెక్టర్ కృష్ణభాస్కర్, ఈవో దూస రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



రాజన్న సన్నిధిలో శివరాత్రి వేడుకలను ప్రారంభించి ప్రసంగిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే రమేశ్‌బాబు, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ హరికృష్ణ, కలెక్టర్ కృష్ణభాస్కర్

నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో వడగండ్ల వాన

బాసరలో ఒకరి మృతి

నిర్మల్, నమస్తే తెలంగాణ/బోధన్, నమస్తే తెలంగాణ/ముప్కాల్: నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లోని పలు చోట్ల సోమవారం రాత్రి ఈదురుగాలులు, మెరుపులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. రెండు రోజులుగా ఆకాశం మబ్బుపట్టి ఉంది. కాగా నిర్మల్ జిల్లా ముథోల్, లోకేశ్వరం, దిలావర్‌పూర్, సోన్, నిర్మల్ రూరల్ మండలాలు, మామడ, లక్ష్మణచాంద మండలాల్లో వడగండ్లవానతో పాటు అక్కడక్కడ జల్లులు పడ్డాయి. బాసర మండలం బిద్రెల్లి గ్రామంలో వడగండ్ల వానకు ఈరన్న (55)మృతి చెందాడు. చేనులో ఉండగా ఒక్కసారిగా వడగండ్లు పడటంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. నిజామాబాద్ జిల్లాలోని ముప్కాల్, ఏర్గట్ల, బాల్కొండ మండలాల్లో వడగండ్లు పడ్డాయి. కాగా సోమవారం రాత్రి ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో జల్లులు కురిశాయి. ఇప్పటికే వ్యవసాయ క్షేత్రాల్లో తవ్వి ఉడకబెట్టిన, ఆరబెట్టిన పసుపు పెద్ద మొత్తంలో ఉంది. అమ్మేందుకు మార్కెట్‌కు తీసుకొచ్చిన కందులు కుప్పలు పోసి ఉన్నాయి. ఈ దశలో వర్షాలు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



నిర్మల్ జిల్లా బాసరలోని ట్రిపుల్ ఐటీలో కురిసిన వడగండ్లు



కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం అంకోల్ కొత్త క్యాంపులో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి పోచారం

పేదవాడికి కట్టిచ్చే ఇల్లు దేవాలయంతో సమానం: మంత్రి పోచారం

బీర్కూర్: సీఎం కేసీఆర్ ఆలోచనా విధానంతోనే రాష్ట్రంలో పేదోడి కోసం డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని, పేదవాడికి కట్టిచ్చే ఇల్లు దేవాలయంతో సమానమని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఆయన కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 21నుంచి నిర్వహించే బ్రహ్మోత్సవాలపై ఆలయ కమిటీ సభ్యులు, ముఖ్యులతో చర్చించారు. అనంతరం నస్రుల్లాబాద్ మండలం అంకోల్ క్యాంపులో 26 డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు.

కాళేశ్వరానికి జాతీయ హోదా కల్పించాలి

దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

మంచిర్యాల అగ్రికల్చర్/మందమర్రి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మేడిగడ్డ కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని.. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నామని గృహ నిర్మాణ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. సోమవారం మంచిర్యాల జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. మంచిర్యాలలో దయానంద్ కేంద్రాన్ని ప్రారంభించారు. మందమర్రిలో కింద రూ. 38.75 కోట్ల వ్యయంతో చేపట్టే మిషన్ భగీరథ ట్యాంకుల నిర్మాణ పనులు ప్రారంభించారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఆయా చోట్ల మంత్రి ప్రసంగించారు. ఆయన వెంట విప్ నల్లాల ఓదెలు, ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, మంచిర్యాల, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య,పాల్గొన్నారు.

మేడారం ఆదాయం రూ. 10,17,50,363

824 గ్రాముల బంగారం, 47 కిలోల వెండి

రెడ్డికాలనీ(వరంగల్), ఫిబ్రవరి 12: మేడారం సమ్మక్క-సారక్క జాతరకు రికార్డుస్థాయిలో రూ.10,17,50,363 ఆదాయం వచ్చింది. వరంగల్ అర్బన్ జిల్లాలోని హన్మకొండ టీటీడీ దేవస్థాన ఆవరణలో లెక్కిస్తున్న హుండీల లెక్కింపు సోమవారం ముగిసింది. మొత్తం 479 హుండీల్లో 452 ఇనుప హుండీలు, 24 క్లాత్ హుండీలు, 3 ఒడి బియ్యం హుండీల లెక్కింపు పూర్తయింది. గత మేడారం జాతర హుండీల ఆదాయం రూ.8 కోట్ల 91 లక్షలు రాగా ఈసారి రికార్డుస్థాయిలో రూ.10,17,50,363 వచ్చాయి. కోటి మందికిపైగా వచ్చిన భక్తులు 824 గ్రాముల బంగారం, 47 కిలోల 470 గ్రాముల వెండితో పాటు 25 దేశాలకు చెందిన విదేశీ కరెన్సీని భక్తులు సమర్పించారు. హుండీ లెక్కింపును డిప్యూటీ కమిషనర్ రమేశ్‌బాబు పర్యవేక్షించారు.



డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావును పరామర్శిస్తున్న మంత్రి ఈటల

కరీంనగర్ డెయిరీ చైర్మన్‌కు మంత్రి ఈటల పరామర్శ

కోనరావుపేట: ఇటీవల మాతృ వియోగం చెందిన కరీంనగర్ డెయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వర్‌రావును ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ సోమవారం పరామర్శించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మల్కపేటలోని ఆయన స్వగ్రామంలోని రాజేశ్వరరావు ఇంటికి చేరుకున్నారు. అనంతరం రాజేశ్వరరావు తల్లి సుందరమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయనతోపాటు కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, విజయ డెయిరీ రాష్ట్ర చైర్మన్ భూంరెడ్డి, జెడ్పీటీసీలు తోట ఆగయ్య, శరత్‌రావు కూడా పరామర్శించారు.



నల్లగొండ జిల్లా వేములపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కాదు కాదు.. ఎంపీగానే పోటీచేస్తా

మాటమార్చిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

వేములపల్లి: ప్రాణం ఉన్నంత వరకు నల్లగొండ అసెంబ్లీ స్థానాన్ని వదిలేది లేదని నాలుగు రోజుల క్రితం ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, నల్లగొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి అంతలోనే మాట మార్చారు. తాను నల్లగొండ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తానని సోమవారం వేములపల్లిలో జరిగిన మండల కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో మిర్యాలగూడ, నల్లగొండ అసెంబ్లీ స్థానాలను యువకులకు కేటాయించాలని అధిష్ఠానాన్ని కోరుతానన్నారు. వారం రోజులు తిరుగక ముందే విభిన్న ప్రకటనలు చేసిన కోమటిరెడ్డి తీరు ఆ పార్టీ క్యాడర్‌ను అయోమయానికి గురి చేస్తున్నది. నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గాన్ని వీడేది లేదని చెప్పిన ఆయన.. తిరిగి నల్లగొండ పార్లమెంటుకు పోటీ చేస్తానని ప్రకటించడంతో క్యాడర్ విస్మయానికి గురైంది.

యాసతోనే స్వరాష్ట్రం సాధ్యమైంది

- సామాజిక తెలంగాణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పాలన
- మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టులు అద్భుతం
- మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు
- సిరిసిల్లలో రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కార ప్రదానోత్సవం

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ: 'యాసతోనే తెలంగాణ సాధనకు మార్గం సుగమమైంది.. బడుగు, బలహీన అణగారిన వర్గాల అభివృద్ధి, సామాజిక తెలంగాణ దిశగా ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన సాగుతున్నది.. తెలంగాణలో మంచి ప్రభుత్వం ఉంది.. కాళేశ్వరం, మిషన్ భగీరథ పథకాలు అద్భుతం' అని మహారాష్ట్ర గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు కొనియాడారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కార ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2017 సంవత్సరానికి గాను నల్లగొండ జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు సుంకిరెడ్డి నారాయణరెడ్డికి రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారాన్ని సీహెచ్ విద్యాసాగర్‌రావు ప్రదానం చేశారు. అనంతరం విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ సాహిత్యానికి తెలంగాణ ఆయువు పట్టనీ, అందులోనూ సిరిసిల్ల ప్రాంతానికి ప్రత్యేక స్థానం ఉన్నదన్నారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత సీ నారాయణరెడ్డి మొదలుకొని అనేకమంది కవులు, కళాకారులు, సాహితీవేత్తలను అందించిన చరిత్ర ఈ నేలకు ఉన్నదన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా తెలుగు తన జీవన గమనాన్ని మార్చిందని సీఎం కేసీఆర్ చెప్పిన మాట అందరిని ఆలోచింపచేసిందని గుర్తుచేశారు. భాష జీవన గమనాన్ని ఎలా మారుస్తుందన్న ప్రశ్న ప్రతి ఒక్కరి మదిలో మెదిలిందనీ, మనిషిని ఉన్నతంగా మార్చేందుకు భాష ఎంతగానో దోహదపడుతుందనడానికి సీఎం కేసీఆర్ చెప్పిన మాటలే నిదర్శనమన్నారు. భాష వల్ల స్థానిక పరిస్థితులు, సామాజిక దృక్పథం బయటకు వస్తుందని చెప్పారు. 300 ఏండ్ల క్రితం మన దేశ జీడీపీ 27.03 ఉండగా, 70 శాతం ఎగుమతులు దేశం నుంచే జరిగిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. మన దేశంలో అద్భుతమైన కార్మిక, యువశక్తి ఉన్నదన్నారు.



సిరిసిల్లలో రచయిత సుంకిరెడ్డి నారాయణరెడ్డికి రంగినేని ఎల్లమ్మ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు

రంగినేని సేవలు స్ఫూర్తిదాయకం..

సామాజిక సేవలో రంగినేని మోహన్‌రావు ట్రస్టు సేవలు స్ఫూర్తిదాయకమని మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు ప్రశంసించారు. తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసిన రోజుల్లో నిరాశ్రయులైన పిల్లలను ట్రస్టుకు అప్పగిస్తే మోహన్‌రావు వారిని పెంచి పెద్ద చేసి, ప్రయోజకులను చేశారని కొనియాడారు. ఆ పిల్లల తరపున కృతజ్ఞతలు తెలుపడం కోసమే తాను ఇక్కడికి వచ్చినట్టు తెలిపారు. సమాజాన్ని శుద్ధి చేసేందుకు సాహిత్యకారులకు తన తల్లి పేరుమీద పురస్కారాలు అందించి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ కృష్ణ భాస్కర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్, పురస్కార కమిటీ చైర్మన్ మోహన్‌రావు, కన్వీనర్ మద్దికుంట లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలాలతో అలుగులు పారిస్తాం

- మార్చి మొదటి వారంలో రిజర్వాయర్లు నింపుతాం
- రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ: దేవాదుల ప్రాజెక్టు ద్వారా మార్చి మొదటి వారంలో సిద్దిపేట జిల్లాలోని లద్నూరు రిజర్వాయర్, జనగామ జిల్లాలోని కన్నెబోయిన గూడెం రిజర్వాయర్లను నింపి.. ఎండాకాలంలో గోదావరి జలాలతో చెరువులు నింపి అలుగులు పారిస్తామని భారీనీటి పారుదలశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం లద్నూరు రిజర్వాయర్‌ను భువనగిరి ఎంపీ బూర నర్సయ్యగౌడ్, జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, మండలి విప్ బొడకుంటి వెంకటేశ్వర్లుతో కలిసి సందర్శించారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న పనుల విషయంలో అక్కడే దేవాదుల ప్రాజక్టు అధికారులతో సమీక్ష జరిపి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు, ఏజెన్సీలకు అదేశాలు జారీచేశారు. అంతకు ముందు చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు మండలాల్లో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మద్దూరు మండల పర్యటన భాగంగా సలాఖ్‌పూర్ పంచాయతీ పరిదిలో రోడ్డుకు ఇరువైపులా హరితహారంలో భాగంగా నాటిన మొక్కలకు పాదులు చేస్తున్న హరిత సైనికుడు ఏసోబును చూసి మంత్రి కారు దిగారు. ఏసోబుకు రూ.2వేలు ఇవ్వడంతోపాటు శాలువా కప్పి సన్మానించారు. పక్కనే ఉన్న ఎంపీ బూర నర్సయ్యగౌడ్ వెయ్యి రూపాయలు ఇచ్చారు.



సలాఖ్‌పూర్‌లో హరిత సైనికుడు ఏసోబును సన్మానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

టీఆర్ఎస్‌లోకి వలసల జోరు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్ఎస్‌లోకి రోజురోజుకు వలసలు పెరుగుతున్నాయి. సోమవారం కూడా పెద్ద ఎత్తున చేరారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం నేరళ్లపల్లి గ్రామంలోని నేలబండతండాకు చెందిన 15 మంది గిరిజనులు కాంగ్రెస్, టీడీపీలకు రాజీనామా చేసి హైదరాబాద్‌లో మంత్రి లక్ష్మారెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం ముచ్కూర్ పీఏసీఎస్ డైరెక్టర్ మలావత్ వెంకటేశ్‌నాయక్, బంజార భేరి మండల కన్వీనర్ మలావత్ కిషన్ నాయక్ తదితరులు హైదరాబాద్‌లో మిషన్‌భగీరథ వైస్‌చైర్మన్, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్‌లో చేరారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం ఆలూర్ గ్రామానికి చెందిన నాయీబ్రాహ్మణులు టీఆర్ఎస్‌కు మద్దతు పలుకుతూ చేసిన ఏకగ్రీవ తీర్మాన ప్రతిని హైదరాబాద్‌లో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి అందజేసి పార్టీలో చేరారు. వీరితోపాటు స్మార్ట్ యూత్ క్లబ్ సభ్యులు కూడా ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో గులాబీ గూటికి చేరారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన 200 మంది టీడీపీ, కాంగ్రెస్ నాయకులు టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గొంగిడి మహేందర్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు.







టీఆర్ఎస్‌లో చేరిన మహబూబ్‌నగర్ జిల్లా నేరళ్లపల్లిలోని నేలబండతండా గిరిజనులతో మంత్రి లక్ష్మారెడ్డి.. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలానికి చెందిన నాయీ బ్రాహ్మణులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి.. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గొంగిడి మహేందర్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరుతున్న పల్లెర్ల వాసులు

ప్రాణంమీదకు తెచ్చిన చిట్టీల తగాదా

మహిళ గొంతు కోసి ఆపై ఆత్మహత్య చేసుకున్న మరో మహిళ

పటాన్‌చెరు రూరల్, నమస్తే తెలంగాణ: చిట్టీ విషయంలో గొడవ తీవ్రతరమై చోటు చేసుకున్న ఘర్షణలో ఓ మహిళ మృతిచెందగా.. మరో మహిళ దవాఖానలో చికిత్స పొందుతున్నది. తనకు బాకీ పడ్డ చిట్టీ డబ్బులు ఇవ్వడం లేదని నెపంతో ఓ మహిళ తన స్నేహితురాలి గొంతుగోసింది. చనిపోతుందేమోనని ఆందోళనతో తానూ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరధిలోని బీడీఎల్ టౌన్‌షిప్‌లో సోమవారం చోటుచేసుకున్నది. పోలీసులు, కాలనీవాసులు తెలిపిన కథనం ప్రకారం వివరాలివి. బీడీఎల్ టౌన్‌షిప్‌లో నివాసముండే అనిత (42), హిమసుధ (40) స్నేహితులు. వారికి చిట్టీ డబ్బుల విషయంలో గొడవలు జరిగాయి. హిమసుధకు అనిత చీటీ డబ్బులు బాకీ పడింది. బాకీ పడ్డ డబ్బుల విషయం మాట్లాడేందుకు హిమసుధ.. అనిత ఇంటికి వచ్చి తన డబ్బులు ఇవ్వాలని కోరింది. ప్రస్తుతం తనదగ్గర డబ్బులు లేవని తర్వాత ఇస్తానని అనిత చెప్పడంతో హిమసుద ఆగ్రహానికి లోనయి. పదుపైన వస్తువుతో అనిత గొంతును కోసింది. ఆమెకు తీవ్రరక్తస్రావం అవుతుండటంతో ఆందోళన చెందిన హిమసుధ అనిత ఇంట్లోనే ఓ గదిలోకి వెళ్లి గడీయవేసుకుని ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అనిత గాయాలతో బాధపడుతుండగా స్థానికులు గమనించి బీడీఎల్ పోలీసులకు సమాచారం అందజేశారు. సీఐ వేణుగోపాల్‌రెడ్డి తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకుని అనితను చందానగర్‌లోని ఓ ప్రయివేటు దవాఖానకు తరలించి చికిత్సచేస్తున్నారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నది. ఆత్మహత్యకు పాల్పడ్డ హిమసుధ మృతదేహాన్ని పటాన్‌చెరురూరల్ దవాఖానాకు తరలించారు. ఇరు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

17 నుంచి యాదాద్రి బ్రహ్మోత్సవాలు

యాదాద్రి భువనగిరి ప్రతినిధి, నమస్తే తెలంగాణ: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 17 నుంచి 27 వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. సోమవారం సాయంత్రం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యాదాద్రి ఆలయ ఈవో ఎన్ గీత మాట్లాడుతూ.. 23న శ్రీవారి ఎదుర్కోలు మహోత్సవం, 24న కల్యాణం నిర్వహిస్తామన్నారు. సీఎం కేసీఆర్ సతీసమేతంగా కల్యాణోత్సవానికి హాజరై పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారని తెలిపారు. 25న దివ్యవిమాన రథోత్సవం, 26న మహాపూర్ణాహుతి, చక్రతీర్థం, 27న అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహిస్మాన్నారు. రాత్రి 9 గంటలకు శృంగార డోలోత్సంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

ఏవోబీలో ఎదురు కాల్పులు

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: ఆంధ్ర, ఒడిశా సరిహద్దుల్లో చిత్రకొండ పోలీసుస్టేషన్ పరిధిలోని అటవీప్రాంతంలో సోమవారం పోలీసులు, మావోయిస్టుల మధ్య భీకరమైన ఎదురుకాల్పులు జరిగాయి. మల్కన్‌గిరి జిల్లా జోబండ అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రేహౌండ్స్, ఎస్‌ఓజీ బలగాలు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహించాయి. కూంబింగ్ పార్టీ కదలికలను గమనించిన మావోయిస్టులు కాల్పులు జరిపారు. అప్రమత్తమైన పోలీసులు కూడా ఆత్మరక్షణకు ఎదురుకాల్పులు జరుపగా మావోయిస్టులు పారిపోయారు. ఆ ప్రాంతంలో పెద్దమొత్తంలో పేలుడు పదార్థాలు లభించాయని మల్కన్‌గిరి పోలీసులు తెలిపారు.

దుబాయ్‌లో లచ్చపేటవాసి మృతి



స్వామి (ఫైల్)

దుబ్బాక, నమస్తే తెలంగాణ: సిద్దిపేట జిల్లా దుబ్బాక నగరపంచాయతీ పరిధిలోని లచ్చపేటకు చెందిన ఇస్తారిగల్ల స్వామి(45) దుబాయ్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. స్వామి వాటా బంది ప్రకారం ఐదేండ్ల కోసారి గ్రామసేవకుడిగా పని చేసేవాడు. ఏడాది క్రితం బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లాడు. సోమవారం ఉదయం కంపెనీలో పనిచేస్తుండగా గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య రాణి, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి బాధిత కుటుంబాన్ని పరమర్శించారు. దుబాయ్ నుంచి మృతదేహన్ని కుటుంబీకులకు అప్పగించేందుకు కృషి చేస్తామని హామీఇచ్చారు.

రోడ్డుప్రమాదంలో చిరుత మృతి

కళేబరాన్ని స్వాధీనం చేసుకున్న ఫారెస్టు అధికారులు

నిజామాబాద్ క్రైం: నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం జగ్గారావు ఫారం ప్రాంతంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని చిరుతపులి మృతి చెందింది. అటవీ ప్రాంతం నుంచి రోడ్డు పైకి వచ్చిన చిరుతపులి రోడ్డు దాటుతుండగా వేగంగా వస్తున్న వాహనం ఢీకొని మృతిచెందింది. స్థానికులు గమనించి నవీపేట్ పోలీసులకు, ఫారెస్టు అధికారులకు సమాచారం అందించగా ఫారెస్టు అధికారి రవిమోహన్‌భట్ చిరుత కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు.

చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో గుండెపోటుతో టీటీఐ మృతి

ఖిలావరంగల్: చెన్నై సెంట్రల్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే చార్మినార్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో విధులు నిర్వహిస్తున్న టీటీఐ గుండెపోటుతో మృతి చెందారు. సికింద్రాబాద్ తుకారాంగేటుకు చెందిన కలపాల గిల్‌బర్ట్ విక్టర్(56) దక్షిణ మధ్యరైల్వే సికింద్రాబాద్ డివిజనల్ పరిధిలో టీటీఐగా పనిచేస్తున్నారు. విధుల్లో భాగంగా ఆదివారం గోదావరి ఎక్స్‌ప్రెస్ ద్వారా విజయవాడకు చేరుకున్నారు. అక్కడి నుంచి చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలులో విధులు నిర్వహిస్తూ సికింద్రాబాద్‌కు వెళుతున్నారు. తనకు ఆరోగ్యం సరిగా ఉండకపోవడంతో తన భార్యను తోడుగా తీసుకొని విధులు నిర్వహిస్తున్నారు. చార్మినార్ రైలు వరంగల్ రైల్వేస్టేషన్‌కు సమీపిస్తుండటంతో ఒక్కసారిగా గిల్‌బర్ట్ విక్టర్ అస్వస్థతకు గురయ్యారు. భార్య నిర్మలారాణి వెంటనే రైల్వే ఉన్నతాధికారులకు విషయం చెప్పడంతో వారు హుటాహుటిన 108 సహాయంతో వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. 108 సిబ్బంది పరీక్షలు నిర్వహించి మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతదేహన్ని వరంగల్ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చలి వణుకు

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
సంగారెడ్డి	36.0	15.7
రంగారెడ్డి	35.8	16.0
వికారాబాద్	36.2	16.3
మహబూబ్‌నగర్	34.8	16.3
కామారెడ్డి	35.9	16.6
నాగర్‌కర్నూల్	34.9	16.6
నల్లగొండ	35.3	18.8
మెదక్	34.9	16.9
జోగుళాంబ గద్వాల	34.6	17.0
నిజామాబాద్	35.3	17.2
జయశంకర్ భూపాలపల్లి	35.9	17.2
కుమ్రంభీం ఆసిఫాబాద్	34.9	17.3
ఆదిలాబాద్	34.6	17.4
నిర్మల్	35.7	17.4
వనపర్తి	34.4	17.5
మహబూబాబాద్	35.8	17.5
భద్రాద్రి కొత్తగూడెం	35.8	17.7
రాజన్న సిరిసిల్ల	34.9	18.2
మంచిర్యాల	34.9	18.4
మేడ్చల్	34.6	18.4
ఖమ్మం	35.3	18.4
పెద్దపల్లి	34.9	18.7
వరంగల్ రూరల్	34.6	18.7
కరీంనగర్	34.9	18.8
సూర్యాపేట	36.0	18.9
సిద్దిపేట	34.8	19.0
జనగామ	35.7	19.0
యాదాద్రి భువనగిరి	35.2	19.4
జగిత్యాల	35.2	19.4
వరంగల్ అర్బన్	32.6	19.5
హైదరాబాద్	34.6	19.8



నిరుపేద ఇంటి నిర్మాణానికి విద్యార్థుల చేయూత

దేవరుప్పుల: ఓ నిరుపేద ఇంటి నిర్మాణానికి ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు రూ.1.5 లక్షల విరాళాన్ని అందించి మానవత్వాన్ని చాటారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలోని బాలయేసు ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రామంలోని నిరుపేద దళితుడు, వికలాంగుడైన చింత ప్రవీణ్ ఇంటి నిర్మాణం కోసం ముందుకొచ్చారు. ప్రతి క్రిస్మస్ పండుగకు ఓ సత్కార్యం చేస్తుంటారు. ఇందులో భాగంగా విద్యార్థులు పాఠశాల కరెస్పాండెంట్ జేసురాజ్ సూచనల మేరకు రూ.1.50 లక్షల విరాళాలు సేకరించారు. ఈ మొత్తాన్ని సోమవారం నిరుపేద చింత ప్రవీణ్‌కు అందజేశారు.

నమస్తే తెలంగాణ
ఆట
[హైదరాబాద్]
మంగళవారం 13 ఫిబ్రవరి 2018

సాట్స్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు సన్మానం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకొని రాష్ట్రం నుంచి జాతీయ చాంపియన్‌షిప్‌లలో పాల్గొని పతకాలను సాధించిన 350 మంది క్రీడకారులను సన్మానించనున్నట్లు సాట్స్ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి ప్రకటించారు. ఈ నెల 17వ తేదీ సాయంత్రం నగరంలోని ఎల్బీ స్టేడియంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సోమవారం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన రాష్ట్రంలోని క్రీడాకారులు రాణించడానికి కావలసిన సహాయంతోపాటు ప్రోత్సహించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సీఎం చంద్రశేఖరావు ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని, ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని క్రీడాకారులు రాష్ట్రానికి పతకాలను తీసుకురావాలని కోరారు. రెజ్లింగ్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు ఉపయోగించే విధంగా 10 అకాడమీలకు కుస్తీ కిట్లను అందజేస్తున్నట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్ర ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఆర్ ప్రేమ్‌రాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని క్రీడా సంఘాలను సమన్వయం చేస్తూ క్రీడల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో ఉస్మానియా యూనివర్సిటీ ఐయుటీ కార్యదర్శి ప్రొఫెసర్ రాజేశ్‌కుమార్, తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కే రాంరెడ్డి, క్రీడా సంఘాల ప్రతినిధులు ముటా శ్రీనివాస్, పీ సంతోష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

'ఆర్‌టీఐ పరిధిలోకి రావాల్సిందే'

న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)ని సమాచార హక్కు చట్టం పరిధిలోకి తీసుకొచ్చేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు లా కమిషన్ ప్రతిపాదనలను సిద్ధం చేసింది. బీసీసీ చేస్తున్న ప్రతి పని ప్రజలతో సంబంధం కలిగి ఉన్నాయి కాబట్టి కచ్చితంగా ఆర్‌టీఐ పరిధిలోకి రావాల్సిందేనని కమిషన్ స్పష్టం చేసింది. వాస్తవానికి బీసీసీఐ తమిళనాడు సొసైటీస్ యాక్ట్ పరిధిలో నమోదైన ఓ ప్రైవేట్ బాడీ. ఇన్నాళ్లూ తాము ప్రభుత్వాల నుంచి ఎలాంటి నిధులు తీసుకోవడం లేదని, ఫలితంగా ఆర్‌టీఐ తమకు వర్తించదని బోర్డు వాదిస్తున్నది. దీంతో ఈ అంశంపై తేల్చాలని 2016లో సుప్రీంకోర్టు లా కమిషన్‌కు సూచించింది. అన్ని అంశాలను కూలంకషంగా పరిశీలించిన తమ ప్యానెల్ పూర్తిస్థాయి నివేదికను సిద్ధం చేసిందని, దానిని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్‌కు అందజేస్తామని లా కమిషన్ చైర్మన్ బీఎస్ చౌహాన్ తెలిపారు. గత కొన్నేండ్లుగా ప్రభుత్వాల నుంచి పన్ను మినహాయింపులను, స్టేడియాల కోసం భూమిని తీసుకోవడం బీసీసీఐ చేస్తున్నది. కాబట్టి దీనిని పబ్లిక్ బాడీగానే గుర్తిస్తూ ఆర్‌టీఐ పరిధిలోకి తీసుకురావాల్సిందే' అని చౌహాన్ పేర్కొన్నారు.

సుహానాకు స్వర్ణం

న్యూఢిల్లీ: ఐటీటీఎఫ్ ప్రీమియం సర్క్యూట్‌లో భాగంగా జరిగిన ఒమన్ జూనియర్ అండ్ క్యాడెట్ ఓపెన్‌లో భారత టేబుల్ టెన్నిస్ ప్లేయర్ సుహానా సైనీ స్వర్ణంతో మెరిసింది. సోమవారం జరిగిన సింగిల్స్ ఫైనల్లో సుహానా 3-1 (10-12, 11-7, 11-6, 11-8)తో హనా (ఈజిప్టు)పై గెలిచింది. ఆరంభంలో కాస్త తడబడినా.. తర్వాతి సెట్లలో అటాకింగ్ ఆటతీరుతో అదరగొట్టింది. లీగ్ దశలో రినాద్ ఎల్ హసనీ (జోర్డాన్), హెంద్ జజా (సిరియా)లపై వరుస గేమ్‌ల్లో గెలిచింది. సెమీస్‌లో భారత్‌కు చెందిన అనన్యా చందేని ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది.

సెమీస్‌లో తెలంగాణ బాలుర జట్టు

■ ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ టోర్నీ



మహబూబ్‌నగర్ స్పోర్ట్స్: ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలబాలికల హ్యాండ్‌బాల్ టోర్నీలో తెలంగాణ బాలుర జట్టు సెమీస్ చేరగా..బాలికల జట్టు క్వార్టర్ ఫైనల్ చేరింది. సోమవారం బాలుర విభాగంలో జరిగిన క్వార్టర్ ఫైనల్‌లో తెలంగాణ బాలుర జట్టు యూపీపై 24-12 స్కోర్ తేడాతో గెలిచి సెమీస్‌కు చేరగా బాలికల విభాగంలో జరిగిన నాకౌట్ మ్యాచ్‌లో తెలంగాణ బాలికల జట్టు గోవాపై 25-03 స్కోర్‌తో గెలిచి క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. బాలుర విభాగంలో జరగనున్న మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో తెలంగాణ రాష్ట్ర జట్టు ఆంధ్రప్రదేశ్‌తో తలపడనుంది. మన బాలికల జట్టు మహారాష్ట్ర జట్టుతో క్వార్టర్స్‌లో తలపడనుంది.

కొత్త చరిత్రకు సై



రవిశాస్త్రి

కోహ్లీ

సోనీ టెన్-1, టెన్-3లో సాయంత్రం 4.30గంటలకు

జట్లు (అంచనా)

భారత్: కోహ్లీ (కెప్టెన్), రోహిత్, ధవన్, రహానే, శ్రేయాస్/జాదవ్, ధోనీ, పాండ్య, చహల్, కుల్దీప్, బుమ్రా, భువనేశ్వర్.

దక్షిణాఫ్రికా: మార్క్రమ్ (కెప్టెన్), ఆమ్లా, డుమినీ, డివిలీయర్స్, మిల్లర్, క్లాసెన్, బెహార్డిన్/మోరిస్, పెలుక్వాయో, రబాడ, మోర్కెల్, తాహీర్

చరిత్ర సృష్టించేందుకు విరాట్‌సేన ఆరాటం..పరువు కోసం సఫారీల పోరాటం..గత మ్యాచ్ గెలుపు అందించిన ఉత్సాహం వాళ్లది..ఓటమి నేర్పిన గుణపాఠం నుంచి పుట్టుకొచ్చిన ప్రతీకార జ్వాల మనది..వెరసి, పోర్ట్ ఎలిజబెత్‌లో జరుగనున్న ఐదో వన్డేపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది..సిరీస్‌లో తొలిసారిగా భారత ఆధిపత్యాన్ని అడ్డుకున్న దక్షిణాఫ్రికా మరోసారి అదే ఆటతీరు కనబరిచి ఆధిక్యాన్ని పెంచుకోవాలని చూస్తున్నది..మరోవైపు సిరీస్ గెలుపును ఈ మ్యాచ్‌తోనే సాధించాలని టీమ్‌ఇండియా పంతంతో ఉన్నది..మరి విరాట్ సేన పంతం నెగ్గుతుందా..? సఫారీల పట్టు కొనసాగుతుందా..? అనేది ఐదో వన్డేలో తేలనుంది.

- భారత్‌కు కలిసిరాని పోర్ట్ ఎలిజబెత్
- సిరీస్ గెలుపే కోహ్లీసేన లక్ష్యం
- సమం చేసేందుకు దక్షిణాఫ్రికా ఆరాటం
- ఈ మ్యాచ్‌కూ వాన గండం

పోర్ట్ ఎలిజబెత్: మూడు దశాబ్దాల కలను సాకారం చేసుకునేందుకు ఒక్కో అవకాశం చేజారిపోయేలా కనిపిస్తున్న వేళ..టీమ్‌ఇండియా తిరిగి పుంజుకునేందుకు సిద్ధమవుతున్నది. టెస్ట్ సిరీస్‌లో చేతులా దాకా వచ్చిన మ్యాచు ల్లో భారత్ ఓడిన విషయం తెలిసిందే. అయితే మూడో టెస్ట్‌లో పుంజుకుని ఆ తర్వాత వరుసగా మూడు వన్డేల్లోనూ గెలిచింది. ఇప్పుడు కూడా అదే ఉత్సాహంతో, వాండరర్స్ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని చారిత్రక సిరీస్‌ను దక్కించుకోవాలని కోహ్లీ సేన పట్టుదలతో ఉన్నది. మణికట్టు స్పిన్నర్ల ధాటికి చేతులెత్తేసి మూడు మ్యాచుల్లోనూ ఓడిన సఫారీలు..ఆ బలహీనతనే తమ బలంగా మార్చుకున్నామని నాలుగో వన్డే ద్వారా నిరూపించారు. ఇది జట్టులో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపే అంశం. అదే జోరును మళ్లీ చూపిస్తే భారత్‌కు కష్టాలు తప్పవు.

46
పదివేల మైలురాయిని చేరుకోవడానికి ధోనీకి కావల్సిన పరుగులు.

మార్చుకోవాల్సిందే

టీమ్‌ఇండియా సిరీస్ గెలువాలంటే ముందుగా లోపాలను సవరించుకోవాలి. ఆ తర్వాత మైదానంలో కసి చూపించాలి. భారత్ సరిదిద్దుకోవాల్సిన వాటిల్లో మొదట ఓపెనర్ రోహిత్‌శర్మ పేరే ఉంటుంది. వరుసగా నాలుగు మ్యాచుల్లోనూ విఫలమై కేవలం 40 పరుగులే చేసిన ఈ ముంబైకర్ దక్షిణాఫ్రికా పిచ్‌లపై సత్తా చాటాలంటే ఏయే అంశాలను మెరుగుపరుచుకోవాలో.. ఇప్పటికే పలువురు మాజీలు సూచించారు. హార్దిక్ పాండ్య.. బౌలింగ్‌లో ఫరవాలేదనిపిస్తున్నా, బ్యా టింగ్‌లో విఫలమవుతుండడం భారత్‌కు ప్రతికూలంగా మా రింది. బౌలింగ్ విషయానికొస్తే వరుసగా మూడు మ్యాచుల్లోనూ హీరోలుగా నిలిచిన మణికట్టు స్పిన్నర్లు చహల్, కుల్దీప్, నాలుగో వన్డేలో నిలువునా ముంచేశారు. అయితే టీమ్‌మేనేజ్‌మెంట్ మాత్రం వీరి విషయంలో వెన్నుదన్నుగా నిలిచింది. వర్షం పడి మ్యాచ్‌ను కుదించడంతో పరిస్థితులు కొంత ప్రతికూలమయ్యాయని.. స్పిన్నర్లు ఒత్తిడికి గురయ్యారని చెబుతున్నది. ఒకవేళ ఈ మ్యాచ్‌లో అక్షర్ పటేల్‌కు అవకాశం ఇవ్వాలని భావిస్తే, ఆ ఇద్దరు స్పిన్నర్లలో ఒకరిని పక్కన పెట్టక తప్పదు. కానీ జట్టును మార్చడం ఇష్టం లేని కోహ్లీ, అంత సాహసం చేస్తాడా అనేది వేచిచూడాలి.

ప్రత్యామ్నాయం లేదా..

రోహిత్‌ను పక్కనపెట్టి రిజర్వ్ బెంచ్‌లో ఉన్న మరొకరికి అవకాశం ఇస్తారా అంటే కష్టమనే చెప్పాలి. సరైన ప్రత్యామ్నాయం లేకపోవడమే ఇందుకు కారణం. ఒకవేళ కేదార్ జాదవ్, మనీశ్‌పాండే, శ్రేయాస్ అయ్యర్ వంటి యువ బ్యాట్స్‌మెన్‌లో ఒకరిని ఓపెనర్‌గా ప్రమోట్ చేస్తే రాణిస్తారనేది సందేహమే. ఇప్పటికే శ్రేయాస్, జాదవ్‌కు మిడిల్‌లో అవకాశాలు వచ్చాయి. కానీ వాళ్లు సద్వినియోగం చేసుకోలేకపోయారు. నిజానికి రోహిత్ కుదురుకుంటే మ్యాచ్ స్వరూపమే మారిపోతుంది. అలాంటి ఆటగాడిని కీలకమైన మ్యాచ్‌లో పక్కనపెట్టే సాహసం చేయకపోవచ్చు. దీంతో ఈ ద్విశతక వీరుడు ఈ మ్యాచ్‌లోనైనా సత్తాచాటి భారత్ విజయంలో కీలకపాత్ర పోషిస్తే..గత వైఫల్యాలన్నీ మరుగునపడిపోతాయి.

5
పోర్ట్ ఎలిజబెత్‌లో భారత్ ఆడిన మ్యాచ్‌లు. అన్నింటిలోనూ ఓడింది.

17
ఇక్కడ జరిగిన 32 మ్యాచ్‌లల్లో లక్ష్య ఛేదనలో గెలిచినవి.

కొత్త అస్ర్తాలుంటేనే..

ఈ మ్యాచ్‌లో భారత్ సత్తా చాటాలంటే నాలుగో వన్డేలో దొర్లిన పొరపాట్లను సవరించుకోవాలి. ఫీల్డింగ్, క్యాచింగ్‌పై మరింత దృష్టి పెట్టాలి. పోర్ట్ ఎలిజబెత్‌లో గాలులు బాగా వీస్తాయని, క్యాచ్‌లు అందుకునేటపుడు జాగ్రత్తగా ఉండాలని ఫీల్డింగ్ కోచ్ శ్రీధర్ హెచ్చరించాడు. మణికట్టు స్పిన్నర్లను ఇప్పటికే చదివేశామని చెబుతున్న సఫారీలు అందు కు తగ్గట్టుగానే నాలుగో వన్డేలో చెలరేగి ఆడారు. దీంతో ఈ మ్యాచ్‌లో చహల్, కుల్దీప్ కొత్త అస్త్రాలను సంధించేందుకు సిద్ధమవ్వాలి. దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ బలహీనతలపై దెబ్బకొట్టాలి.

పిచ్, వాతావరణం

దక్షిణాఫ్రికాలోని మిగతా పిచ్‌లతో పోలిస్తే ఇది స్లో వికెట్ అని చెప్పాలి. గత 5 మ్యాచుల్లో మూడొందలకు పై చిలుకు స్కోర్లు నమోదయ్యాయి. ఛేజింగ్ చేసిన జట్టు ఇక్కడ ఎక్కువ సార్లు గెలిచింది. ఉదయం ఎండ తీవ్రత ఉన్నా..సాయంత్రం వర్షం కురిసే అవకాశం ఉంది.

ఆమ్లా పరీక్ష

సరైన ఓపెనింగ్ భాగస్వామ్యం లేకపోవడం దక్షిణాఫ్రికా జట్టును వేధిస్తున్న సమస్య. గత నాలుగు మ్యాచుల్లో హాషీమ్ ఆమ్లా (16,23,1,33) , కెప్టెన్ మార్క్రమ్ (9,8,32,22) స్కో ర్లతో విఫలమయ్యారు. దీంతో ఈసారి ఈ జోడీ భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగేందుకు వ్యూహరచన చేసింది. డివిలీయర్స్, డుమినీ, మిల్లర్, క్లాసెన్‌తో మిడిల్ ఆర్డర్ పటిష్టంగా కనిపిస్తున్నది. బెహార్డిన్, మోరిస్‌లలో ఒకరికే అవకాశం దక్కనుంది. గత మ్యాచ్‌లో దుమ్మురేపిన పెలుక్వాయో తన స్థానాన్ని పదిలపరుచుకోగా..పేస్ బౌలర్లు రబాడ, మోర్కెల్ కొనసాగనున్నారు. ఈ మ్యాచ్ కోసం స్పిన్నర్‌ను బరిలోకి దింపాలని భావిస్తున్న దక్షిణాఫ్రికా.. తాహీర్, షమ్సిల్లో ఒకరిని తీసుకునే చాన్స్ ఉంది.

178
ఈ మైదానంలో టీమ్ ఇండియా అత్యధిక స్కోరు.

మన ఓటమికి కారణం ఇతడే..!



అజయ్ రాజ్‌పుత్

మణికట్టు స్పిన్నర్లు చాహల్, కుల్దీప్ స్పిన్ విజృంభణతో దక్షిణాఫ్రికాపై టీమ్‌ఇండియా చరిత్ర సృష్టించేందుకు అడుగు దూరంలో ఉండగా పరిస్థితి తారుమారైంది. జొహాన్నెస్‌బర్గ్‌లో మన ఓటమి వెనుక ఎవరున్నారా అన్నది సగటు క్రికెట్ అభిమానిని వేధిస్తున్న ప్రశ్న. కోహ్లీసేన జోరుకు అడ్డుగా నిలిచింది భారత్‌కే చెందిన అజయ్ రాజ్‌పుత్ అనే స్పిన్నర్. కుడిచేతి స్పిన్నర్‌గానే గాకుండా లెగ్‌స్పిన్ ఇతని అదనపు బలం. దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ ఎక్కడా తడబడుతున్నారో నెట్స్‌లో గుర్తించాడు. అందుకు తగ్గట్లు బౌలింగ్ చేయడం సఫారీలకు కలిసొచ్చింది. ఫలితం చాహల్, కుల్దీప్ బౌలింగ్‌ను అలవోకగా ఎదుర్కొంటూ క్లాసెన్, మిల్లర్ పరుగులు కొల్లగొట్టి విజయం అందించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన అజ య్..ప్రస్తుతం దక్షిణాఫ్రికాలో జొహాన్నెస్‌బర్గ్ ప్రీమియర్ లీగ్ ఆడుతున్నాడు. ఇతని ప్రతిభను గుర్తించిన జొహాన్నెస్‌బర్గ్ క్రికెట్ క్లబ్ చైర్మన్ ఫోన్ చేసి వారి బ్యాట్స్‌మెన్‌కు బంతులు వేయాలని కోరడం సిరీస్ ఫలితాన్ని నిర్దేశించడంలో కీలకమైంది.

ఆధిపత్యం కొనసాగేనా?

దక్షిణాఫ్రికాతో టీ20 మ్యాచ్ నేడు ■ కౌర్ నాయకత్వంలో టీమ్‌ఇండియా



పోట్చెఫ్‌స్ట్రూమ్: ఓవైపు వన్డే సిరీస్ గెలిచిన ఆనందంలో భారత మహిళల జట్టు.. మరోవైపు ప్రతీకారం తీర్చుకోవాలన్న ఆరాటంలో దక్షిణాఫ్రికా మహిళలు.. ఈ నేపథ్యంలో ఇరుజట్ల మధ్య పొట్టి ఫార్మాట్‌కు రంగం సిద్ధమైంది. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా మంగళవారం తొలి మ్యాచ్ జరుగనుంది. తొలి రెండు వన్డేల్లో తిరుగులేని ఆధిపత్యం చూపెట్టిన టీమ్ ఇండియా.. ఆఖరి వన్డేలో కాస్త చతికిలపడింది. అయితే ఇప్పుడున్న ఫామ్ పరంగా చూస్తే టీ20లో భారతే ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నది. కొత్తగా సారథ్య బాధ్యతలు స్వీకరించిన హర్మన్‌ప్రీత్ కౌర్.. విజయంతో సిరీస్‌ను శుభారంభం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఓపెనర్ స్మృతి మందన ఫామ్‌లో ఉండటం కలిసొచ్చే అంశం. ఇక టీ20 స్పెషలిస్ట్ అనుజ పాటిల్, ఆల్‌రౌండర్ రాధా పాటిల్, వికెట్ కీపర్ నుజ్హాత్ పర్వీన్ రాకతో టీమ్‌ఇండియా బ్యాటింగ్ బలం రెట్టింపైంది. అండర్-19 మ్యాచ్‌లో 163 బంతుల్లో 202 పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించిన ముంబై మెరుపుల రాణి 17 ఏండ్ల జెమీమ్ రొడ్రిగ్వేస్ అరంగేట్రానికి సిద్ధమైంది. మిథాలీ, మందనతో పాటు దీప్తి, వేద బ్యాటింగ్‌లో కీలకం కానున్నారు. మూడో వన్డేకు విశ్రాంతి తీసుకున్న పేసర్ జులన్ గోస్వామి ఈ మ్యాచ్‌లో ఆడే అవకాశం ఉన్నది. మరోవైపు వన్డే సిరీస్‌ను చేజార్చుకున్న సఫారీ జట్టు టీ20ల్లో మాత్రం ఆధిపత్యం చూపెట్టాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. డు ప్రీజ్, వోల్‌వార్డ్, లెఫ్టార్మ్ పేసర్ శాబ్నిమ్ ఇస్మాయిల్ ఫామ్‌లో ఉండటం వాళ్లకు కలిసొచ్చే అంశం.

రోహిత్ రాయుడు సెంచరీ

హైదరాబాద్: ఆల్‌రౌండ్ షోతో అదురగొట్టిన హైదరాబాద్ జట్టుకు విజయ్ హజారే ట్రోఫీలో క్వార్టర్స్ ఆశలు సజీవంగా ఉన్నాయి. రోహిత్ రాయుడు (130 బంతుల్లో 130; 11 ఫోర్లు, 3 సిక్సర్లు) సెంచరీతో చెలరేగడంతో సోమవారం జరిగిన గ్రూప్-డి లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ 149 పరుగుల తేడాతో జమ్మూ కశ్మీర్‌పై గెలిచింది. సౌరాష్ట్రతో సమానంగా 12 పాయింట్లు ఉన్న హైదరాబాద్ మరో రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. జమ్మూతో జరిగిన మ్యాచ్‌లో ముందుగా హైదరాబాద్ 50 ఓవర్లలో 312 పరుగులకు ఆలౌటైంది. రోహిత్‌కు తోడుగా సందీప్ (72) రాణించాడు. ఉమర్ నాజిర్ 5 వికెట్లు తీశాడు. తర్వాత జమ్మూ 34.1 ఓవర్లలో 163 పరుగులకే కుప్పకూలింది.

టగ్ ఆఫ్ వార్ జట్టుకు అరుదైన గౌరవం



హైదర్‌నగర్, నమస్తే తెలంగాణ: పంజాబ్‌లోముగిసిన జాతీయ స్థాయి టగ్ ఆఫ్ వార్ పోటీల్లో తెలంగాణ తరపున ప్రాతినిథ్యం వహించి తృతీయ బహుమతి సాధించిన రిషి మహిళా కళాశాల జట్టుకు సీఎం కేసీఆర్, క్రీడా శాఖమంత్రి పద్మారావు చేతులమీదుగా ఘన సన్మానం అందుకునే అరుదైన గౌరవం లభించింది. ఈనెల 17 వ తేదీన ఉదయం 9 గంటలకు ఎల్బీ స్టేడియంలో జరిగే కార్యక్రమానికి హాజరు కావాలని అధికారికంగా అందిన ఆహ్వానం మేరకు ఎల్బీ స్టేడియంకు వెళ్లనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ రాజశ్రీ, ఫిజికల్ డైరెక్టర్ జ్యోతి తెలిపారు.

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
మంగళవారం 13 ఫిబ్రవరి 2018

హిమాచల్ మాజీ సీఎం, ఆయన భార్యకు సమన్లు

మనీల్యాండరింగ్ కేసులో మరో ముగ్గురికి కోర్టు నోటీసులు

న్యూఢిల్లీ: రూ.7 కోట్ల మనీ ల్యాండరింగ్ కేసులో నిందితులుగా ఉన్న హిమాచల్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వీరభద్రసింగ్, ఆయన భార్యతోపాటు మరో ముగ్గురికి ఢిల్లీలోని ప్రత్యేక కోర్టు సోమవారం సమన్లు జారీ చేసింది. ఈ కేసులో నిందితులకు వ్యతిరేకంగా ప్రాథమిక ఆధారాలు లభించినందున వారంతా మార్చి 22న కోర్టులో హాజరుకావాలని ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సంతోష్ స్నేహి ఆదేశించారు. అక్రమ సంపాదన (నేర ఆదాయం) రూ.7 కోట్లను వ్యవసాయ ఆదాయంగా చూపి తన భార్యతోపాటు ఇతరులతో కలిసి ఎల్ఐసీ పాలసీల్లో పెట్టుబడి పెట్టిన కేసులో నిందితుడిగా పేర్కొంటూ వీరభద్రసింగ్‌కు వ్యతిరేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. వీరభద్రసింగ్ భార్య ప్రతిభాసింగ్, యూనివర్సల్ యాపిల్ అసోసియేట్ యజమాని చున్నీలాల్ చౌహాన్, మరో ఇద్దరు నిందితులు ప్రేమ్‌రాజ్, లవన్ కుమార్ రోచ్‌లకు ధర్మాసనం నోటీసులు పంపింది.

స్టెంట్ల ధరల్లో స్వల్పంగా సవరణ

న్యూఢిల్లీ: హృద్రోగులకు వాడే కరోనరీ స్టెంట్ల ధరలను కేంద్రం సవరించింది. సవరించిన ధరలు మంగళవారం నుంచి అమలులోకి వస్తాయి. బార్ మెటల్ స్టెంట్ల (బీఎంఎస్) ధరలను రూ.7400 నుంచి రూ.7,660కి పెంచిన కేంద్రం.. మరోవైపు డ్రగ్ ఎల్యూటింగ్ స్టెంట్ల (డీఈఎస్) ధరను రూ.30,180 నుంచి రూ.27,890కి తగ్గించింది. స్టెంట్ల ధరలను 85 శాతం తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్న తర్వాత దాదాపు ఏడాది తర్వాత స్వల్పంగా సవరిస్తూ నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. కరోనరీ స్టెంట్లపై అమలులో ఉన్న ఆంక్షలు అన్ని రకాల స్టెంట్ల నిల్వలపై అమలవుతాయని పేర్కొన్నది. వాణిజ్య మార్గంలోనే వాటిని విక్రయించాలని స్పష్టం చేసింది.


అలహాబాద్‌లో ఆందోళనకారులు తగులబెట్టిన బస్సు

దళిత విద్యార్థి హత్య

అలహాబాద్‌లో తీవ్ర ఉద్రిక్తత!

అలహాబాద్, ఫిబ్రవరి 12: ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ నగరంలో దళిత విద్యార్థి హత్య తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. హత్య కేసులో నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్‌చేస్తూ సోమవారం కొందరు యువకులు ఆందోళనలు చేపట్టారు. తెలియార్‌గంజ్ వైపు వెళ్తున్న బస్సును నిలిపివేసిన కొందరు యువకులు అందులోని ప్రయాణికులను దింపి బస్సుపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. అలహాబాద్ డిగ్రీ కాలేజీకి చెందిన లా విద్యార్థి దిలీప్ సరోజ్ (24) ఆదివారం ఉదయం ఓ ప్రైవేట్ దవాఖానలో తీవ్రగాయాలతో మరణించాడు. శనివారం రాత్రి కత్ర ప్రాంతంలోని ఓ రెస్టారెంట్ వద్ద ఓ బృందంతో చోటుచేసుకున్న వాగ్వాదం సరోజ్‌పై దాడికి దారితీసింది. రెస్టారెంట్ నుంచి సరోజ్‌ను బయటకు లాక్కొచ్చిన కొందరు అతడిపై రాడ్లు, ఇటుకలతో దాడి చేశారు. దాడికి సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌కావడంతో సోమవారం ఆందోళనలు చెలరేగాయి. సరోజ్‌పై దాడిచేసిన ముగ్గురు నిందితుల్లో ఒకరిని పోలీసులు అరెస్టు చేశారు.

రెండో ప్రపంచ యుద్ధం నాటి బాంబు భయంతో

లండన్ విమానాశ్రయం మూసివేత

లండన్, ఫిబ్రవరి 12: బ్రిటన్ రాజధాని లండన్ విమానాశ్రయాన్ని సోమవారం మూసివేశారు. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో లండన్‌లోని థేమ్స్ నదీ సమీపాన జార్జి వీ డాక్ వద్ద 500 కిలోల బరువుల గల రెండో ప్రపంచ యుద్ధం నాటి బాంబు కనిపించడంతో విమానాశ్రయం నుంచి అన్ని విమాన సర్వీసులు రద్దు చేసినట్లు మెట్రోపాలిటన్ పోలీసులు తెలిపారు. సదరు బాంబును నౌకాదళ సిబ్బంది తొలిగించేందుకు వీలుగా విమాన సర్వీసులు రద్దు చేశామని ప్రభుత్వ అధికార ప్రతినిధి తెలిపారు. దీనివల్ల 16 వేల మంది ప్రయాణికులకు అసౌకర్యం కలుగుతుందన్నారు. లండన్ విమానాశ్రయం నుంచి ప్రయాణం చేయగోరే వారంతా తదుపరి సమాచారం ఇచ్చే వరకు రావద్దని విమానాశ్రయం సీఈవో రాబర్ట్ సింక్లైర్ తెలిపారు.